manavishwam.com

# మన విశ్వం

VOICE OF THE PEOPLE-POWER OF TRUTH

తెలుగు వార్తా దినపత్రిక

MANA VISHWAM TELUGU DAILY

వరంగల్ | సంపుటి : 01 | సంచిక : 71 | గురువారం 27 ఆగస్టు 2026 | పేజీలు : 8 | వెల : రూ.5 | PRGI, NO : TGTEL/26/A4450 | ఎడిటర్ : నమిండ్ల ప్రమోద్







## ప్రళయం

నేపాల్‌లో మెరుపు వరదలు.. సరిహద్దుల్లో భారీ ప్రాణనష్టం..





- హిమాలయాల్లో ప్రకృతి ప్రకోపం..
- కొట్టుకుపోయిన గ్రామాలు, 150 దాటిన మృతుల సంఖ్య
- యాత్రికులు, పర్యాటకుల గల్లంతు..
- రంగంలోకి ఎయిర్‌లిఫ్ట్ బృందాలు, భారత సహాయం
- భారత్‌కు పొంచి ఉన్న ముంపు ముప్పు..
- గండక్ బ్యారేజ్ గేట్లు ఎత్తివేత, తీరప్రాంతాలు ఖాళీ
- బీహార్, ఉత్తరప్రదేశ్ రాష్ట్రాల్లో హై అలర్ట్

నేపాల్-టిబెట్ సరిహద్దు ప్రాంతంలో ఆకస్మికంగా సంభవించిన మెరుపు వరదలు తీవ్ర వినాశనాన్ని సృష్టించాయి. టిబెట్ వైపు నుంచి ప్రవహించే భోటెకోశీ నది ఉగ్రరూపం దాల్చడంతో రసువా జిల్లా పరిధిలోని పలు గ్రామాలు, మార్కెట్లు, జలవిద్యుత్ ప్రాజెక్టు కేంద్రాలు కొట్టుకుపోయాయి. వరదల తాకిడికి వందలాది మంది గల్లంతయ్యారు. వీరిలో దాదాపు 105 మంది భారతీయ పర్యాటకులు ఉన్నట్లు సమాచారం అందుతోంది. పలువురు ప్రాణాలు కోల్పోగా, పలు గ్రామాలు బురదలో కూరుకుపోయాయి. వరదకు గల కారణం భూకంపం సంభవించిన తర్వాత భారీ కొండచరియలు విరిగిపడి నది ప్రవాహాన్ని అడ్డుకోవడం లేదా హిమానీనద సరస్సుల విస్ఫోటం కారణంగా నదిలో ఆకస్మికంగా నీటిమట్టం పెరిగినట్లు అధికారులు భావిస్తున్నారు.

వివరాలు 2లో..

## డిగ్రీ ఉంటే చాలదు.. స్కిల్ ఉండాల్సిందే!



- మారుతున్న ఉద్యోగ మార్కెట్.. నైపుణ్యాలకే పెరుగుతున్న ప్రాధాన్యం
- మార్కులకంటే పని సామర్థ్యంపైనే సంస్థల దృష్టి
- చదువు-పరిశ్రమల అవసరాల మధ్య అంతరమే యువతకు సవాల్
- ఇంటర్న్‌షిప్‌లు, ప్రాక్టికల్ శిక్షణతోనే ఉద్యోగానికి సన్నద్ధత

వివరాలు 2లో..

## ఏపీకి నీళ్లు.. తెలంగాణకు మొండిచేయి!



- అనుమతుల్లేకుండానే ఏపీకి సాగర్ జలాలు: హరీశ్‌రావు
- కేఆర్ఎంబీని లెక్కచేయరా?.. త్రిసభ్య కమిటీ నిర్ణయం అక్కర్లేదా?
- కుడి కాలువలో పారుతున్న నీళ్లే కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యానికి సాక్ష్యం
- తెలంగాణ నీటి హక్కుల పరిరక్షణలో సీఎం విఫలమయ్యారని ధ్వజం
- కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి జోక్యం చేసుకోవాలని డిమాండ్

వివరాలు 2లో..

## 'రాజ్యాంగం చేతిలో కాదు.. చేతల్లో చూపండి!'

### రాహుల్ గాంధీకి ఏలేటి మహేశ్వర్‌రెడ్డి సవాల్



- 22ఏలో ప్రైవేటు భూముల చేర్పుపై మంత్రి క్షమాపణతో సరిపోదు
- పొంగులేటిని మంత్రివర్గం నుంచి తొలగించాలని డిమాండ్
- 2014 నుంచి 22ఏ చేర్పులు, తొలగింపులపై శ్వేతపత్రం విడుదల చేయాలి
- సిట్టింగ్ హైకోర్టు న్యాయమూర్తితో విచారణ జరిపించాలి
- రాహుల్ గాంధీకి బీజేఎల్పీ నేత బహిరంగ లేఖ

**తెలంగాణ బ్యూరో , ఆగస్టు 26 (మన విశ్వం):** "చేతిలో రాజ్యాంగ పుస్తకం పట్టుకుని దేశమంతా తిరిగే రాహుల్ గాంధీ.. ఇప్పుడు అదే రాజ్యాంగ విలువలను చేతల్లో చూపించాలి" అని బీజేఎల్పీ నేత, ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి డిమాండ్ చేశారు. తెలంగాణలో సెక్షన్ 22ఏ నిషేధిత జాబితాలో ప్రైవేటు భూములను చేర్చిన వ్యవహారంపై లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ తక్షణమే జోక్యం చేసుకోవాలని కోరుతూ ఆయన బహిరంగ లేఖ రాశారు. రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డిని మంత్రివర్గం నుంచి తొలగించి, 22ఏ రికార్డులపై శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. 22ఏ జాబితాలో ప్రైవేటు భూములు చేరడంపై రెవెన్యూ మంత్రి స్వయంగా తప్పులు జరిగాయని అంగీకరించి క్షమాపణ చెప్పారని మహేశ్వర్‌రెడ్డి పేర్కొన్నారు." క్షమాపణతో తప్పు చెరిగిపోదు. బాధ్యులపై ఇప్పటివరకు చర్యలెందుకు తీసుకోలేదు? " అని ప్రశ్నించారు. ఈ వ్యవహారానికి నైతిక బాధ్యత వహిస్తూ మంత్రి పదవి నుంచి తప్పుకోవాలని డిమాండ్ చేశారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 300-ఏ పౌరుల ఆస్తి హక్కుకు రక్షణ

మిగతా 2లో..



## కంటైనర్‌ను ఢీకొట్టిన బస్సు.. ఆరుగురు మృతి

- దొరకుంట వద్ద తెల్లవారుజామున ఘోర ప్రమాదం
- హైదరాబాద్ నుంచి ఏలూరు వెళ్తుండగా దుర్ఘటన
- 20 మందికి తీవ్ర గాయాలు.. కొందరి పరిస్థితి విషమం
- ప్రమాద తీవ్రతకు బస్సు ముందుభాగం నుజ్జునుజ్జు

వివరాలు 2లో..



## 15,475 'ఇందిరమ్మ' ఇళ్లకు తుది బిల్లులు

- కేంద్రం రూపాయి ఇవ్వకున్నా.. ఇందిరమ్మకు రాష్ట్రం అండ
- మార్చి 31లోపు పూర్తయిన ఇళ్లకు చెల్లింపులు
- నేడు లబ్ధిదారుల ఖాతాల్లో జమ
- మిగిలిన వారికీ విడతల వారీగా నిధులు

**హైదరాబాద్, ఆగస్టు 26 (మన విశ్వం):** కేంద్రం నుంచి నిధులు రాకున్నా పేదల సొంతింటి కలను సాకారం చేసే విషయంలో వెనక్కి తగ్గేది లేదని రాష్ట్ర ప్రభుత్వం స్పష్టం చేసింది. గ్రామీణ ప్రాంతాల్లో ఇందిరమ్మ ఇళ్లకు కేంద్రం నుంచి ఏడాదిగా ఒక్క రూపాయి కూడా అందలేదని పేర్కొంది. ఇళ్ల నిర్మాణాలు పూర్తిచేసుకుని

మిగతా 2లో..

## బొగ్గు దాటి.. బంగారం బాట!

- కీలక ఖనిజాలపై సింగరేణి దూకుడు
- కర్ణాటకలోని దేవదుర్గ బంగారం-రాగి బ్లాక్‌పై ప్రత్యేక దృష్టి
- దేశ, విదేశాల్లో ఖనిజ వేలాల్లో అవకాశాలు అందిపుచ్చుకోవాలి
- రాగి, లిథియం, కోబాల్ట్, గ్రాఫైట్ రంగాల్లోకి విస్తరించాలి
- గురువారం దేవదుర్గకు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క



**హైదరాబాద్, ఆగస్టు 26 (మన విశ్వం):** బొగ్గు తవ్వకాలకే పరిమితమైన సింగరేణిని కీలక, వ్యూహాత్మక ఖనిజాల రంగంలోనూ అగ్రగామిగా తీర్చిదిద్దాలని రాష్ట్ర ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. ఇందులో భాగంగా కర్ణాటకలోని దేవదుర్గ బంగారం -రాగి ఖనిజ బ్లాక్ లో అన్వేషణ పనులను వేగవంతం చేయాలని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అధికారులను ఆదేశించారు. నైనీ బొగ్గు బ్లాక్‌ను ముందుకు తీసుకెళ్లిన తరహాలోనే దేవదుర్గపైనా ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు.
మహాత్మా జ్యోతిరావు పూలే ప్రజాభవన్‌లో బుధవారం సింగరేణి నూతన ప్రాజెక్టులు, భవిష్యత్ విస్తరణ ప్రణాళికలపై ఆయన ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. దేవదుర్గలో ఇప్పటివరకు చేపట్టిన అన్వేషణ పనులు, భౌగోళిక పరిస్థితులు, ఖనిజ నిక్షేపాల అంచనాకు చేపట్టాల్సిన చర్యలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. పనుల్లో వేగం పెంచేందుకు సమగ్ర కార్యాచరణ రూపొందించాలని ఆదేశించారు. క్షేత్రస్థాయి పరిస్థితులను పరిశీలించేందుకు గురువారం సింగరేణి ఉన్నతాధికారులతో కలిసి దేవదుర్గను సందర్శించనున్నట్లు తెలిపారు.

**బొగ్గుతోనే ఆగొద్దు**

మైనింగ్‌లో శతాబ్దానికి పైగా అనుభవమున్న సింగరేణి ఇక బొగ్గుకే పరిమితం కాకూడదని భట్టి స్పష్టం చేశారు.రాగి, గ్రాఫైట్, లిథియం, కొబాల్ట్ వంటి కీలక ఖనిజాల అన్వేషణ, తవ్వకాల వైపు అడుగులు వేయాలన్నారు. త్వరలో వేలానికి వచ్చే అవకాశం ఉన్న వెనాడియం, టైటానియం వంటి ఖనిజ బ్లాకులను దక్కించుకునేందుకు ముందుగానే వ్యూహం సిద్ధం చేసుకోవాలని సూచించారు. దేశంలోనే కాకుండా అంతర్జాతీయంగా జరిగే ఖనిజ వేలంపాటలనూ ఎప్పటికప్పుడు పరిశీలించాలని ఆదేశించారు.

**విదేశాల్లోనూ వేట**

దక్షిణాఫ్రికా, బ్రెజిల్, ఆస్ట్రేలియా, చిలీ తదితర దేశాల్లో ఖనిజ అవకాశాలను అధ్యయనం చేసేందుకు అంతర్జాతీయ కన్సల్టెంట్లను నియమించినట్లు భట్టి తెలిపారు. సింగరేణికి ప్రయోజనం కలిగించే విదేశీ ప్రాజెక్టులను గుర్తించి ముందుకు

మిగతా 2లో..

## భట్టితో భేటీ.. 'పార్టీ మార్పు'పై కొండా క్లారిటీ!

**హైదరాబాద్, ఆగస్టు 26 (మన విశ్వం):** కుమార్తె కొండా సుస్మిత వ్యాఖ్యలపై కాంగ్రెస్‌లో దుమారం కొనసాగుతున్న వేళ.. మంత్రి కొండా సురేఖ భర్త, పార్టీ సీనియర్ నేత కొండా మురళి ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కను కలవడం ఆసక్తి రేపింది. బుధవారం ప్రజాభవన్‌లో జరిగిన ఈ భేటీపై రాజకీయ వర్గాల్లో రకరకాల ఊహాగానాలు మొదలయ్యాయి. అయితే వాటిని మురళి కొట్టిపారేశారు. ఓ బిల్లు క్లియరెన్స్ పని కోసమే భట్టిని కలిశానని, రాజకీయ అంశాలేవీ చర్చించలేదని స్పష్టం చేశారు. భేటీ సమయంలో మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి అక్కడే ఉన్నారు. అనంతరం ప్రజాభవన్‌కు వచ్చిన మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి కూడా వారితో సమావేశమయ్యారు. కొండా సురేఖ వ్యవహారంపై టీపీసీసీ క్రమశిక్షణ కమిటీ నివేదిక

మిగతా 2లో..

- 'బిల్లు కోసమే కలిశా.. రాజకీయాలపై చర్చించలేదు'
- 'సుస్మిత వ్యాఖ్యలతో మాకేం సంబంధం?.. ఆమెకు స్వతంత్రంగా మాట్లాడే హక్కుంది'
- 'సోనియా, రాహుల్, ప్రియాంకపై పూర్తి విశ్వాసం'
- క్రమశిక్షణ కమిటీ నిర్ణయం వచ్చేదాకా ఇక మాట్లాడనన్న మురళి



## ఫోర్జరీ సంతకాలతో 'రైస్‌మిల్లర్' ఘరానా మోసం?

లెటర్‌హెడ్‌పై నకిలీ సంతకాలు.. భారీగా వడ్ల కోటా పొందినట్లు ఆరోపణ




**మంథని/మల్హర్, ఆగస్టు 25(మన విశ్వం):** తోటి వ్యాపారి అని నమ్మి ఇచ్చిన లెటర్‌హెడ్‌నే అస్త్రంగా చేసుకుని.. సంతకాన్ని ఫోర్జరీ చేసి భారీగా ప్రభుత్వ వడ్లు పొందారన్న ఆరోపణ మంథనిలో కలకలం రేపుతోంది. తనకు తెలియకుండానే తన మిల్లు పేరిట వడ్ల కోటా పొందడంతోపాటు సీఎంఆర్ బియ్యాన్ని ప్రభుత్వానికి అప్పగించకుండా బహిరంగ మార్కెట్‌లో విక్రయించి కోట్ల రూపాయల అక్రమాలకు పాల్పడ్డారని ఓ రైస్‌మిల్లు యజమాని ఆరోపించారు. ఈ వ్యవహారంలో పౌరసరఫరాల శాఖలోని కొందరి పాత్రపైనా అనుమానాలు వ్యక్తం చేశారు. బాధిత మిల్లర్ కథనం ప్రకారం.. మంథని మండలానికి చెందిన మరో రైస్‌మిల్లర్ గతంలో తనకు పరిచయం ఉండటంతో లెటర్‌హెడ్‌ను తీసుకున్నారు. దానిపై తన సంతకాన్ని ఫోర్జరీ చేసి పౌరసరఫరాల శాఖకు పత్రాలు

మిగతా 2లో..

# ఫోర్జరీ సంతకాలతో 'రైస్‌మిల్లర్' ఘరానా మోసం?

(మొదటిపేజీ తరువాయి)

సమర్పించినట్లు ఆయన ఆరోపిస్తున్నారు. తన మిల్లుకు కేవలం రెండు టన్నుల సామర్థ్యమే ఉన్నప్పటికీ.. దానికి మించి పదింతల మేర వడ్లను కోటా కింద పొందినట్లు పేర్కొన్నారు.

**వడ్లు ఒకరి పేరిట.. మిల్లింగ్ మరొకచోట?**

తన మిల్లు పేరిట కేటాయించిన ప్రభుత్వ వడ్లను మరో మిల్లుకు తరలించి మిల్లింగ్ చేసినట్లు బాధితుడు ఆరోపించారు. అనంతరం ప్రభుత్వానికి అప్పగించాల్సిన కస్టమ్ మిల్లింగ్ రైస్ (సీఎంఆర్)ను పూర్తిస్థాయిలో ఇవ్వకుండా బహిరంగ మార్కెట్‌లో విక్రయించారని పేర్కొన్నారు. ఈ వ్యవహారం ద్వారా భారీగా ప్రభుత్వ సొమ్ముకు గండి పడిందని ఆరోపించారు. ఇంత పెద్ద మొత్తంలో వడ్ల కేటాయింపులు, తరలింపు, సీఎంఆర్ అప్పగింత వంటి ప్రక్రియలు అధికారుల పరిశీలన లేకుండా ఎలా జరిగాయన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. పౌరసరఫరాల శాఖలోని కొందరి సహకారంతోనే ఇదంతా జరిగిందని బాధితుడు ఆరోపిస్తున్నారు. దీనిపై సమగ్ర విచారణ జరిపితే అసలు విషయాలు వెలుగులోకి వస్తాయని పేర్కొన్నారు.

**'తప్పు వారిది.. శిక్ష నాకా?'**

అక్రమాల లెక్కలు బయటకు వచ్చిన తర్వాత అసలు బాధ్యులపై చర్యలు తీసుకోకుండా తన మిల్లునే బ్లాక్‌లిస్ట్‌లో చేర్చారని బాధితుడు వాపోయారు. ఫోర్జరీ పత్రాలతో జరిగిన వ్యవహారానికి తనను బాధ్యుడిని చేయడం అన్యాయమని పేర్కొన్నారు. తనకు సంబంధం లేదని ఆధారాలతో వివరిస్తున్నా పట్టించుకోవడం లేదన్నారు. ఈ వ్యవహారంపై రెండేళ్లుగా పోలీసు, పౌరసరఫరాల శాఖ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నా న్యాయం దక్కలేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. హైదరాబాద్ సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో తన గోడును వెల్లడించారు. తన సంతకాన్ని ఫోర్జరీ చేసినట్లు ఆరోపిస్తున్న వ్యక్తిపై క్రిమినల్ కేసు నమోదు చేయడంతోపాటు వడ్ల కేటాయింపులు, సీఎంఆర్ లెక్కలు, బియ్యం తరలింపు వ్యవహారంపై ఉన్నతస్థాయి విచారణ జరిపించాలని ప్రభుత్వాన్ని కోరారు. తన మిల్లుపై విధించిన బ్లాక్‌లిస్ట్‌ను పునఃపరిశీలించి న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు.

మన విశ్వం
VOICE OF THE PEOPLE-POWER OF TRUTH

# హరిత శక్తే.. భవిష్యత్ భరోసా!



ప్రపంచం ఇప్పుడు ఇంధన పరివర్తన ముంగిట నిలిచింది. బొగ్గు, చమురు, సహజవాయువులపై దశాబ్దాలుగా సాగిన ఆధారపడటం వాతావరణ మార్పులు, కాలుష్యం రూపంలో భారీ మూల్యాన్నే మిగిల్చింది. మరోవైపు పెరుగుతున్న అవసరాలకు అనుగుణంగా ఇంధన భద్రతను సాధించడం దేశాలకు సవాలుగా మారింది. ఈ నేపథ్యంలో సౌర, పవన విద్యుత్, విద్యుత్ వాహనాలు, గ్రీన్ హైడ్రోజన్ వైపు భారత్ వేస్తున్న అడుగులు పర్యావరణ పరిరక్షణకే కాదు.. ఆర్థిక స్వావలంబనకూ కీలకం.

భారత్‌కు సూర్యరశ్మి అపారమైన సహజ సంపద. దాన్ని విద్యుత్తుగా మలచడంలో ఇటీవలి కాలంలో గణనీయమైన పురోగతి కనిపిస్తోంది. భారీ సౌర పార్కుల నుంచి ఇళ్ల పైకప్పులపై విద్యుత్ ఉత్పత్తి వరకు వినియోగం విస్తరిస్తోంది. వ్యవసాయంలో సౌర పంపులూ పెరుగుతున్నాయి. పవన విద్యుత్ సైతం ప్రత్యామ్నాయ ఇంధన వనరుగా బలపడుతోంది. ఒకప్పుడు సంప్రదాయ విద్యుత్తుకు అనుబంధంగా కనిపించిన పునరుత్పాదక శక్తి.. ఇప్పుడు దేశ ఇంధన భవిష్యత్తును నిర్దేశించే స్థాయికి చేరుతోంది.

ఇందులో ఆర్థిక ప్రయోజనాలూ కీలకమే. చమురు దిగుమతులపై భారత్ భారీగా ఆధారపడుతోంది. అంతర్జాతీయ మార్కెట్లో ధరల హెచ్చుతగ్గులు దేశ ఆర్థిక వ్యవస్థపైనా ప్రభావం చూపుతున్నాయి. దేశీయంగా స్వచ్ఛ విద్యుత్ ఉత్పత్తి పెరిగితే దిగుమతుల భారం తగ్గుతుంది. అయితే సౌర ప్యానెళ్లు, బ్యాటరీలు, కీలక విడిభాగాల విషయంలో మరోసారి విదేశాలపై ఆధారపడే పరిస్థితి రాకూడదు. హరిత శక్తితోపాటే దేశీయ తయారీ, పరిశోధన, సాంకేతికతకు పెద్దపీట వేయాలి. అప్పుడే ఈ మార్పు ఉపాధి కల్పనకూ బలమైన వేదిక అవుతుంది.

రవాణా రంగంలో విద్యుత్ వాహనాల విస్తరణ మరో కీలక పరిణామం. పెట్రోలు, డీజిల్ వినియోగం తగ్గితే చమురు దిగుమతుల భారంతోపాటు పట్టణాల్లో వాయు కాలుష్యాన్నీ నియంత్రించవచ్చు. కానీ వాహనాల అమ్మకాలు పెరగడమే లక్ష్యంగా ఉండకూడదు. విస్తృతమైన ఛార్జింగ్ కేంద్రాలు, అందుబాటు ధరల్లో బ్యాటరీలు, భద్రతా ప్రమాణాలు, పునర్వినియోగ వ్యవస్థ ఏర్పడాలి. అప్పుడే విద్యుత్ వాహనాల మార్పు నిలకడగా సాగుతుంది.

భవిష్యత్ ఇంధనంగా గ్రీన్ హైడ్రోజన్‌పై ప్రపంచవ్యాప్తంగా అంచనాలు పెరుగుతున్నాయి. ఉక్కు, ఎరువులు, భారీ రవాణా వంటి రంగాల్లో కార్బన్ ఉద్గారాలను తగ్గించేందుకు ఇది కీలక ప్రత్యామ్నాయంగా మారవచ్చు. పునరుత్పాదక విద్యుత్ సామర్థ్యాన్ని సద్వినియోగం చేసుకుంటే భారత్ తన అవసరాలను తీర్చుకోవడమే కాకుండా భవిష్యత్తులో గ్రీన్ హైడ్రోజన్ ఉత్పత్తి, ఎగుమతుల్లోనూ కీలక స్థానాన్ని సంపాదించే అవకాశం ఉంది.

అయితే హరిత ప్రయాణానికి అడ్డంకులూ ఉన్నాయి. సౌర, పవన విద్యుత్ ప్రకృతి పరిస్థితులపై ఆధారపడుతుంది. అందువల్ల విద్యుత్ నిల్వ సామర్థ్యాన్ని భారీగా పెంచాలి. గ్రిడ్‌లను ఆధునికీకరించాలి. బ్యాటరీలకు అవసరమైన కీలక ఖనిజాల సరఫరాలో స్వావలంబన సాధించాలి. గ్రీన్ హైడ్రోజన్ ఉత్పత్తి వ్యయాన్ని తగ్గించాలి. ప్రాజెక్టుల కోసం భూముల సేకరణలో స్థానికుల ప్రయోజనాలు, పర్యావరణ సమతుల్యతను విస్మరించకూడదు. హరిత అభివృద్ధి పేరుతో ప్రకృతికి మరో రూపంలో నష్టం కలిగితే అసలు లక్ష్యమే నీరుగారుతుంది.

ప్రకటనలు, భారీ లక్ష్యాలతోనే ఇంధన విప్లవం సాధ్యం కాదు. కేంద్రం, రాష్ట్రాలు సమన్వయంతో పనిచేయాలి. పరిశోధనకు పెట్టుబడులు పెరగాలి. దేశీయ పరిశ్రమలకు ప్రోత్సాహం లభించాలి. ప్రజలకూ ఈ మార్పులో భాగస్వామ్యం కల్పించాలి. స్వచ్ఛ శక్తి సామాన్యుడికి అందుబాటులోకి వచ్చినప్పుడే హరిత విప్లవానికి సార్థకత.

భారత్ ముందున్నది అరుదైన అవకాశం. ఇంధన భద్రత, పర్యావరణ పరిరక్షణ, పారిశ్రామికాభివృద్ధి, ఉపాధి కల్పన.. ఈ నాలుగింటినీ ఒకే బాటలో నడిపించే శక్తి హరిత ఇంధనానికి ఉంది. నిన్నటి అభివృద్ధికి బొగ్గు, చమురు ఇంధనమైతే.. రేపటి భారతానికి సూర్యుడు, గాలి, గ్రీన్ హైడ్రోజనే బలమైన భరోసా. ఆ అవకాశన్ని అందిపుచ్చుకోవడంలోనే దేశ భవిష్యత్తు ఉంది.

*– నమిండ్ల. ప్రమోద్, ఎడిటర్*

# బొగ్గు దాటి.. బంగారం బాట!

(మొదటిపేజీ తరువాయి)

సాగాలన్నారు. మారుతున్న ఇంధన అవసరాలకు అనుగుణంగా సంస్థను అంతర్జాతీయ స్థాయి మైనింగ్ సంస్థగా తీర్చిదిద్దడమే లక్ష్యమని పేర్కొన్నారు.

బొగ్గు ఉత్పత్తిపైనా గురి

కీలక ఖనిజాల వైపు విస్తరిస్తున్నప్పటికీ సింగరేణి ప్రధాన వ్యాపారమైన బొగ్గు ఉత్పత్తిని విస్మరించొద్దని భట్టి సూచించారు. విద్యుత్ అవసరాలు పెరుగుతున్న నేపథ్యంలో డిమాండ్‌కు అనుగుణంగా ఉత్పత్తి పెంచాలని ఆదేశించారు. ఇంధన భద్రతలో సింగరేణి కీలక పాత్ర పోషించాలన్నారు. తెలంగాణకు జీవనాడిగా ఉన్న సింగరేణిని మరింత బలోపేతం చేసి, లాభదాయక సంస్థగా భవిష్యత్ తరాలకు అందించడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని భట్టి పేర్కొన్నారు. దేవదుర్గను కీలక ఖనిజాల రంగంలో సింగరేణి విస్తరణకు ప్రధాన ద్వారంగా మార్చాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు.

# ఏపీకి నీళ్లు.. తెలంగాణకు మొండిచేయి!

**తెలంగాణ బ్యూరో, ఆగస్టు 26(మన విశ్వం) :** నాగార్జునసాగర్ నుంచి కేఆర్ఎంబీ అనుమతులు లేకుండానే ఆంధ్రప్రదేశ్ వైపు కుడి కాలువకు నీటిని విడుదల చేసుకోవడం దౌర్జన్యమని మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత హరీశ్‌రావు మండిపడ్డారు. ఏపీ వైపు నిండుగా పారుతున్న కుడి కాలువ నీళ్లే తెలంగాణలోని కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యానికి సాక్ష్యమని విమర్శించారు. కేఆర్ఎంబీని లెక్కచేయకుండా, త్రిసభ్య కమిటీ నిర్ణయం కోసం వేచి చూడకుండా ఏపీ అధికారులు నీటిని తరలిస్తుంటే రాష్ట్ర ప్రభుత్వం ఏం చేస్తోందని ప్రశ్నించారు. ఏపీ 47 టీఎంసీల నీటిని కోరిందని, దీనిపై చర్చించి నిర్ణయం తీసుకోవాల్సిన త్రిసభ్య కమిటీ సమావేశమే వాయిదా పడిందని హరీశ్‌రావు పేర్కొన్నారు. నీటి కేటాయింపులపై నిర్ణయం వెలువడకముందే సాగర్ కుడి కాలువ ద్వారా నీటిని తరలించే పరిస్థితి ఎలా వచ్చిందని నిలదీశారు. తెలంగాణ నీటిపారుదల శాఖ నిర్వహణలో ఉన్న సాగర్ డ్యామ్ నుంచి అనుమతుల్లేకుండా నీటిని తీసుకెళ్తుంటే అడ్డుకోవాల్సిన కేఆర్ఎంబీ ఎందుకు మౌనంగా ఉందని ప్రశ్నించారు. "ఒకవైపు శ్రీశైలం నుంచి వెలిగొండ సొరంగం ద్వారా 11 టీఎంసీల నీటిని తరలించారు. ఇప్పుడు సాగర్ కుడి కాలువ నుంచి నీటిని తీసుకెళ్తున్నారు. కరవు పరిస్థితులు పొంచి ఉన్న సమయంలో తెలంగాణకు దక్కాల్సిన ప్రతి చుక్కనూ కాపాడుకోవాల్సింది పోయి ప్రభుత్వం చోద్యం చూస్తోంది" అని ఆరోపించారు. గత రెండేళ్లుగా కృష్ణా జలాల్లో తెలంగాణకు దక్కాల్సిన వాటాను పూర్తిస్థాయిలో వినియోగించుకోలేక ఏపీకి ప్రయోజనం కలిగేలా వ్యవహరించారని విమర్శించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మౌనం రాష్ట్ర తాగు, సాగునీటి ప్రయోజనాలకు నష్టం కలిగిస్తోందని హరీశ్‌రావు ఆరోపించారు. ఏపీ నీటి తరలింపును వెంటనే అడ్డుకుని తెలంగాణ హక్కులను పరిరక్షించాలని డిమాండ్ చేశారు. కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డిపైనా ఆయన ప్రశ్నలు సంధించారు. "తెలంగాణ నీటి హక్కులను కాపాడాల్సిన బాధ్యత కేంద్ర మంత్రిగా మీపై లేదా? ఏపీ నీటి తరలింపు విషయంలో కేఆర్ఎంబీపై ఒత్తిడి తీసుకురావాలి. తెలంగాణకు దక్కాల్సిన ప్రతి చుక్కనూ కాపాడాలి" అని హరీశ్‌రావు డిమాండ్ చేశారు.

## కంటైనర్‌ను ఢీకొట్టిన బస్సు..
# ఆరుగురు మృతి

**దొరకుంట వద్ద తెల్లవారుజామున ఘోర ప్రమాదం**

**హైదరాబాద్ నుంచి ఏలూరు వెళ్తుండగా దుర్ఘటన**

**సూర్యాపేట, ఆగస్టు 26 (మన విశ్వం):** నిద్రలో ఉన్న ప్రయాణికులను ఘోర ప్రమాదం కుదిపేసింది. హైదరాబాద్ నుంచి ఏలూరు వెళ్తున్న ప్రైవేటు ట్రావెల్స్ బస్సు.. రహదారిపై నిలిచి ఉన్న కంటైనర్ లారీని వెనుక నుంచి బలంగా ఢీకొట్టింది. ఈ దుర్ఘటనలో ఆరుగురు మృతి చెందగా.. మరో 20 మంది తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రుల్లో కొందరి పరిస్థితి విషమంగా ఉండటంతో మృతుల సంఖ్య పెరిగే అవకాశమున్నట్లు తెలుస్తోంది. సూర్యాపేట జిల్లా కోదాడ మండలం దొరకుంట శివారులో జాతీయ రహదారిపై బుధవారం తెల్లవారుజామున ఈ ప్రమాదం చోటుచేసుకుంది. హైదరాబాద్ నుంచి 42 మంది ప్రయాణికులతో ఏలూరుకు బయలుదేరిన బస్సు దొరకుంట సమీపానికి చేరుకోగానే రహదారిపై నిలిపి ఉన్న కంటైనర్‌ను వెనుక నుంచి ఢీకొట్టింది. ప్రమాద తీవ్రతకు బస్సు ముందు భాగం పూర్తిగా ధ్వంసమైంది. ప్రయాణికులు అందులో చిక్కుకుపోయారు. ప్రమాద సమయంలో ఎక్కువ మంది గాఢనిద్రలో ఉన్నారు. భారీ శబ్దంతో బస్సు కంటైనర్‌ను ఢీకొట్టడంతో ఒక్కసారిగా హాహాకారాలు మిన్నంటాయి. సమాచారం అందుకున్న పోలీసులు, అత్యవసర సిబ్బంది ఘటనాస్థలికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. బస్సులో చిక్కుకున్న వారిని అతికష్టం మీద బయటకు తీశారు. గాయపడిన వారిని అంబులెన్స్‌లలో కోదాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుల్లో ముగ్గురు పురుషులు, ఇద్దరు మహిళలను గుర్తించినట్లు సమాచారం. మరో మృతుడి వివరాలు తెలియాల్సి ఉంది. మృతుల పూర్తి వివరాలను నిర్ధారించేందుకు పోలీసులు చర్యలు చేపట్టారు. ప్రమాదంతో జాతీయ రహదారిపై కొంతసేపు వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. పోలీసులు ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు. బస్సు డ్రైవర్ నిర్లక్ష్యమే ప్రమాదానికి కారణమా? రహదారిపై కంటైనర్‌ను నిలిపే సమయంలో భద్రతా నిబంధనలు పాటించారా? అనే కోణాల్లో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

# డిగ్రీ ఉంటే చాలదు.. స్కిల్ ఉండాల్సిందే!

**ప్రత్యేక ప్రతినిధి , ఆగస్టు 24 (మన విశ్వం):** చేతిలో డిగ్రీ.. మంచి మార్కులు ఉంటే ఉద్యోగం వచ్చేస్తుందనే పరిస్థితి మారుతోంది. విద్యార్హతతో పాటు 'ఏం చేయగలరు'? అన్నదే ఇప్పుడు నియామకాల్లో కీలకంగా మారుతోంది. సాంకేతిక పరిజ్ఞానం, సమస్య పరిష్కార సామర్థ్యం, కమ్యూనికేషన్, టీమ్‌వర్క్, మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా నేర్చుకునే తత్వం.. ఇవన్నీ ఉద్యోగ సాధనలో ప్రధాన అర్హతలుగా మారుతున్నాయి. ఇటీవలి నివేదికలూ విద్యతోపాటు నైపుణ్యాభివృద్ధి అవసరాన్ని నొక్కిచెబుతున్నాయి.

**పట్టా పునాది.. ప్రతిభే కొలమానం**

డిగ్రీ ప్రాధాన్యం తగ్గిపోలేదు. వైద్యం, న్యాయ, బోధన, పరిశోధన సహా అనేక రంగాల్లో ఉన్నత విద్య తప్పనిసరి. అయితే పట్టాతోనే ఉద్యోగానికి సిద్ధమైనట్లు కాదన్న అభిప్రాయం బలపడుతోంది. నేర్చుకున్న విషయాన్ని ఆచరణలో పెట్టగల సామర్థ్యం ఉందా? కొత్త సాంకేతికతను అందిపుచ్చుకోగలరా? అన్న అంశాలపై కంపెనీలు దృష్టి సారిస్తున్నాయి. దేశంలో నైపుణ్యాల ఆధారిత నియామకాల వైపు సంస్థలు అడుగులు వేస్తున్నప్పటికీ విద్యార్హతలు, మార్కుల ప్రభావం ఇంకా కొనసాగుతోందని 2026 నియామక ధోరణులు చెబుతున్నాయి.

**చదువుకు.. కొలువుకు మధ్య గ్యాప్**

యువత పెద్ద సంఖ్యలో డిగ్రీలతో బయటకు వస్తున్నా పరిశ్రమలు కోరుతున్న నైపుణ్యాలు అందరిలో ఉండటం లేదు. సిద్ధాంత పరిజ్ఞానం ఉన్నా ప్రాయోగిక అనుభవం, విశ్లేషణ, కమ్యూనికేషన్, సమస్య పరిష్కార సామర్థ్యాల్లో లోపాలు ఉద్యోగ అవకాశాలకు అడ్డంకిగా మారుతున్నాయి. ఏఐ, డేటా అనలిటిక్స్, ప్రోగ్రామింగ్, డిజిటల్ నైపుణ్యాలతోపాటు సాఫ్ట్ స్కిల్స్‌కూ డిమాండ్ పెరుగుతోంది. దీంతో కళాశాల స్థాయి నుంచే ఇంటర్న్‌షిప్‌లు, ప్రాజెక్టులు, పరిశ్రమలతో అనుసంధానం, ప్రాయోగిక శిక్షణకు పెద్దపీట వేయాల్సిన అవసరం ఏర్పడింది. కేంద్ర ప్రభుత్వ విధానాలూ విద్య-నైపుణ్యాల అనుసంధానంపై దృష్టి సారిస్తున్నాయి.

**డిగ్రీ ప్లస్ స్కిల్.. అదే విజయ సూత్రం**

డిగ్రీనా? నైపుణ్యమా? అన్నది కాదు.. రెండూ ఉన్నాయా? అన్నదే భవిష్యత్ ఉద్యోగ మార్కెట్‌లో కీలకం. డిగ్రీ విజ్ఞానానికి పునాది వేస్తే.. నైపుణ్యం దాన్ని పనితనంగా మార్చుతుంది. అందుకే విద్యాసంస్థలు పట్టాలు అందించడానికే పరిమితం కాకుండా పరిశ్రమలకు అవసరమైన నైపుణ్యాలతో యువతను తీర్చిదిద్దాలి. విద్యార్థులూ మార్కుల కోసం చదవడం నుంచి.. ' ఉద్యోగానికి పనికొచ్చేలా నేర్చుకోవడం ' వైపు అడుగులు వేయాలి.

# 'రాజ్యాంగం చేతిలో కాదు.. చేతల్లో చూపండి!'

(మొదటిపేజీ తరువాయి)

కల్పిస్తోందని మహేశ్వర్‌రెడ్డి పేర్కొన్నారు. ప్రభుత్వ, సామాజిక ఆస్తులను పరిరక్షించేందుకు ఉద్దేశించిన రిజిస్ట్రేషన్ చట్టంలోని సెక్షన్ 22ఏను దుర్వినియోగం చేసి చట్టబద్ధమైన పట్టా భూములను నిషేధిత జాబితాలో చేర్చారని ఆరోపించారు. దీంతో రైతులు, మధ్యతరగతి కుటుంబాలు అత్యవసర సమయాల్లో సొంత భూములను విక్రయించుకోలేని పరిస్థితి ఏర్పడిందన్నారు. భూములను నిషేధిత జాబితా నుంచి తొలగించుకునేందుకు ప్రజలు కార్యాలయాల చుట్టూ తిరగాల్సి వస్తోందని, ఈ ప్రక్రియలో భారీ అవినీతి జరుగుతోందని ఆరోపించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ధరణి, 22ఏ వ్యవస్థలను దుర్వినియోగం చేశారని విమర్శించిన కాంగ్రెస్.. అధికారంలోకి వచ్చాక అదే విధానాన్ని మరింత తీవ్రతరం చేసిందని ధ్వజమెత్తారు.

**'42 వేల ఎకరాలపై మీ మంత్రి చెప్పలేదా?'**

యాదాద్రి భువనగిరి జిల్లాలో దాదాపు 42 వేల ఎకరాలను నిషేధిత జాబితాలో చేర్చిన అంశాన్ని కాంగ్రెస్‌కే చెందిన మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి బహిరంగంగా ప్రస్తావించారని మహేశ్వర్‌రెడ్డి పేర్కొన్నారు. భూములను 22ఏలో చేర్చి, అనంతరం డీనోటిఫికేషన్ పేరుతో వసూళ్లకు పాల్పడుతున్నారనే తీవ్ర ఆరోపణలు ఉన్నాయని పేర్కొన్నారు. కొన్ని కార్పొరేట్ సంస్థలు, భూ లావాదేవీలపైనా విచారణ జరగాలని డిమాండ్ చేశారు.

**2014 నుంచి లెక్కలు బయటపెట్టాలి**

2014 నుంచి ఇప్పటివరకు సెక్షన్ 22ఏ కింద ఏయే సర్వే నంబర్లను నిషేధిత జాబితాలో చేర్చారు? ఎన్నింటిని తొలగించారు? ఏ కారణాలతో మార్పులు చేశారు? అనే వివరాలన్నింటితో ప్రభుత్వం శ్వేతపత్రం విడుదల చేయాలని మహేశ్వర్‌రెడ్డి డిమాండ్ చేశారు. ధరణి డిజిటలైజేషన్‌కు సంబంధించిన ఆడిట్ నివేదికనూ ప్రజల ముందుంచాలన్నారు. 22ఏ వ్యవహారంలో ఆర్థిక లావాదేవీలు, క్విడ్ ప్రో కో ఆరోపణలపై సిట్టింగ్ హైకోర్టు న్యాయ మూర్తితో స్వతంత్ర న్యాయ విచారణ జరిపించాలని కోరారు. చట్టబద్ధమైన ప్రైవేటు పట్టా భూములను నిషేధిత జాబితా నుంచి తొలగించేందుకు నిర్దిష్ట గడువుతో ప్రత్యేక యంత్రాంగం ఏర్పాటు చేయాలన్నారు. " రాజ్యాంగ నైతికతపై ప్రసంగించడం కాదు.. సొంత పార్టీ ప్రభుత్వంలో తప్పులు జరిగినప్పుడు చర్యలు తీసుకోవడమే నిజమైన నిబద్ధత. రాహుల్ గాంధీ మౌనం వీడాలి. రాజ్యాంగాన్ని చేతిలో కాదు.. చేతల్లో చూపించాలి " అని మహేశ్వర్‌రెడ్డి డిమాండ్ చేశారు.

## 15,475 'ఇందిరమ్మ' ఇళ్లకు
# తుది బిల్లులు

(మొదటిపేజీ తరువాయి)

తుది బిల్లుల కోసం ఎదురుచూస్తున్న వారికి రాష్ట్ర ఖజానా నుంచే చెల్లింపులు చేయాలని నిర్ణయించింది. ఇందులో భాగంగా 15,475 మంది లబ్ధిదారులకు రూ. 185 కోట్లు విడుదల చేసింది. మార్చి 31 నాటికి ఇళ్ల నిర్మాణాలు పూర్తిచేసుకున్న అర్హుల ఖాతాల్లో తుది బిల్లుల మొత్తాన్ని నేడు జమ చేయనున్నట్లు మంత్రి వెల్లడించారు. మిగిలిన లబ్ధిదారులకు విడతల వారీగా చెల్లిస్తామని భరోసా ఇచ్చారు. గ్రామీణ ప్రాంతాల్లో ఇళ్ల మంజూరు, నిధుల కోసం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పలుమార్లు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్‌లను కలిసి విజ్ఞప్తి చేసినట్లు మంత్రి తెలిపారు. రాష్ట్రానికి కేంద్ర మంత్రి వచ్చినప్పుడూ ఈ అంశాన్ని ప్రస్తావించారని, ఇటీవల ఎంపీలతో కలిసి మరోసారి విజ్ఞప్తి చేసినా కేంద్రం నుంచి సానుకూల స్పందన రాలేదన్నారు. ఆర్థిక ఇబ్బందులున్నా పేదల ఇంటి విషయంలో వెనక్కి తగ్గం." కేంద్రం నిధులివ్వకున్నా నిర్మాణాలు పూర్తిచేసుకున్న వారికి రాష్ట్ర ప్రభుత్వమే బిల్లులు చెల్లిస్తుంది. తుది బిల్లు రాని లబ్ధిదారులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు అని మంత్రి స్పష్టం చేశారు".

# ప్రళయం

**నేపాల్‌లో మెరుపు వరదలు.. సరిహద్దుల్లో భారీ ప్రాణనష్టం..**

ఖాట్మండు/న్యూఢిల్లీ, ఆగస్టు 24 (మన విశ్వం) : హిమాలయ పర్వత శ్రేణుల్లో ప్రకృతి ప్రకోపానికి నేపాల్ తీవ్రంగా వణికిపోయింది. నేపాల్-టిబెట్ సరిహద్దు ప్రాంతంలో సంభవించిన ఆకస్మిక మెరుపు వరదలుతీరని విషాదాన్ని మిగిల్చాయి. సరిహద్దు కొండ ప్రాంతాల నుంచి ఒక్కసారిగా పోటెత్తిన భోటెకోశీ, త్రిశూలి నదులు ఉగ్రరూపం దాల్చడంతో నిమిషాల వ్యవధిలోనే వందలాది నివాసాలు, మార్కెట్లు, బహుళ అంతస్తుల భవనాలు, మౌలిక వసతులు నేలమట్టమయ్యాయి. ఈ జలవిలయం ధాటికి ఇప్పటివరకు 157 మందికి పైగా మరణించగా, 400 నుంచి 750 మందికి పైగా ఆచూకీ గల్లంతైంది. ఎగువ నుంచి వస్తున్న ఉద్ధృతి దిగువకు చేరడంతో సరిహద్దు భారత రాష్ట్రాలైన బీహార్, ఉత్తరప్రదేశ్‌లలోని నదీ పరీవాహక ప్రాంతాల్లో రెడ్ అలర్ట్ ప్రకటించారు.

హిమాలయాల్లో ప్రకృతి ప్రకోపం.. కొట్టుకుపోయిన గ్రామాలు, 150 దాటిన మృతుల సంఖ్య నేపాల్ ఎగువ పర్వత ప్రాంతాల్లో మంచు చరియలు విరిగిపడటం, హిమానీనద సరస్సుల నుంచి నీరు ఒక్కసారిగా పోటెత్తడంతో భోటెకోశీ నది ఉప్పొంగింది. రసువా, నువాకోట్, ధాడింగ్ జిల్లాల్లో వరద తీవ్రత అత్యధికంగా ఉంది. రసువాగఢీ సరిహద్దు కస్టమ్స్ కార్యాలయం, స్థానిక మార్కెట్లు, నివాస సముదాయాలు భారీ బురద, శిథిలాల కింద కూరుకుపోయాయి.

ఈ ప్రకృతి విపత్తులో ఇప్పటివరకు 150 మందికి పైగా ప్రాణాలు కోల్పోగా, మరో 400 మందికి పైగా గల్లంతయ్యారు. దాదాపు 19 ప్రధాన వంతెనలు, 40 కిలోమీటర్ల మేర జాతీయ రహదారులు కొట్టుకుపోవడంతో రవాణా వ్యవస్థ పూర్తిగా స్తంభించింది. లాంగ్‌టాంగ్ ఖోలా సహా 6 ప్రధాన జలవిద్యుత్ కేంద్రాలు తీవ్రంగా దెబ్బతిన్నాయి; ప్రాజెక్ట్ టన్నెళ్లలో పనిచేస్తున్న పలువురు కార్మికులు బురదలో చిక్కుకుపోయినట్లు అధికారులు వెల్లడించారు.

యాత్రికులు, పర్యాటకుల గల్లంతు.. రంగంలోకి ఎయిర్‌లిఫ్ట్ బృందాలు, భారత సహాయం టిబెట్‌లోని కైలాస మానసరోవర్ యాత్రకు వెళ్లిన యాత్రికులతో పాటు పెద్ద సంఖ్యలో పర్యాటకులు ఈ ఆకస్మిక వరదల్లో చిక్కుకుపోయారు. గల్లంతైన వారిలో 105 మందికి పైగా భారతీయ యాత్రికులు, ఎన్నారైలు ఉన్నట్లు సమాచారం. రహదారులు తెగిపోవడంతో నేపాల్ ఆర్మీ, ఆర్మ్‌డ్ పోలీస్ ఫోర్స్ దళాలు 14కు పైగా హెలికాప్టర్లతో గగనతలంలో ముమ్మరంగా ఎయిర్‌లిఫ్ట్ సహాయక చర్యలు కొనసాగిస్తున్నాయి.

# భట్టితో భేటీ.. 'పార్టీ మార్పు'పై కొండా క్లారిటీ!

(మొదటిపేజీ తరువాయి)

సమర్పించిన మరుసటి పరిణామాల నేపథ్యంలో వీరంతా ఒకేచోట సమావేశం కావడం పార్టీలో చర్చకు దారితీసింది.

**'ఆమె మాటలకు మాకేం సంబంధం?'**

భట్టితో భేటీ అనంతరం మురళి విలేకరులతో మాట్లాడారు. కుమార్తె చేసిన వ్యాఖ్యలను తమకు ముడిపెట్టడాన్ని తప్పుబట్టారు." సుస్మిత స్వతంత్ర వ్యక్తి. తన అభిప్రాయాన్ని చెప్పే హక్కు ఆమెకు ఉంది. ఆమె మాట్లాడిన మాటలకు నాకుగానీ, సురేఖకుగానీ సంబంధం ఏమిటి? " అని ప్రశ్నించారు. క్రమశిక్షణ కమిటీ ముందు చెప్పాల్సిన విషయాలన్నీ ఇప్పటికే చెప్పామని పేర్కొన్నారు.

**'వందశాతం కాంగ్రెస్‌లోనే'**

కొండా కుటుంబం పార్టీ మారుతుందన్న ప్రచారానికీ మురళి తెరదించారు. సోనియాగాంధీ, రాహుల్‌గాంధీ, ప్రియాంక గాంధీల నాయకత్వంపై తమకు పూర్తి నమ్మకం ఉందన్నారు." కాంగ్రెస్ ను వీడే ఆలోచనే లేదు. వందశాతం పార్టీలోనే కొనసాగుతాం " అని స్పష్టం చేశారు. ఇటీవల పరకాల పర్యటనలో వచ్చే ఎన్నికల్లో సిట్టింగ్ ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మద్దతుగా మాట్లాడటంపై సుస్మిత అభ్యంతరం వ్యక్తం చేశారు. అభ్యర్థులను ఖరారు చేయాల్సింది పార్టీ అధిష్ఠానమైతే.. ముందుగానే అభ్యర్థిని ఎలా ప్రకటిస్తారని ఆమె ప్రశ్నించడం వివాదానికి దారితీసింది. ఈ వ్యవహారంపై టీపీసీసీ క్రమశిక్షణ కమిటీ మంత్రి సురేఖ నుంచి వివరణ తీసుకుని పీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్‌కు నివేదిక అందజేసింది. కుమార్తె వ్యాఖ్యలకు తనను బాధ్యురాలిని చేయడం సరికాదని సురేఖ కమిటీకి వివరించారు. కమిటీ నిర్ణయం వెలువడే వరకు ఈ అంశంపై ఇక మాట్లాడబోనని మురళి పేర్కొన్నారు.

# మాదకద్రవ్యాల నిర్మూలనకు మహిళలే సంఘమిత్రలు

- జనగామలో అవగాహన సదస్సు నిర్వహణ
- ప్రతి మహిళ భాగస్వామి కావాలని పిలుపు
- 112కు సమాచారం ఇవ్వాలని సూచించిన అధికారులు
- డ్రగ్స్ రహిత జిల్లాగా జనగామ లక్ష్యం




**జనగామ, ఆగస్టు 26 (మన విశ్వం):** మాదకద్రవ్యాల నిర్మూలనలో మహిళా సంఘాల పాత్ర అత్యంత కీలకమని, ప్రతి మహిళ తన కుటుంబంతో పాటు గ్రామాలు, పట్టణాలను కూడా మాదకద్రవ్యాల బారిన పడకుండా కాపాడే 'సంఘమిత్ర'గా వ్యవహరించాలని వరంగల్ పోలీస్ కమిషనర్ శ్వేత పిలుపునిచ్చారు. జిల్లా సమీకృత కలెక్టరేట్ కార్యాలయంలో పోలీసు శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన 'సంఘమిత్ర -- మాదకద్రవ్యాల నిర్మూలనపై అవగాహన సదస్సు'లో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా, డీసీపీ రాజమహేంద్ర నాయక్‌తో కలిసి కార్యక్రమాన్ని ప్రారంభించిన కమిషనర్ శ్వేత, తెలంగాణ అభివృద్ధిలో మహిళా సంఘాలు కీలక పాత్ర పోషిస్తున్నాయని పేర్కొన్నారు. కుటుంబ సంక్షేమం, అక్షరాస్యత, పోషకాహారం, సామాజిక అభివృద్ధి వంటి అనేక రంగాల్లో మహిళలు ముందుండి పనిచేస్తున్నారని తెలిపారు. అదే చైతన్యాన్ని ఇప్పుడు సమాజాన్ని మాదకద్రవ్యాల నుంచి రక్షించేందుకు వినియోగించాలని కోరారు.

కమిషనరేట్ పరిధిలో లక్షలాది మంది ప్రజలకు పరిమిత సంఖ్యలో పోలీసు సిబ్బంది మాత్రమే సేవలు అందిస్తున్నందున మహిళా సంఘాల సహకారం ఎంతో అవసరమని ఆమె వివరించారు. పంజాబ్, హర్యానా వంటి రాష్ట్రాల్లో డ్రగ్స్ వ్యసనం సమాజంపై చూపిన ప్రతికూల ప్రభావాలను గుర్తుచేస్తూ, తెలంగాణలో అలాంటి పరిస్థితులు తలెత్తకుండా ఇప్పటి నుంచే అప్రమత్తంగా ఉండాలని సూచించారు. యువతే రాష్ట్ర భవిష్యత్తు అని, వారిని కాపాడటం ప్రతి కుటుంబం బాధ్యత అని పేర్కొన్నారు. డ్రగ్స్‌కు బానిసైన వారిని నేరస్తులుగా కాకుండా బాధితులుగా చూడాలని, వారికి చికిత్స అందించి సాధారణ జీవితంలోకి తీసుకురావడం లక్ష్యమని కమిషనర్ స్పష్టం చేశారు.

గంజాయి విక్రయాలు, రవాణా లేదా వినియోగం గురించి సమాచారం తెలిసిన వెంటనే 112కు సమాచారం అందించాలని కోరారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలు పూర్తిగా గోప్యంగా ఉంచుతామని, అవసరమైతే ప్రోత్సాహక బహుమతులు కూడా అందజేస్తామని వెల్లడించారు. జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా మాట్లాడుతూ, జిల్లాలో సుమారు 1.25 లక్షల మంది మహిళా సంఘాల సభ్యులు ఉన్నారని, వారి ద్వారా ప్రతి ఇంటికి డ్రగ్స్ వ్యతిరేక సందేశాన్ని తీసుకెళ్లవచ్చని అన్నారు. మాదకద్రవ్యాల వల్ల ఆరోగ్య సమస్యలతో పాటు కుటుంబాల్లో గృహహింస, ఆర్థిక ఇబ్బందులు, సామాజిక సమస్యలు పెరుగుతున్నాయని పేర్కొన్నారు. శిక్షణలో నేర్చుకున్న అంశాలను గ్రామాలు, కాలనీలు, సంఘ సమావేశాల్లో చర్చించి యువతను మాదకద్రవ్యాలకు దూరంగా ఉంచేందుకు కృషి చేయాలని సూచించారు. డీసీపీ రాజమహేంద్ర నాయక్ మాట్లాడుతూ, జనగామ జిల్లా మహిళా సంఘాలు రాష్ట్రంలోనే అత్యంత చైతన్యవంతమైన సంఘాలుగా గుర్తింపు పొందాయని అన్నారు. 'సంఘమిత్ర' కార్యక్రమాన్ని నిరంతర ప్రక్రియగా కొనసాగిస్తూ, భవిష్యత్తులో మండల, జిల్లా స్థాయి సమావేశాల్లో డ్రగ్స్ నిర్మూలన, సైబర్ నేరాల నివారణ, మహిళల భద్రత వంటి అంశాలపై మరింత అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు. జిల్లాను మాదకద్రవ్య రహిత జిల్లాగా తీర్చిదిద్దేందుకు అందరూ కలిసికట్టుగా పనిచేయాలని అధికారులు పిలుపునిచ్చారు.

# పల్లెల ప్రగతే ప్రభుత్వ లక్ష్యం

- రూ.4.46 కోట్ల పనులకు శ్రీకారం
- ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేసిన మంత్రి సీతక్క



**ములుగు ప్రతినిధి , ఆగస్టు 26 (మన విశ్వం):** గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని మంత్రి ధనసరి అనసూయ సీతక్క అన్నారు. తాడ్వాయి, ఏటూరునాగారం మండలాల్లో బుధవారం రూ. 4.46 కోట్ల విలువైన అభివృద్ధి పనులకు ఆమె ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేశారు.

తాడ్వాయి వ్యవసాయ మార్కెట్ యార్డులో రూ. 83 లక్షలతో చేపట్టనున్న పనులకు శంకుస్థాపన చేశారు. ఏటూరునాగారం మండలం శివాపూర్‌లో రూ. 80లక్షలతో నిర్మించిన సీసీ రోడ్లు, డ్రైన్లను,గోగుపల్లిలో రూ. 55 లక్షలతో నిర్మించిన అంతర్గత సిసి రోడ్డును ప్రారంభించారు. ఏటూరునాగారం వ్యవసాయ మార్కెట్ యార్డులో రూ. 2.28 కోట్లతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు.

ఈ సందర్భంగా సీతక్క మాట్లాడుతూ మారుమూల పల్లెల్లో రహదారులు, డ్రైనేజీలు సహా అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు నిధులు కేటాయిస్తున్నట్లు తెలిపారు. పనుల్లో నాణ్యతకు ప్రధాన్యమిస్తూ నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమాల్లో గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ రవిచందర్, మార్కెట్ కమిటీ ఛైర్‌పర్సన్ రేగ కళ్యాణి, జిల్లా ఆత్మ కమిటీ ఛైర్మన్ రఘు, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.నిర్ణీత

## కాంగ్రెస్ పార్టీని గ్రామస్థాయి నుంచి బలోపేతం చేయాలి: డీసీసీ అధ్యక్షురాలు ఆత్రం సుగుణక్క, ఎమ్మెల్సీ దండేవిఠల్

**కొమరం భీం, ఆగస్టు 26(మన విశ్వం ):** కౌటాల మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు నికోడే గంగారాం అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం ఘనంగా నిర్వహించారు. ఈ సమావేశానికి కుమురం భీం ఆసిఫాబాద్ డీసీసీ అధ్యక్షురాలు ఆత్రం సుగుణక్క, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఎమ్మెల్సీ దండే విఠల్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.'సంఘటన్ సృజన్ అభియాన్' కార్యక్రమంలో భాగంగా మండల కమిటీ ఎన్నికల ప్రక్రియపై నాయకులు, కార్యకర్తలతో విస్తృతంగా చర్చించారు. అనంతరం మండల కమి టీలో వివిధ బాధ్యతలు చేపట్టేందుకు ఆసక్తి ఉన్న నాయకులు, కార్యకర్తల నుంచి దరఖాస్తులను స్వీకరించారు.




ఈ సందర్భంగా ముఖ్య అతిథులు మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీని క్షేత్రస్థాయి నుంచి మరింత పటిష్టం చేయాలని, నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో ముందుకెళ్లాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ ఛైర్మన్ సుద్దాల దేవయ్య, మాజీ జడ్పీ ఛైర్మన్ సిడం గణపతి, జిల్లా కాంగ్రెస్ నాయకులు, సర్పంచులు, తాజా మాజీ ప్రజాప్రతినిధులు మరియు పార్టీ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# బీఆర్ఎస్‌లో చేరిన బీజేపీ కార్యకర్తలు

- మాజీ మంత్రి లక్ష్మారెడ్డి సమక్షంలో చేరికలు
- సూరారం గ్రామానికి చెందిన పలువురికి గులాబీ కండువాలు
- రాజకీయ పరిణామాలపై విమర్శలు
- పార్టీ బలోపేతానికి కృషి చేయాలని పిలుపు



**మహబూబ్‌నగర్, ఆగస్టు 26 (మన విశ్వం):** మహబూబ్‌నగర్ జిల్లా బాలానగర్ మండలం సూరారం గ్రామానికి చెందిన పలువురు బీజేపీ కార్యకర్తలు, మాజీ వార్డు సభ్యులు బీఆర్ఎస్ పార్టీలో చేరారు. మాజీ మంత్రి డాక్టర్ సి. లక్ష్మారెడ్డి సమక్షంలో జరిగిన కార్యక్రమంలో వారికి గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో మాజీ వార్డు సభ్యులు పూజారి నరసింహులు, రాపల్లె యాదయ్య, పూజారి జగన్, లింగం తదితరులతో పాటు సుమారు 30 మంది కార్యకర్తలు ఉన్నారు. ఈ సందర్భంగా వారిని అభినందించిన లక్ష్మారెడ్డి, పార్టీ సిద్ధాంతాలు, నాయకత్వంపై విశ్వాసంతోనే వారు బీఆర్ఎస్‌లో చేరుతున్నట్లు పేర్కొన్నారు.

ఈ సందర్భంగా మాట్లాడిన మాజీ మంత్రి, రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం పాలనలో విఫలమైందని ఆరోపించారు. అంతర్గత విభేదాలు, పరిపాలనా లోపాల కారణంగా కాంగ్రెస్ ప్రజల విశ్వాసాన్ని కోల్పోతోందని విమర్శించారు. బీజేపీపై కూడా ప్రజల్లో ఆశలు తగ్గుతున్నాయని వ్యాఖ్యానించారు. రాష్ట్ర రాజకీయాల్లో భవిష్యత్తు బీఆర్ఎస్‌కే చెందుతుందని లక్ష్మారెడ్డి ధీమా వ్యక్తం చేశారు. ప్రజల సమస్యల పరిష్కారం, రాష్ట్ర అభివృద్ధి విషయంలో బీఆర్ఎస్‌కు ప్రత్యామ్నాయం లేదని పేర్కొన్నారు. పార్టీ కార్యకర్తలు ప్రజల మధ్య ఉండి పార్టీ బలోపేతానికి కృషి చేయాలని సూచించారు.

పాత, కొత్త అనే తేడా లేకుండా అందరూ సమన్వయంతో పనిచేయాలని ఆయన పిలుపునిచ్చారు. పార్టీని మళ్లీ అధికారంలోకి తీసుకురావడమే లక్ష్యంగా ముందుకు సాగాలని, గ్రామస్థాయి నుంచి పార్టీ నిర్మాణాన్ని మరింత బలోపేతం చేయాలని అన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు. కొత్తగా పార్టీలో చేరిన వారికి నాయకులు శుభాకాంక్షలు తెలియజేస్తూ, పార్టీ కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొనాలని సూచించారు

## మిలాద్ ఉన్ నబీ సందర్భంగా కాగజ్‌నగర్‌లో ఘనంగా ర్యాలీ



**కొమరం భీం/కాగజ్ నగర్, ఆగస్టు 26(మన విశ్వం):** మిలాద్ ఉన్ నబీ పర్వదినాన్ని పురస్కరించుకుని కాగజ్‌నగర్ పట్టణంలో ముస్లిం సోదరులు ఘనంగా ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఎమ్మెల్సీ దండే విఠల్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా ర్యాలీలో పాల్గొన్న ముస్లిం సోదరులకు కాంగ్రెస్ నాయకులు శిరా ప్రసాదాన్ని పంపిణీ చేసి, మిలాద్ ఉన్ నబీ పర్వదిన శుభాకాంక్షలు తెలిపారు.మత సామరస్యం, సోదరభావం, ఐక్యతే సమాజానికి బలమని చాటుతూ కార్యక్రమం ఆత్మీయ వాతావరణంలో కొనసాగింది. అన్ని మతాల ప్రజలు పరస్పరం సోదరభావంతో, శాంతియుతంగా జీవించాలనే సందేశాన్ని నాయకులు ఈ సందర్భంగా వ్యక్తం చేశారు.

# గణేష్ నిమజ్జనానికి పటిష్ఠ ఏర్పాట్లు

- అన్ని శాఖల సమన్వయంతో చర్యలు
- నిమజ్జన ప్రాంతాలను పరిశీలించిన కలెక్టర్
- భక్తులకు ఇబ్బందులు లేకుండా ప్రత్యేక ప్రణాళిక
- భద్రత, ట్రాఫిక్ నియంత్రణపై దృష్టి



**ఖమ్మం, ఆగస్టు 26 (మన విశ్వం):** గణేష్ నవరాత్రి ఉత్సవాలు ప్రశాంత వాతావరణంలో ఘనంగా నిర్వహించుకునేలా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పటిష్టమైన ఏర్పాట్లు చేపట్టాలని జిల్లా కలెక్టర్ దివాకర్ టీఎస్ ఆదేశించారు. ప్రజలకు, భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా గణేష్ నిమజ్జన కార్యక్రమాన్ని సజావుగా నిర్వహించేందుకు ముందస్తు ప్రణాళికతో చర్యలు తీసుకోవాలని సూచించారు.

ఖమ్మం రూరల్ మండలం తీర్థాల వద్ద ఆకేరు నది పరిసర ప్రాంతాల్లో వినాయక విగ్రహాల నిమజ్జనానికి అనువైన ప్రదేశాలు, నీటి మట్టం, రహదారి మార్గాలు, వాహనాల రాకపోకలకు సంబంధించిన ఏర్పాట్లను కలెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. నిమజ్జనం సమయంలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అవసరమైన సౌకర్యాలపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. అనంతరం అదనపు కలెక్టర్ శ్రీనివాస్ రెడ్డి, పోలీసు అధికారులు, స్తంభాద్రి ఉత్సవ కమిటీ సభ్యులతో కలిసి ఖమ్మం నగరంలోని కాల్వొడ్డు మున్నేరు, ప్రకాష్‌నగర్ ప్రాంతాలను సందర్శించారు. అక్కడి నీటి మట్టం, నిమజ్జనానికి అనుకూల పరిస్థితులు, భక్తుల రాకపోకల అంశాలను పరిశీలించారు. భక్తుల మనోభావాలకు అనుగుణంగా మౌలిక వసతులు కల్పించాలని అధికారులను ఆదేశించారు.

నిమజ్జనం జరిగే ప్రాంతాల్లో ప్రజా ప్రకటన వ్యవస్థ, తగినంత విద్యుత్ వెలుగులు, బ్యారికేడ్లు, తాగునీటి సౌకర్యం, మొబైల్ మరుగుదొడ్లు ఏర్పాటు చేయాలని కలెక్టర్ సూచించారు. ప్రమాదాలు జరగకుండా అన్ని రకాల భద్రతా చర్యలు చేపట్టాలని, నిమజ్జన ప్రాంతాల్లో అవసరమైన సౌకర్యాలు ముందుగానే సిద్ధం చేయాలని పేర్కొన్నారు. గజ ఈతగాళ్లు, విపత్తు స్పందన బృందాలను నిమజ్జన ప్రాంతాల్లో అందు బాటులో ఉంచాలని కలెక్టర్ ఆదేశించారు. అత్యవసర పరిస్థితులను ఎదుర్కొనేందుకు రక్షణ పరికరాలు, సిబ్బందిని సిద్ధంగా ఉంచాలని సూచించారు. నీటి లోతు, ప్రవాహ పరిస్థితులను నిరంతరం పర్యవేక్షిస్తూ భక్తుల భద్రతకు ప్రాధాన్యం ఇవ్వాలని తెలిపారు. నిమజ్జనం సందర్భంగా ట్రాఫిక్ రద్దీని నివారించేందుకు ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలని, ప్రధాన మార్గాల్లో పోలీసు సిబ్బందిని మోహరించాలని సూచించారు. ఉత్సవ కమిటీలు, ప్రజలు, అధికారులు పరస్పర సహకారంతో వ్యవహరించి గణేష్ నిమజ్జనాన్ని ప్రశాంతంగా, విజయవంతంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ దివాకర్ టీఎస్ పిలుపునిచ్చారు.

# ప్రతి భారతీయుడికి చెందిన స్వేచ్ఛ స్వాతంత్ర్య దినోత్సవం

ప్రతి సంవత్సరం ఆగస్టు 15 సమీపిస్తుండగా, దేశం మరో స్వాతంత్ర్య దినోత్సవాన్ని జరుపుకోవడానికి సిద్ధమవుతుంది. వీధుల్లో జాతీయ పతాకాలు కనిపిస్తాయి, పాఠశాలల్లో కార్యక్రమాలు నిర్వహిస్తారు, దేశభక్తి గీతాలు మార్మోగుతాయి, భారతదేశానికి స్వాతంత్ర్యం తీసుకువచ్చిన పోరాటాన్ని గుర్తుచేసే ప్రసంగాలు వినిపిస్తాయి.అయితే చాలామంది భారతీయులకు స్వాతంత్ర్య దినోత్సవం కేవలం క్యాలెండర్‌లోని ఒక తేదీ మాత్రమే కాదు. ఇది త్యాగం, ధైర్యం, విదేశీ పాలనను అంగీకరించడానికి నిరాకరించిన సాధారణ ప్రజల సంకల్పంతో సాగిన సుదీర్ఘ ప్రయాణాన్ని గుర్తుచేస్తుంది.భారతీయ ముస్లింలకు ఈ సందర్భం ప్రత్యేకమైన అర్థాన్ని కలిగి ఉంది. వలస పాలనకు వ్యతిరేకంగా ఇతర సమాజాల ప్రజలతో కలిసి పోరాడిన ముస్లింల సేవలను గుర్తు చేసుకోకుండా భారత స్వాతంత్ర్య పోరాట చరిత్రను పూర్తిగా చెప్పలేం. పండితులు, మతపెద్దలు, సైనికులు, కవులు, కార్మికులు, సాధారణ పౌరులు---వివిధ దశల్లో, వివిధ రూపాల్లో ముస్లింలు స్వాతంత్ర్య పోరాటంలో భాగస్వాములయ్యారు. వారి కృషి విస్తృత జాతీయోద్యమానికి వేరైనది కాదు. అది భారతదేశం యొక్క ఉమ్మడి చరిత్రలో ఒక భాగం.

1857 తిరుగుబాటు భారతదేశంలో బ్రిటిష్ అధికారానికి ఎదురైన తొలి ప్రధాన సవాళ్లలో ఒకటిగా నిలిచింది. బహదూర్ షా జఫర్ వంటి నాయకులు ప్రతిఘటనకు ప్రతీకలుగా మారగా, అనేకమంది ముస్లిం సైనికులు, పండితులు, సాధారణ ప్రజలు ఆ తిరుగుబాటులో పాల్గొన్నారు. అనంతరం స్వాతంత్ర్య ఉద్యమంలో మౌలానా అబుల్ కలాం ఆజాద్ వంటి నాయకులు బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా రాజకీయ, మేధోపరమైన ప్రతిస్పందనను రూపొందించడంలో కీలక పాత్ర పోషించారు.

ఖిలాఫత్ మరియు సహాయ నిరాకరణ ఉద్యమాలు కూడా మహాత్మా గాంధీ తదితరుల నాయకత్వంలో భారతీయ ముస్లింలలోని పెద్ద వర్గాలను విస్తృత జాతీయోద్యమంలోకి తీసుకువచ్చాయి. అయితే భారత స్వాతంత్ర్య పోరాటంలో ముస్లింల కృషిని కేవలం ప్రముఖుల పేర్ల జాబితాగా పరిమితం చేయకూడదు. పాఠ్యపుస్తకాలలో పేర్లు కనిపించని అనేకమంది కూడా చరిత్రను నిర్మించారు. జైలు శిక్షలు, ఆర్థిక ఇబ్బందులు, పోలీసుల చర్యలు, సామాజిక ఒత్తిళ్లను ఎదుర్కొన్న పురుషులు, మహిళలు కూడా దేశ స్వాతంత్ర్యానికి తమ వంతు సహకారం అందించారు. వారి త్యాగాల వెనుక ఒక సాధారణ విశ్వాసం ఉంది: భారతదేశం తమ స్వస్థలం, దాని స్వాతంత్ర్యం తమ బాధ్యత.ఈ చరిత్రను గుర్తుంచుకోవడం నేడు ఎంతో ముఖ్యమైనది. ఎందుకంటే స్వాతంత్ర్య పోరాటాన్ని ప్రత్యక్షంగా అనుభవించని తరాలు స్వేచ్ఛను సహజమైనదిగా భావించే అవకాశం ఉంది. కొన్నిసార్లు స్వాతంత్ర్యాన్ని జెండాలు, నినాదాలు, వేడుకలతో కూడిన ఒక కార్యక్రమంగా మాత్రమే పరిమితం చేస్తారు. కానీ స్వేచ్ఛ దానికంటే ఎంతో విస్తృతమైనది.స్వేచ్ఛ అంటే గౌరవంతో జీవించే హక్కు, తమ విశ్వాసాన్ని ఆచరించే స్వేచ్ఛ, చట్టపరమైన పరిధిలో తమ అభిప్రాయాలను వ్యక్తం చేసే అవకాశం, తమ పిల్లలకు విద్య అందించే హక్కు, దేశ సామాజిక మరియు ఆర్థిక జీవితంలో సమానంగా పాల్గొనే అవకాశం కూడా.ఇక్కడే స్వాతంత్ర్య దినోత్సవం యొక్క అర్థం ముస్లిం సమాజానికి ప్రత్యేకంగా ప్రాధాన్యతను సంతరించుకుంటుంది. తరతరాలుగా భారతీయ ముస్లింలు దేశ సంస్కృతి, ఆర్థిక వ్యవస్థ, సాయుధ దళాలు, విద్య, కళలు, క్రీడలు, విజ్ఞానం, ప్రజాజీవితానికి తమ వంతు సేవలు అందించారు. అదే సమయంలో, దేశంతో తమ అనుబంధాన్ని అర్థవంతంగా జరుపుకోవాలంటే హక్కులతో పాటు బాధ్యత కూడా అవసరం.దేశభక్తిని కేవలం నినాదాల స్థాయితో లేదా తరచుగా జాతీయ పతాకాన్ని ప్రదర్శించడంతో కొలవలేం. అది మన రోజువారీ ప్రవర్తనలో ప్రతిబింబిస్తుంది---చట్టాన్ని పాటించడం, తోటి పౌరులను గౌరవించడం, పిల్లలకు విద్య అందించడం, హింసను తిరస్కరించడం, పొరుగువారికి సహాయం చేయడం, ప్రజా ఆస్తులను కాపాడడం,



సమాజానికి నిజాయితీగా సేవ చేయడం వంటి వాటిలో దేశభక్తి కనిపిస్తుంది.అందువల్ల స్వాతంత్ర్య దినోత్సవం కేవలం పాఠశాల కార్యక్రమం లేదా జాతీయ సెలవుదినంగా మిగిలిపోకూడదు. తల్లిదండ్రులు ఈ సందర్భాన్ని ఉపయోగించి భారతదేశ చరిత్రను, స్వాతంత్ర్య ఉద్యమంలో పాల్గొన్న ముస్లింల గురించి పిల్లలకు చెప్పవచ్చు. యువత తమ మతపరమైన గుర్తింపు మరియు జాతీయ గుర్తింపులు ఒకదానికొకటి వ్యతిరేకమైనవి కావని తెలుసుకోవాలి. మతాన్ని ఆచరించే ముస్లింగా ఉండటం, దేశానికి నిబద్ధత కలిగిన భారతీయుడిగా ఉండటం పరస్పర విరుద్ధమైన విషయాలు కావు.భారతదేశ బలం ఎప్పుడూ దాని వైవిధ్యంలోనే ఉంది. స్వాతంత్ర్యం అనంతరం వివిధ మతాలు, భాషలు, సంప్రదాయాలకు చెందిన ప్రజలు ఒకే జాతీయ స్థలంలో కలిసి జీవించగలిగే ప్రజాస్వామ్య గణతంత్రం ఏర్పడింది. ఆ భావన దేశం సాధించిన గొప్ప విజయాల్లో ఒకటి.ఆ వారసత్వాన్ని కాపాడటం ప్రస్తుత తరానికి ఉన్న బాధ్యత. అంటే విద్య, ఉపాధి, వ్యాపార రంగం, ప్రజాసేవ, పౌర జీవితం, జాతీయ అభివృద్ధి వంటి ప్రతి స్థాయిలో దేశంతో అనుసంధానమై ఉండటం. యువత ఆధునిక విద్య, వృత్తిపరమైన నైపుణ్యాలను సంపాదించడంతో పాటు తమ విలువలకు అనుగుణంగా జీవించేలా ప్రోత్సహించాలి.1947లో సాధించిన స్వాతంత్ర్యం వివిధ ప్రాంతాలు, మతాలు, సామాజిక నేపథ్యాలకు చెందిన ప్రజల త్యాగాల ఫలితం. నేటి బాధ్యత భిన్నమైనదైనా అంతే ముఖ్యమైనది---ప్రతి పౌరుడికి స్వాతంత్ర్యం అర్థవంతంగా ఉండేలా చూడటం.భారతదేశ ముస్లింలకు స్వాతంత్ర్య దినోత్సవ సందేశం సరళమైనదిగా, ఆత్మవిశ్వాసంతో కూడినదిగా ఉండవచ్చు.ఈ దేశం మనం కేవలం కనిపించే మరొకరి కథ కాదు. ఇది మన కథ కూడా.దాని స్వాతంత్ర్యంలో మన పూర్వీకుల త్యాగాలు ఉన్నాయి, దాని వర్తమానంలో మన కృషి ఉంది, దాని భవిష్యత్తులో మన బాధ్యత ఉంది.మనపై ఎగురుతున్న త్రివర్ణ పతాకం ప్రతి భారతీయుడికీ చెందుతుంది. అది మనల్ని ప్రతిబింబించే ముందు మనం ఎవరో అడగదు. మన మధ్య భిన్నత్వాలు ఉన్నప్పటికీ, మనం ఒకే దేశాన్ని, ఒకే రాజ్యాంగ హామీని, ఒకే భవిష్యత్తును పంచుకుంటున్నామని అది గుర్తుచేస్తుంది.2026లో స్వాతంత్ర్య దినోత్సవం యొక్క అత్యంత ముఖ్యమైన అర్థం ఇదే కావచ్చు. స్వాతంత్ర్యాన్ని మనం కలిసి సాధించాం. దానిని కాపాడే బాధ్యతను కూడా మనం కలిసి పంచుకోవాలి.

**అల్తాఫ్ మీర్**
**పీహెచ్.డి., జామియా మిల్లియా ఇస్లామియా**

# వచ్చే నెలలో కొత్త పింఛన్ల మంజూరు! - దరఖాస్తు చేసుకొనేందుకు ఆరు రోజులే గడువు

**హైదరాబాద్ :** తెలంగాణలో చేయూత పథకం కింద కొత్త పిం ఛనుదారుల ఎంపిక ప్రక్రియ వచ్చే నెల నుంచి ప్రారంభం కానుంది. పింఛను దరఖాస్తులకు గడువు ఈ నెలాఖరుతో ముగుస్తుంది. సెప్టెం బరు 1 నుంచి క్షేత్రస్థాయి పరిశీలన నిర్వహి ంచాలని రాష్ట్ర పేదరిక నిర్మూలన సంస్థ(సెర్ప్) అన్ని జిల్లాల అధికారులకు తెలియజేసింది. అర్హత కలిగిన వారందరికీ పెన్షన్ సాయం అందేలా ఎంపిక చేయాలని అధికారులు భావిస్తున్నారు. తండాలు, గూడేలు, మారు మూల గిరిజన ఎస్సీ కాలనీలు, పట్టణ ప్రాంతా ల్లోని మురికివాడలకు దరఖాస్తుదారుల పై ప్రత్యే క దృష్టి సారించాలని నిర్ణయించింది. మరో 2,00,000 దరఖాస్తులు వస్తాయని అంచనా : కొత్త పెన్షన్ కోసం ఈ నెల 9 నుంచి దరఖాస్తుల ప్రక్రియ మొదలైంది. మంగళవారం వరకు 3,03,066 మంది అర్జీలు పెట్టుకున్నారు. ఇంకా ఆరు రోజుల గడువు ఉండగా మరో రెండు లక్షల దరఖాస్తులు వస్తాయని సెర్ప్ అంచనా. 2.5 లక్షల మందికి కొత్తగా పెన్షన్లు అందిస్తామని రాష్ట్ర ప్రభుత్వం సెర్ప్ సంస్థ తెలిపింది. ఈ మేరకు గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శులు, పట్టణాల్లో బిల్ కలెక్టర్లు, వార్డు అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఎంపిక ప్రక్రియలో మహిళా సంఘాల సాయం చేయాలని సెర్ప్ సూచించింది. క్షేత్రస్థాయి పరిశీలన అనంతరం అధికారుల నివేదికలు మండల, పట్టణాల ద్వారా జిల్లా కలెక్టర్లకు, అక్కడి నుంచి సెర్ప్ ప్రధాన కార్యాలయానికి చేరుకుంది. వాటిని పరిశీలించి సీఈవో కొత్త లబ్ధిదారులను ఖరారు చేస్తారు. ఆన్‌లైన్ అప్లికేషన్ ప్రక్రియ వేగవంతం : చేయూత పింఛను దరఖాస్తుల ఆన్‌లైన్ ప్రక్రియను వేగవంతం చేశామని డిప్యూటీ కమిషనర్ కె. శ్రీనివాసరావు తెలిపారు. మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో ం 25 మంది ఆపరేటర్లతో ఆప్రక్రియలో మహిళా సంఘాల సాయం చేయా న్‌లైన్‌లో ప్రారంభమైన దరఖాస్తుల ప్రక్రియను ముమ్మరం చేశామని ఆయన చెప్పారు. ఇప్పటివరకు 2,600 దరఖాస్తులను ఆన్‌లైన్‌లో ప్రాసెస్ చేశామన్నారు. 1,660 దరఖాస్తులు పరిశీలనలో ఉన్నాయని, విచారణ పూర్తి చేసిన తర్వాత ఎప్పటికప్పుడు దరఖాస్తుదారుల నుంచి అవసరమైన సేకరిస్తున్నామని ఆయన వెల్లడించారు.



# ధరణితోనే అనేక భూ సమస్యలు.. గత ప్రభుత్వంపై వీహెచ్ ఫైర్

**హైదరాబాద్, ఆగస్టు 26:** గత బీఆర్ఎస్ ప్రభుత్వంపై ప్రభుత్వ సలహాదారుడు వి.హను మంతరావు తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. (బుధవారం) గాంధీభవన్‌లో ప్రజలతో నిర్వహి ంచిన ముఖాముఖి కార్యక్రమంలో వీహెచ్ పాల్గొన్నారు. ప్రజలు, కార్యకర్తల నుంచి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత ప్రభుత్వం ప్రగతి భవన్‌ను కట్టి ప్రజల సమస్యలను చెప్పుకోవడానికి అవకాశాలు ఇవ్వలేదని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం రాగానే ప్రగతి భవన్‌ను ప్రజా భవన్‌గా మార్చి ప్రజా సమస్యల పరిష్కార కేంద్రంగా మార్చారని తెలిపారు. గాంధీభవన్ కూడా ప్రజల సమస్యల పరిష్కార వేదిక అయ్యేలా ముఖాముఖీ కార్యక్రమం చేపట్టారని చెప్పారు. ముఖాముఖి కార్యక్రమంలో.. భూములకు సంబంధించిన సమస్యలే ఎక్కువగా తన దృష్టికి వచ్చినట్లు వీహెచ్ తెలిపారు. పటేల్ పట్వారి విధానం వల్ల భూ సమస్యలు తక్కువగా ఉండేవన్నారు. గత ప్రభుత్వం.. ధరణితో పాటు అనేక సమస్యలు తీసుకోనివచ్చిందని వ్యాఖ్యానించారు. నాడు ఇందిరా గాంధీ పంచిన భూములను మళ్లీ భూస్వాములు అక్రమంగా రిజిస్ట్రేషన్ చేసుకుంటున్నారని తెలిపారు. రిజిస్ట్రేషన్ ఆఫీసులో తప్పిదాలు జరుగుతున్నాయని.. రెవెన్యూ శాఖ మంత్రి పటిష్ట చర్యలు తీసుకోవాలని వి.హనుమంతరావు సూచించారు. వన్ నేషన్ వన్ ఎలక్షన్‌తో నరేంద్ర మోదీ నాలుగోసారి ప్రధాని అవ్వాలని చూస్తున్నారని వీహెచ్ అన్నారు.



# మహిళలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో కాంగ్రెస్ విఫలం

**హైదరాబాద్ :** మహిళా సమానత్వ దినోత్సవం సందర్భంగా ప్రతి మహిళకు సమాన హక్కులు, సమాన అవకాశాలు, సమాన గౌరవం దక్కే సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ పిలుపునిచ్చారు. మహిళా సమానత్వం అనేది కేవలం ఒక నినాదంగా కాకుండా ఆచరణలో కనిపించాల్సిన అంశమని అన్నారు. మహిళల సాధికారతతోనే ప్రతి కుటుంబం, సమాజం మరింత అభివృద్ధి చెందుతాయని పేర్కొన్నారు. మహిళల సంక్షేమం, సాధికారత కోసం అనేక పథకాలు అమలు చేస్తామని ఎన్నికల సమయంలో హామీలు ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వాటిని అమలు చేయడంలో విఫలమైందని పువ్వాడ అజయ్ కుమార్ విమర్శించారు. మహిళలకు ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా మాటలకే పరిమితం చేయడం ద్వారా కాంగ్రెస్ ప్రభుత్వం మహిళలను మోసం చేసిందని ఆరోపించారు. మహిళలకు ఆర్థిక భరోసా కల్పిస్తామని, కుటుంబాలపై ఆర్థిక భారాన్ని తగ్గిస్తామని, యువతులకు ఉపాధి అవకాశాలు కల్పిస్తామని, మహిళల జీవన ప్రమాణాలను మెరుగుపరుస్తామని కాంగ్రెస్ పార్టీ అనేక హామీలు ఇచ్చిందని, హామీల అమలులో స్పష్టత లేకపోవడం, పూర్తిగా విస్మరించిన నేపథ్యంలో మహిళలు తీవ్ర నిరాశకు గురవుతున్నారని అన్నారు. గతంలో మహిళల సంక్షేమం, భద్రత, ఆర్థిక సాధికారతకు ప్రాధాన్యతనిస్తూ అనేక కార్యక్రమాలు అమలు చేసిన ఘనత కేసీఆర్ నాయకత్వంలోని బీఆర్ఎస్ ప్రభుత్వానికి ఉందని మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ పేర్కొన్నారు. మహిళలకు కేవలం పథకాలు ప్రకటించడం కాకుండా వాటిని సమర్థవంతంగా అమలు చేసి, వారి జీవితాల్లో నిజమైన మార్పు తీసుకురావాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు.




# ఆధారాలు చూపించి ఓటు నిలుపుకోండి

**హనుమకొండ:** ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్)కు సంబంధించి తుది దశ ప్రక్రియ హనుమకొండ జిల్లాలో వేగవంతమైంది. మ్యాపింగ్ కాని వారితో పాటు అనామలిస్ (స్పష్టమైన గుర్తింపు లేని ఓటర్లు) జాబితాలో చేరిన ఓటర్లకు బీఎల్‌వోల ద్వారా నోటీసులు జారీ చేస్తున్నారు. జిల్లాలోని వరంగల్ పశ్చిమ, పరకాల అసెంబ్లీ నియోజక వర్గాల పరిధిలోని లక్షలాది ఓటర్ల వివరాలను పరిశీలించగా వేలాది మంది ఓటర్ల డేటాలో వ్యత్యాసాలు ఉన్నట్లు అధికారులు గుర్తించా రు. బీఎల్‌వోల ద్వారా నోటీసులు అందుకుంటున్న వారు ఈ నెల27 నుంచి నిర్ణీత గడువు లోగా తగిన ఆధారాలు చూపించాల్సి ఉంటుందని అధికారులు చెబుతున్నారు. మ్యాపింగ్ కాని, ఆధారాలు సరిగ్గాలేని ఓటర్లకు ఇళ్ల వద్దకే వచ్చి బీఎల్‌వోలు నోటీసులు అందజేస్తున్నారు. 01-07-1987లోపు జన్మించిన వారు నోటీసులు అందుకుంటే 12 రకాల గుర్తింపు కార్డుల్లో ఏదైనా ఒక గుర్తింపు కార్డు చూపిస్తే సరిపోతుంది. 1987 నుంచి 2004 మధ్యలో జన్మించిన వారు తప్పకుండా నోటీసు అందు కున్న వ్యక్తితో పాటు తల్లి లేదా తండ్రికి చెంది న గుర్తింపు కార్డు అందించాల్సి ఉంటుందని అధికారులు స్పష్టం చేస్తున్నారు. సవరణలు, ఆధారాల స్వీకరణ ప్రక్రియ 19 సెప్టెంబరు 2026తో ముగుస్తుంది. క్షేత్రస్థాయి పరిశీలన తర్వాత 19 అక్టోబరు 2026న తుది ఓటరు జాబితా విడుదల కానుంది. 12 రకాల గుర్తింపు కార్డులు ఇవే..నోటీసులు పొందిన ఓటర్లు 12రకాల గుర్తింపు కార్డుల్లో ఏదైనా ఒకదానిని బీఎల్‌వోకి లేదా తహసీల్దార్ కార్యాలయంలో చూపించి తమ ఓటును సరిచేసుకోవాల్సి ఉం టుంది. 1. ఆధార్ కార్డు, 2. భారత పాస్‌పోర్ట్, 3. పాన్ కార్డ్, 4. డ్రైవింగ్ లైసెన్స్, 5. ప్రభుత్వ ఉద్యోగి గుర్తింపు కార్డు, 6. బ్యాంకు లేదా పోస్టాఫీస్ పాస్‌బుక్, 7. మహాత్మా గాంధీ ఉపాధి హామీ జాబ్ కార్డ్, 8. కార్మిక శాఖ జారీ చేసిన హెల్త్ ఇన్సూరెన్స్ కార్డ్, 9. పింఛను బుక్, 10. ఎంపీ, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీల గుర్తింపు కార్డ్, 11. రైతు పాస్‌బుక్ లేదా పట్టాదార్ పాస్‌బుక్, 12. ఎన్పీఆర్ స్మార్ట్ కార్డ్ లను అధికారులకు చూపించాల్సి ఉంటుంది. 132,070 మందికి నోటీసులుజిల్లాలోని వరంగల్ పశ్చిమ, పరకాల ని యోజకవర్గాల్లో మొత్తం 483 పోలింగ్ బూత్‌లు ఉండగా, 407,317 మంది ఓటర్లు ఉన్నట్లు ఈనెల 17తేదీన అధికారులు ఓటర్ల ముసాయిదాను విడుదల చేశారు. ఈ జాబితాలో 132,070 మందికి అధికారులు నోటీసులు అందించనున్నారు. మంగళవారం నాటికి 1821 మందికి బీఎల్‌వోలు నోటీసులు అందజేశారు. నోటీసులు అందుకున్నవారికి నిర్ణీత సమ యం కేటాయిస్తారు. ఆ గడువులోపు ఆధారాలు చూపకుంటే ఓటుహక్కును కోల్పోతారు. ఆ తర్వాత ఆధారాలు తీసుకువచ్చిన అక్టోబరు 15 తర్వాత కొత్త దరఖాస్తులకు ఫారం-6, సవరణలు, పోలింగ్ కేంద్రం మార్పుకు ఫారం-8, అభ్యంతరాల కోసం ఫారం-7 ద్వారా సమర్పి ంచాల్సి ఉంటుంది. సెప్టెంబరు 19 తేదీలోపు ఆధారాలు అందించాలి..ఎన్.రవి, (అదనపు కలెక్టర్, హనుమకొండ)ఎస్ఐఆర్ ప్రక్రియను గడువులోగా పూర్తిచేయాలని ఇటీవల సమీక్షలో కలెక్టర్ ఆదేశించారు. నోటీసులు పొందిన ఓటర్లు నిర్లక్ష్యం చేయకుండా వెంటనే తగిన ఆధారాలతో స్పందించాలి. లేకుంటే అక్టోబరు 19న ప్రచురించే తుది ఓటరు జాబితా నుంచి ఓటు హక్కు తొలగించబడే అవకాశం ఉందని స్పష్టం చేశారు. అనామలిస్ అంటే ఏమిటీ? ఎన్యూమరేషన్ ప్రక్రియలో సరిగా వివరాలు నమోదు కాకపోవడం ద్వారా అనామలిస్ సమస్య తలెత్తింది. ఇంటి పేరు, తండ్రి లేక భర్త పేర్లు తప్పుగా ఉండటం, లేదా వయస్సు నమోదులో వ్యత్యాసాలు ఉండటం చేత, పాతికేళ్ల కిందట వేసిన ఓటుకి, ప్రస్తుత ఓటుకి సంబంధించి సరైన లింక్ లేదా ఆధారాలు చూపకపోవడం, 2002లో ఎక్కడ ఓటు ఉందో చెప్పకపోవడం, తల్లిదండ్రుల వివరాలు ఇవ్వకుండా ఎన్యూమరేషన్ ఫారాన్ని అసంపూర్తిగా నింపి బీఎల్‌వోలకు అప్పగించిన వారిని ఈ అనామలిస్ విభాగంలో చేర్చారు.



# వేగంగా ఎస్ఎల్బీసీ పనులు - రంగంలోకి అత్యాధునిక త్రీఆర్మ్ బూమర్ యంత్రం

**శ్రీశైలం:** ప్రమాదం తర్వాత ఆగిపోయిన ఎస్ఎల్బీసీ పనులు తిరిగి గాడిన పడ్డాయి. పూర్తి భద్రతా చర్యలతో పున:ప్రారంభమై, ఇప్పుడు కీలక దశకు చేరుకున్నాయి. ప్రమాదం జరిగిన షీర్ జోన్‌కు సమాంతరంగా చేపట్టిన బైపాస్ సొరంగం తవ్వకం పూర్తయింది. జపాన్ నుంచి తెప్పించిన అత్యాధునిక త్రీ ఆర్మ్ బూమర్ ద్వారా పనులు మరింత వేగవంతం అవుతాయని అంటున్నారు. 2028 మే లక్ష్యాన్ని చేరుకునేలా సొరంగం పనులను మరింత వేగవంతం చేసేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. ప్రత్యేక బృందంతో పర్యవేక్షణ : శ్రీశైలం ఎడమ గట్టు కాల్వ (ఎస్ఎల్బీసీ) సొరంగం పనులు మళ్లీ వేగం పుంజుకుంటున్నాయి. గతంలో జరిగిన ప్రమాదం అనంతరం కొంతకాలం నిలిచిపోయిన పనులను రాష్ట్ర ప్రభుత్వం కొద్ది నెలల క్రితం తిరిగి ప్రారంభించింది. సొరంగం పనులను పూర్తి చేయడంలో వేగంతో పాటు భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆదేశించారు. సొరంగం పనుల పురోగతిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించేందుకు ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేశారు. సైన్యంలో సొరంగాల నిర్మాణంలో పనిచేసిన నిపుణుడు కల్నల్ పరీక్షిత్ మెహ్రా ప్రత్యేకంగా పర్యవేక్షిస్తున్నారు. ప్రమాదం జరిగిన ప్రాంతంలో భౌగోళిక పరిస్థితులను పూర్తిగా అంచనా వేసిన తర్వాతే ముందుకు వెళ్లేలా చర్యలు చేపడుతున్నారు. బైపాస్ టన్నెల్ పనులు పూర్తి : నేషనల్ జియోఫిజికల్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ ఆధ్వర్యంలో హెలీబోర్న్ సర్వే నిర్వహించారు. సర్వే ద్వారా గుర్తించిన భౌగోళిక పరిస్థితులు, రాతి పొరలు, షీర్‌జోన్లకు అనుగుణంగా తవ్వకాలు చేపడుతున్నారు. చీఫ్ ఇంజినీర్ శ్రీనివాసరెడ్డి, ఇంజినీర్లు తగిన జాగ్రత్తలు తీసుకొని పనులు సాఫీగా సాగేలా చూస్తున్నారు. గతంలో ప్రమాదం జరిగిన ప్రాంతానికి సమాంతరంగా తవ్విన బైపాస్ టన్నెల్ పనులు పూర్తయ్యాయి. తాజాగా ప్రధాన సొరంగం పనులు ప్రమాదం జరిగిన ప్రాంతాన్ని దాటి ముందుకు సాగుతున్నాయి. షీర్ జోన్ ప్రాంతంలో సుమారు 12 మీటర్ల మేర తవ్వకానికి దాదాపు 20 రోజుల సమయం పట్టింది. ఆ తర్వాత మరో 3.5 మీటర్ల మేర తవ్వకం పూర్తయింది. ప్రస్తుతం గట్టి రాతి ప్రాంతం ఎదురవుతుండటంతో పనులు కొంత సులభంగా సాగుతున్నాయని ఇంజినీర్లు చెబుతున్నారు. ప్రమాదం తర్వాత ఇప్పటి వరకు సుమారు 500 మీటర్ల మేర సొరంగం తవ్వకం పూర్తయింది. ఇంకా దాదాపు 9.2 కిలోమీటర్ల సొరంగం తవ్వాల్సి ఉంది. అత్యాధునిక జపాన్ యంత్రం సహాయంతో : సొరంగం పనుల వేగాన్ని మరింత పెంచేందుకు అత్యాధునిక త్రీఆర్మ్ బూమర్ యంత్రాన్ని రంగంలోకి దించారు. జపాన్ నుంచి సుమారు రూ.15 కోట్ల వ్యయంతో ఈ యంత్రాన్ని తీసుకొచ్చారు. ఇప్పటివరకు సొరంగం ఎగువ, దిగువ భాగాల్లో విడివిడిగా తవ్వకాలు చేపట్టాల్సి వచ్చేది. త్రీఆర్మ్ బూమర్ అందుబాటులోకి రావడంతో ఒకేసారి పూర్తి భాగాన్ని తవ్వే అవకాశం ఏర్పడింది. సుమారు 10 మీటర్ల వ్యాసంతో సొరంగం తవ్వే సామర్థ్యం ఈ యంత్రానికి ఉంది. సోమవారం రాత్రి నుంచే త్రీ ఆర్మ్ బూమర్‌తో తవ్వకం ప్రారంభించారు. ఇప్పటివరకు ఔట్ లెట్ వైపు నుంచి సాగిన పనులతో పాటు తాజాగా ఇన్ లెట్ వైపు నుంచి తవ్వకాలు ప్రారంభమయ్యాయి. ఇరువైపులా కలిపి రోజుకు సుమారు 17 మీటర్ల మేర సొరంగం తవ్వాలని అధికారులు లక్ష్యంగా పెట్టుకున్నారు. మరో బూమర్? కోసం కూడా ఆర్డర్ : పనుల వేగాన్ని కొనసాగించేందుకు మరో త్రీఆర్మ్ బూమర్‌ను సెప్టెంబర్ నెలాఖరు నాటికి అందుబాటులోకి రానుంది. అత్యవసర పరిస్థితుల్లో ప్రత్యామ్నాయంగా ఉపయోగించేందుకు మూడో బూమర్‌కు ఆర్డర్ ఇచ్చారు. ఎస్?ఎల్?బీసీ సొరంగం పనులను 2028 మే నాటికి పూర్తి చేయాలన్నది ప్రభుత్వ లక్ష్యం. సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆదేశాలకు అనుగుణంగా పనులను వేగవంతం చేస్తున్నారు. త్రీఆర్మ్ బూమర్ల వినియోగం పెరగడంతో ఇకపై తవ్వకాల వేగం మరింత పెరుగుతుందని



# పాలిటెక్నిక్ కాలేజీల విలీనం వెనుక రేవంత్ రెడ్డి భారీ కుట్ర..




రాష్ట్రంలో మరో భారీ కుంభకోణానికి సీఎం రేవంత్ రెడ్డి తెర తీశారు. కొద్ది రోజులుగా పాలిటెక్నిక్ కాలేజీల విలీనం వద్దని ఉద్యార్థులు రోడ్లపై కొచ్చి ఉద్యమిస్తున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడం అనేక అనుమానాలకు తావిచ్చింది. స్కిల్ యూనివర్సిటీలో పాలిటెక్నిక్ విలీనం వెనుక సీఎం రేవంత్ రెడ్డి భారీ కుట్రకు వ్యూహ రచన చేశారు. దీనిపై తెలుగు స్క్రైబ్ పరిశీలనలో దిమ్మదిరిగే విషయాలు బయటపడటం కలకలం రేపింది. రూ. 30,000 కోట్ల విలువైన 60 పాలిటెక్నిక్ కాలేజీల భూములను కాజేసేందుకే రేవంత్ ప్లాన్ చేసినట్లు తెలిసింది. గత 2 వారాలుగా పాలిటెక్నిక్ విద్యార్థులు రోడ్ల మీదకెక్కి జీవో 97ను రద్దు చేయాలని ఆందోళన చేస్తున్న విషయం తెలిసిందే. ఇంత జరుగుతున్నా మొండిపట్టుదలకు పోయిన రేవంత్.. జీవో 97పై కమిటీ వేసి డైవర్షన్ డ్రామా మొదలు పెట్టారు. పాలిటెక్నిక్ కాలేజీ 1923లో నిజాం హయాంలోనే మాసబ్‌ట్యాంక్ వద్ద ప్రారంభమైంది. 103 ఏళ్లుగా పేద విద్యార్థులకు తక్కువ ఫీజులో అత్యున్నత విద్యను అందిస్తున్నది. మరోవైపు వందల కోట్లతో ప్రారంభించిన రేవంత్ బ్రెయిన్‌చైల్డ్ స్కిల్ వర్సిటీ అట్టర్ ఫ్లాప్ గా మారింది. ఈ నేపథ్యంలో ఒకే దెబ్బకు రెండు పిట్టలు అని భావించిన సీఎం జీవో 97 పేరుతో విలీనం ప్లాన్ చేశాడు. వేల కోట్ల రూపాయల కాలేజీ భూములను కాజేస్తూ.. తన స్కిల్ వర్సిటీని విద్యార్థులపై రుద్దే ప్రయత్నం చేస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. కరీంనగర్ లాంటి నగరాల్లో మెయిన్ రోడ్ కాలేజీ భూములపై రేవంత్ కన్నుపడింది. మొన్న హెచ్‌సీయూ 400 ఎకరాలు.. నిన్న ఉర్దూ వర్సిటీ 50 ఎకరాలు.. నేడు పాలిటెక్నిక్ భూములు ఇలా విలువైన భూములను కొల్లగొట్టేందుకు పక్కా ప్రణాళికతో ముందుకెళ్తున్నట్లు తెలిసింది.


# పార్టీకి కార్యకర్తలే పునాదిరాళ్లు?

**చంద్రుగొండ, ఆగస్టు 26 :** బీఆర్ఎస్ పార్టీకి గ్రామాల్లో కార్యకర్తలే పునాదిరాళ్లు వంటి వారిని అశ్వరావుపేట మాజీ ఎమ్మెల్యే మెచ్చ నాగేశ్వరరావు అన్నారు. బుధవారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చంద్రుగొండ మండలం మద్దుకూరు, రావికంపాడు గ్రామాల్లో గ్రామ కమిటీల ఆధ్వర్యంలో నూతనంగా నిర్మించిన పార్టీ దిమ్మలను ప్రారంభించి పార్టీ జెండాలను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కార్యకర్తలను ఉద్దేశించి మెచ్చ నాగేశ్వరరావు మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ అలివిగానీ హామీలను ఇచ్చి ప్రజలను మోసం చేసిందని దుయ్యబట్టారు. రైతులకు కనీసం ఎరువులు ఇవ్వలేని ప్రభుత్వం భేషరతుగా రైతాంగానికి క్షమాపణ చెప్పాలన్నారు. అనంతరం అయ్యన్నపాలెం గ్రామంలో అకస్మాత్తుగా మృతి చెందిన ఆటో డ్రైవర్ నాగులు మీరా కుటుంబాన్ని పరామర్శించి ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట బీఆర్ఎస్ నాయకులు, ప్రజా ప్రతినిధులు, శ్రేణులు, గ్రామ, మండల కమిటీ బాధ్యులు పాల్గొన్నారు.




# సెక్షన్ 22ఏ జాబితా రద్దు చేయకుంటే.. ఢిల్లీ తరహా జెన్‌జీ ఉద్యమం తప్పదు..

**హైదరాబాద్ :** కాంగ్రెస్ ప్రభుత్వమే ఒక పెద్ద కబ్జాదారు అని బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్‌రావు విమ ర్శించారు. సీఎం రేవంత్ రెడ్డి తమ్ముడికి అడ్డికి పావుశేరు లెక్కన భూములు కట్టాబెట్టారని విమర్శించారు. బీఆర్ఎస్ పదేండ్ల పాలనలో కేపీహెచ్‌బీలో ఒక్క గజమైనా అమ్మినామా అని ప్రశ్నించారు. కానీ అదే కాంగ్రెస్ సర్కార్ రెండున్నరేళ్లలో లక్ష ఎకరాల అసైన్డ్ భూములను అమ్మిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. కూకట్‌పల్లిలో ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ఆధ్వర్యంలో సెక్షన్ 22ఏ బాధితుల సమావేశం జరిగింది. కేపీహెచ్‌బీ ఎస్ఆర్ఎస్ఏ కమ్యూనిటీ హాలులో జరిగిన ఈ సమావేశంలో బాధితులతో హరీశ్‌రావు ముఖాముఖి నిర్వహించారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ. ప్రభుత్వ భూములు అమ్ముతున్నారు.. అసైన్డ్ భూములను లాక్కుం టున్నారని హరీశ్‌రావు మండిపడ్డారు. పారిశ్రా మికవేత్తలకు కమీషన్లకు భూములు అమ్ము కుంటున్నారని తెలిపారు. రేవంత్ రెడ్డి తమ్ము డికి అడ్డికి పావుశేరు లెక్కన భూములు కట్టబ ెట్టారని విమర్శించారు. ప్రజల భూములేమో నిషేధిత జాబితాలోకి.. ప్రభుత్వ భూములేమో రేవంత్ సోదరుల చేతుల్లోకి వెళ్తోందని ధ్వజమెత్తారు. లక్ష ఎకరాల అసైన్డ్ భూములు అమ్మింది ఈ ప్రభుత్వమని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ కాంగ్రెస్ ప్రభుత్వమే ఒక పెద్ద కబ్జాదారు అని విమర్శించారు. పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ప్రతిపక్షంపై కాదు.. ప్రజలపై సెక్షన్ 22ఏ బాంబు వేశాడని హరీశ్‌రావు అన్నారు. రియల్ ఎస్టేట్ తెలుసు కనుకనే ప్రజల ఆస్తులను నిషేధిత జాబితాలో పెట్టారని తెలిపారు. మీకు కబ్జాలు తెలుసు.. మాకు పోరాటాలు తెలుసని పేర్కొన్నారు. హెచ్‌సీయూ భూములను బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్‌లో కుదవపెట్టిండు అని తెలిపారు. బ్రోకర్లకు రూ.700 కోట్లు లంచం ఇచ్చి రూ.15వేల కోట్ల అప్పు తెచ్చిండని పేర్కొన్నారు. అగ్రికల్చర్ యూనివర్సిటీలో 200, ఉర్దూ యూనివర్సిటీలో 50 ఎకరాలు లాక్కున్నాడని అన్నారు. పాలిటెక్నిక్ కాలేజీ భూములను కూడా అమ్మాలని చూస్తున్నారని మండిపడ్డారు. హిల్ట్ పాలసీ పేరుతో పారిశ్రామిక భూములను అమ్మే కుట్ర చేస్తున్నారని ఆరోపించారు. వైఎస్ హయాంలో యూఎల్సీ యాక్ట్‌ను రద్దు చేశారని గుర్తుచేశారు. 2008కు ముందు యూఎల్సీలో ఉన్నాయని.. ఇప్పుడు భూములన్నీ సెక్షన్ 22ఏ జాబితాలో చేర్చారని తెలిపారు. ఒకప్పుడు కూకట్‌పల్లిలో తీవ్రమైన తాగునీటి సమస్య ఉండేదని హరీశ్‌రావు గుర్తుచేశారు.



# ప్రతి నేతన్నకూ 'నేతన్నల సేవలో పథకం'.. ఆందోళన వద్దు



**శ్రీసత్యసాయి జిల్లా, ఆగస్టు 26:** మగ్గం నేసే ప్రతి నేతన్నకూ నేతన్నల సేవలో పథకం అందజేస్తామని మంత్రి సవిత స్పష్టం చేశారు. (బుధవారం) మీడియాతో మాట్లాడుతూ.. మొదటి విడతలో 71,536 మంది నేతన్నలకు రూ.25 వేల ఆర్థిక సాయం అందించామని తెలిపారు. రెండో విడతగా త్వరలోనే అర్హులకు ఆర్థికసాయం అందిస్తామన్నారు. కొత్తగా 36,617 దరఖాస్తులు వచ్చినట్లు పేర్కొన్నారు. ఈ నెలాఖరు వరకూ ఇంటింటికీ వెళ్లి లబ్ధిదారులను గుర్తిస్తామని..ఆ వెంటనే లబ్ధిదారుల ఖాతాల్లో నేతన్నల సేవలో నిధులను జమ చేయనున్నట్లు తెలిపారు. అర్హులెవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని.. చేనేతల వెంటే కూటమి ప్రభుత్వం ఉంటుందని మంత్రి స్పష్టం చేశారు. ఎన్నికల్లో హామీ ఇవ్వకున్నా నేతన్నల సేవలో పథకాన్ని అమలు చేస్తున్నామని తెలిపారు. 365 రోజులూ నేతన్నలకు ఆర్థిక భరోసా కల్పించాలన్నదే సీఎం చంద్రబాబు ధ్యేయమని చెప్పారు. నేతన్నల సేవలో పథకంపై గొడ్డలి పార్టీ అపోహలు సృష్టిస్తోందని మండిపడ్డారు. వైసీపీ ట్రాప్‌లో నేతన్నలు పడొద్దని మంత్రి సవిత కోరారు.

# సనాతన ధర్మాన్ని నాశనం చేయాలని చూస్తే ఊరుకోం

**న్యూఢిల్లీ, ఆగస్టు 26:** మాజీ సీఎం, వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డిపై టీటీడీ బోర్డు మెంబర్ భాను ప్రకాశ్ రెడ్డి తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో. అన్నపూర్ణగా ఉన్న ఆంధ్రప్రదేశ్‌ను అన్యమత ప్రదేశ్‌గా మార్చారంటూ జగన్‌పై దుయ్యబట్టారు. హిందూ దేవాలయలు, దేవతల పై దాడులు చేసి విగ్రహాల చేతులు నరికి వేశారని మండిపడ్డారు. సనాతన ధర్మాన్ని ఎవరైనా నాశనం చేయాలని చూస్తే రాబోయే రోజుల్లో పరిణామాలు తీవ్రంగా ఉంటాయని హెచ్చరించారు. సనాతన ధర్మాన్ని కాపాడేందుకు బీజేపీ కంకణబద్ధమై ఉందన్నారు. విజయసాయిరెడ్డి ఆరోజు వైసీపీ ప్రభుత్వంలో ఉన్నప్పుడే సనాతన ధర్మంపై మాట్లాడి ఉంటే బాగుండేదని భానుప్రకాశ్ అభిప్రాయపడ్డారు. అన్యాయం జరిగినప్పుడే మాట్లాడాలని.. అప్పుడే ఆ నిజాయితీకి గుర్తింపు ఉంటుందన్నారు. బయటికి వచ్చిన తర్వాత మాట్లాడితే దానికి



విలువ తగ్గుతుందని చెప్పుకొచ్చారు. కాకినాడలో సౌజన్య 'లవ్ జిహాద్' ఘటన దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిందని తెలిపారు. హిందూ సమాజానికి తామున్నామని భరోసా ఇస్తున్నామని అన్నారు. దేశంలో కొన్ని వేల మంది యువతులు, మహిళలు 'లవ్ జిహాద్'కు బలైపోతున్నారని వ్యాఖ్యానించారు. సాదిక్ లాంటి దర్మార్గుల వెనుక కర్త, కర్మ, క్రియ ఎవరో గుర్తించి, కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. సాదిక్ కుట్రపై లోతుగా విచారణ జరిపి, శిక్షించాలని ఏపీలో ఎన్డీఏ కూటమి ప్రభుత్వానికి నాయకత్వం వహిస్తున్న చంద్రబాబు నాయుడికి విజ్ఞప్తి చేశారు. సమాజంలో ఉన్న సాదిక్ లాంటి వెధవలు, దుర్మార్గులు, నీచులను గుర్తించాలని భాను ప్రకాశ్ కోరారు. బాధితులు ఏక్షణంలోనైనా సహాయం కోసం సంప్రదించేలా ప్రభుత్వమే 'టోల్ ఫ్రీ' నెంబర్ ఏర్పాటుమంది యువతులు, మహిళలు 'లవ్ జిహాద్'కు చేసేలా ప్రయత్నాలు చేస్తున్నామని చెప్పారు. బాధితులు ధైర్యంగా ముందుకు వచ్చి సమాచారం ఇవ్వాలని తెలిపారు. బాధితులకు న్యాయం జరిగేవరకు వారి సమాచారాన్ని గోప్యంగా ఉంచేలా చర్యలు తీసుకుంటామని అన్నారు. పోలీసుల రక్షణ కూడా బాధితులకు ఏర్పాటు చేస్తామన్నారు. దీనిపై ఏపీ డీజీపీ ప్రత్యేకంగా దృష్టి సారించాలని భాను ప్రకాశ్ రెడ్డి కోరారు.

# ఒంగోలు మైనింగ్ లంచం కేసు.. మాజీ మంత్రి శిద్ధా కుటుంబ సభ్యులపై కేసు

**ప్రకాశం జిల్లా, ఆగస్టు26 :**
ప్రకాశం జిల్లా ఒంగోలులో మైనింగ్ శాఖ డీడీఎంఎస్ శివశంకర్ లంచం కేసులో సీబీఐ నమోదు చేసిన ఎఫ్ఐఆర్ వివరాలు వెలుగులోకి వచ్చాయి. ఈ నెల 17వ తేదీన ఒంగోలులోని కేబీ రెసిడెన్సీలో మైనింగ్ సేఫ్టీ విభాగం డీడీఎంఎస్ శివశంకర్‌కు.. మాజీ మంత్రి శిద్ధా రాఘవరావు కుటుంబ సభ్యులు రూ.2 లక్షల లంచం ఇచ్చినట్లు సీబీఐ ఎఫ్ఐఆర్‌లో పేర్కొంది. ఈ వ్యవహారంపై నిఘా పెట్టిన సీబీఐ అధికారులు డీడీఎంఎస్ శివశంకర్‌ను పట్టుకున్నారు. ఈ కేసులో మైన్స్ డిప్యూటీ డైరెక్టర్ శివశంకర్‌ను ఏ1గా సీబీఐ చేర్చింది. మాజీ మంత్రి శిద్ధా రాఘవరావు కుమారుడు సుధీర్ కుమార్‌ను ఏ2గా, శిద్ధా రాఘవరావు అన్న కుమారుడు శిద్ధా వెంకట సురేశ్ కుమార్‌ను ఏ3గా పేర్కొంది. ప్రైవేటు సర్వేయర్ ఏ. శుభాష్కర్ రెడ్డిని ఏ4గా, వాసవి గ్రానైట్స్ మేనేజర్ వై. సురేంద్రను ఏ5గా చేర్చింది. అలాగే



మరికొందరు గుర్తుతెలియని ప్రభుత్వ, ప్రైవేట్ వ్యక్తులను ఏ6గా ఎఫ్ఐఆర్‌లో పేర్కొంది. సీబీఐ ఎఫ్ఐఆర్ ప్రకారం.. జూన్ 25వతేదీన మాజీ మంత్రి శిద్ధా రాఘవరావు కుటుంబానికి చెందిన వాసవి గ్రానైట్ క్వారీలో రాయి పడి ఓ కార్మికుడు మృతిచెందాడు. ఈ ప్రమాద ఘటనపై క్వారీ యాజమాన్యానికి అనుకూలంగా నివేదిక ఇప్పించేందుకు మైన్స్ డిప్యూటీ డైరెక్టర్‌కు లంచం ఇచ్చినట్లు సీబీఐ ఆరోపించింది. ఈ వ్యవహారంలో రూ.2 లక్షల లంచం చెల్లించినట్లు సీబీఐ ఎఫ్ఐఆర్‌లో వెల్లడించింది. ఈ కేసులో అవినీతి నిరోధక చట్టంలోని సెక్షన్లు 7, 7ఏ, 8తో పాటు బీఎన్ఎస్ సెక్షన్ 61(2) కింద సీబీఐ కేసు నమోదు చేసింది. డీడీఎంఎస్ శివశంకర్‌తో పాటు శిద్ధా వెంకట సురేశ్, మరో ఇద్దరు ప్రస్తుతం రిమాండ్‌లో ఉన్నారు. మరోవైపు శిద్ధా రాఘవరావు కుమారుడు శిద్ధా వెంకట సుధీర్ పరారీలో ఉన్నాడు. మనింగ్ క్వారీలో జరిగిన కార్మికుడి మృతి ఘటనకు సంబంధించిన నివేదికను ప్రభావితం చేసేందుకు లంచం ఇచ్చారనే ఆరోపణలు ప్రస్తుతం కేసులో కీలకంగా మారాయి. ఈ వ్యవహారంలో ఇంకా ఎవరెవరి పాత్ర ఉంది, లంచం వ్యవహారంలో మరింత మంది ప్రమేయం ఉందా అనే కోణాల్లో సీబీఐ అధికారులు దర్యాప్తు చేస్తున్నారు. ఈ కేసుకు సంబంధించిన మరిన్ని వివరాలు దర్యాప్తులో వెల్లడయ్యే అవకాశం ఉంది.

# జగన్ హయాంలోని ఐదేళ్లు బీసీలను ఊచకోత కోశారు: ఎంపీ విజయ్



**అమరావతి, ఆగస్టు26 :**
వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డిపై ) తెలుగుదేశం పార్టీ ఎంపీ చింతకాయల విజయ్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. బీసీలను జగన్ మోసం చేశారని ధ్వజమెత్తారు. ఈ మేరకు విజయ్ ఓ ప్రకటన విడుదల చేశారు. గతంలో బీసీల గురించి ఏ పార్టీ ఆలోచించలేదని తెలిపారు. బీసీల గురించి ఆలోచించిన ఏకైక పార్టీ టీడీపీ అని వ్యాఖ్యానించారు. వెనుకబడిన కులాలను వాడుకోవడం జగన్‌కు అలవాటని ఎంపీ విజయ్ విమర్శించారు. జగన్ హయాంలో బీసీల రిజర్వేషన్లను తగ్గించారని దుయ్యబట్టారు. వైసీపీ హయాంలోని ఐదేళ్లు బీసీలను జగన్ ఊచకోత కోశారని ఆగ్రహించారు. అమర్నాథ్‌గౌడ్‌ను కాల్చేసిన రోజు జగన్ ఎందుకు స్పందించలేదు? అని ప్రశ్నించారు. ప్రొద్దుటూరులో సుబ్బయ్యను చంపేస్తే.. ఎందుకు మాట్లాడలేదు? అని నిలదీశారు. ఉత్తరాంధ్రను జగన్ మోసం చేశారని ఎంపీ చింతకాయల విజయ్ ధ్వజమెత్తారు.

# వైఎస్ వివేకా భూమి కబ్జా వ్యవహారం.. పులివెందుల సీఐపై బదిలీ వేటు



**కడప జిల్లా :** పులివెందుల అర్బన్ సీఐ శ్రీరామ్‌పై బదిలీ వేటు పడింది. ఆయనను కడప వీఆర్ కు పంపుతూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. దివంగత వైఎస్ వివేకానందరెడ్డి కుటుంబ సభ్యులకు చెందిన భూమి కబ్జా వ్యవహారంలో నిర్లక్ష్యం వహించినందుకే డీఐజీ కోయ ప్రవీణ్ ఈ చర్యలు తీసుకున్నారు. వివరాల్లోకి వెళితే... పులివెందులలో తమ కుటుంబానికి చెందిన భూమి ఆక్రమణకు గురైందని వివేకా కుమార్తె సునీత జిల్లా కలెక్టర్, ఆర్డీఓలకు ఫిర్యాదు చేశారు. ఆమె ఫిర్యాదు ఆధారంగా పులివెందుల ఆర్డీఓ చిన్నయ్య పూర్తిస్థాయి విచారణ చేపట్టారు. ఈ విచారణలో ఒక కబ్జా ముఠా సదరు భూమిని ఆక్రమించడమే కాకుండా, నకిలీ పట్టాదారు పాసుపుస్తకాలను సృష్టించినట్లు స్పష్టంగా నిర్ధారణ అయింది. దీంతో, అక్రమాలకు పాల్పడిన నిందితులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ ఆర్డీఓ చిన్నయ్య స్వయంగా పులివెందుల అర్బన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినప్పటికీ, సంబంధిత నిందితులను అరెస్ట్ చేయడంలో సీఐ శ్రీరామ్ తీవ్ర నిర్లక్ష్యం ప్రదర్శించారనే ఆరోపణలు వచ్చాయి. బాధ్యతారాహిత్యంగా వ్యవహరించినందుకు గానూ డీఐజీ కోయ ప్రవీణ్ సీఐ శ్రీరామ్‌ను తక్షణమే వీఆర్‌కు బదిలీ చేస్తూ నిర్ణయం తీసుకున్నారు.

# ఆ ఆలయ అభివృద్ధికి అన్ని విధాలుగా కృషి చేస్తా

**విజయవాడ, ఆగస్టు26 :** శ్రీ భ్రమరాంబ మల్లేశ్వర స్వామి వారి దేవస్థానం( పాత శివాలయం) నూతన ధర్మకర్తల ప్రమాణ స్వీకార కార్యక్రమం ( బుధవారం) జరిగింది. ఈ కార్యక్రమంలో ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని), తెలుగుదేశం పార్టీ పశ్చిమ నియోజకవర్గ ఇన్‌చార్జ్ బుద్దా వెంకన్న, నాగుల్ మీరా, జనసేన పార్టీ నాయకులు అమ్మిశెట్టి వాసు, ఎన్టీఆర్ జిల్లా బీజేపీ అధ్యక్షుడు అడ్డూరి శ్రీరామ్ పాల్గొన్నారు. పాత శివాలయానికి ఎంతో ప్రాముఖ్యం ఉంది..ఈ సందర్భంగా ఎంపీ కేశినేని శివనాథ్ మాట్లాడారు. విజయవాడలోని పాత శివాలయానికి ఎంతో ప్రాముఖ్యం ఉందని తెలిపారు. ఈ ఆలయ అభివృద్ధికి అన్ని విధాలుగా సహాయ సహకారాలు అందిస్తానని వ్యాఖ్యానించారు. ఈ ఆలయం వచ్చిన తర్వాతనే విజయవాడ అభివృద్ధి చెందడం ప్రారంభమైందని ప్రస్తావించారు. ఈ ప్రసిద్ధిగాంచిన ఆలయానికి వచ్చే భక్తులకు అన్ని సౌకర్యాలు ధర్మకర్తల మండలి ఏర్పాటు చేయాలని సూచించారు. నూతన ధర్మకర్తల మండలి చైర్మన్, సభ్యులకు అందరికీ శుభాకాంక్షలు తెలిపారు. ఆటోనగర్ ఐలా ప్రమాణ స్వీకార కార్యక్రమానికి రావడం చాలా ఆనందంగా ఉంది: ఎంపీ కేశినేని శివనాథ్అనంతరం విజయవాడ ఆటోనగర్ ఐలా నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారోత్సవ సభలో ఎంపీ కేశినేని శివనాథ్, ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్, బుద్దా వెంకన్న పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపీ కేశినేని శివనాథ్ మాట్లాడారు. ఆటోనగర్ ఐలా ప్రమాణ స్వీకార కార్యక్రమానికి రావడం చాలా ఆనందంగా ఉందని తెలిపారు. సుమారు లక్ష మంది కార్మికులు నివసించే ఈ ప్రాంతంలో ఐలా చాలా ప్రముఖ పాత్ర పోషిస్తూ ఉంటుందని



చెప్పారు. గత ఐలా కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో ఆటోనగర్‌లో ఎన్నో కార్యక్రమాలు జరిగాయని వెల్లడించారు. గత రెండు సంవత్సరాల నుంచి ఐలా ఎలక్షన్స్ పెట్టాలని చెప్పి, అధికారంలోకి వచ్చాక ప్రతి నిత్యం పోరాడటం జరిగిందని చెప్పారు. కలెక్షన్స్ 60 శాతం దాటితేనే ఐలా ఎలక్షన్లు ఉంటాయని అధికారులు చెప్పడంతో, ఇప్పుడు అందరూ కూడా కలిసికట్టుగా ఉండి, కలెక్షన్స్ 60శాతం దాటించి ఎలక్షన్ కండక్ట్ చేసుకున్నారని తెలిపారు. ఆ సమస్యలను ఐలానే పరిష్కరించాలి..శాంతియుతంగా, ప్రశాంతంగా జరిగిన ఈ ఎలక్షన్లలో విజయం సాధించిన ప్రతి ఒక్కరికీ అభినందనలు ఎంపీ శివనాథ్ చెప్పారు. ప్రెసిడెంట్: శివనాగేశ్వరరావు, వైస్ చైర్మన్: దుర్గాప్రసాద్, జనరల్ సెక్రటరీ: కలామ్, కార్యవర్గ సభ్యులు ఈ ఎలక్షన్లలో గెలిచిన వారందరికి కొన్ని సూచనలు చేస్తున్నానని అన్నారు. విజయవాడకే జీవనాడి ఆటోనగర్ అని తెలిపారు. ఈ జీవనాడి అయిన ఆటోనగర్‌లో రోడ్లు గానీ, డ్రైనేజీలు గానీ, మంచినీటి సమస్య గానీ ఏది ఉన్నా సరే.. ఐలానే పరిష్కరిం చాలని అన్నారు. ప్రజాప్రతినిధులందరం కూడా ఏ సమస్య ఉన్నా తమ దృష్టికి తీసుకొస్తే తప్పకుండా పరిష్కరిస్తామని చెప్పారు. పోరాడి 3 రోడ్ల టెండర్లు పూర్తి చేశామని, ఇప్పటికే పనులు జరుగుతున్నాయని ఎంపీ శివనాథ్ వెల్లడించారు. 4వ రోడ్డు గద్దె రామ్మోహన్ రావు ఆధ్వర్యంలో ప్రారంభించారని చెప్పారు. శక్తి కళ్యాణ మంటపం రోడ్డు కూడా రెడీ అయ్యిందని తెలిపారు. 24 గంటలు వాహనాలు ఆటోనగర్‌కి వచ్చి, విజయవాడకి ట్రాఫిక్ ఇబ్బంది లేకుండా ఉండే విధంగా తామందరం కృషి చేస్తామని చెప్పారు. రాబోయే కాలంలో ఐలా మరింత విస్తృతంగా అభివృద్ధికి కృషి చేస్తామని అన్నారు. లక్ష మంది కార్మికులకు దిశా నిర్దేశం చేసే విధంగా ఉండాలని ఎంపీ శివనాథ్ కోరారు.

# ఉద్యోగానికి రాజీనామా చేసి.. బెజవాడ బయలుదేరిన భావన.. అంతలో..

**కోదాడ, ఆగస్టు 26:** సూర్యాపేట జిల్లా కోదాడ మండలం ద్వారకుంట శివారులో ఆగి ఉన్న లారీని ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో ఆరుగురు ప్రయాణికులు అక్కడికక్కడే మృతి చెందారు. మృతుల్లో 23 సంవత్సరాల భావనా వర్ష కూడా ఉన్నారు. సాఫ్ట్‌వేర్ కంపెనీలో హెచ్ఆర్ విభాగంలో పని చేసిన ఆమె తన ఉద్యోగానికి రాజీనామా చేసి సొంతూరు విజయవాడకు పయనమైంది. ఇందుకోసం మంగళవారం రాత్రి 11.00 గంటలకు విజయవాడ వెళ్లేందుకు హైదరాబాద్‌లో ట్రావెల్స్ బస్సు ఎక్కింది.
ఉదయం 5.00 గంటలకు విజయవాడలో దిగిపోతామని భావన అనుకుంది. కానీ అంతలోనే ఆ బస్సు ప్రమాదానికి గురి కావడంతో మరణించింది. భావనా వర్ష మృతి సమాచారం అందుకున్న కుటుంబ సభ్యులు



కన్నీరుమున్నీరు అవుతున్నారు. వారంతా కోదాడకు హుటాహుటిన బయలుదేరారు. ప్రభుత్వాసుపత్రి వద్ద మృతుల కుటుంబాల రోదనలు మిన్నంటాయి. సూర్యాపేట జిల్లా కోదాడ మండలం ద్వారకుంట శివారులో బుధవారం తెల్లవారుజామున 4.00 గంటలకు రహదారి పక్కన ఆగి ఉన్న లారీని హైదరాబాద్ నుంచి ఏలూరు వెళ్తున్న ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో ఆరుగురు అక్కడికక్కడే మృతి చెందారు. పలువురు తీవ్రంగా గాయపడ్డారు. వారంతా కోదాడ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. వారిలో పలువురి పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు వెల్లడించారు. మృతదేహాలను కోదాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. వాటికి పోస్ట్‌మార్టం నిర్వహిస్తున్నారు. బస్సు ప్రమాదంపై స్పందించిన ప్రధాని..ఈ బస్సు ప్రమాదంపై ప్రధాని మోదీ తన ఎక్స్ వేదికగా స్పందించారు. 'తెలంగాణలోని సూర్యాపేట జిల్లాలో దురదృష్టవశాత్తు జరిగిన ప్రమాదం గురించి తెలుసుకుని తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యాను. తమ ఆత్మీయులను కోల్పోయిన వారి కుటుంబ సభ్యులకు నా ప్రగాఢ సానుభూతి. గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని ప్రార్థిస్తున్నాను' అని ప్రధాని మోదీ పేర్కొన్నారు.

# ఇతరులకు నీతులు చెప్పే ముందు చరిత్ర చూసుకోవాలి జగన్

**అమరావతి, ఆగస్టు 26:**
వైసీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్ వెన్నుపోటు రాజకీయాలకు ప్రతిరూపమని వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ స్పష్టం చేశారు. అలాంటి జగన్.. వెన్ను పోటుపై వ్యాఖ్యలు చేయడం హాస్యాస్పదంగా ఉందన్నారు. బుధవారం రాజధాని అమరావతిలో ఆయన మాట్లాడుతూ.. ఇతరులకు నీతులు చెప్పే ముందు రాజకీయ చరిత్ర చూసుకోవాలంటూ జగన్‌కు చురకలంటించారు.




జూనియర్ డాక్టర్ల స్టైపెండ్ వ్యవహారంలో వైఎస్ జగన్ వైఖరిపై మండిపడ్డారు. బీసీ రిజర్వేషన్లపై ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారంటూ వైసీపీ అధినేతపై మంత్రి సత్యకుమార్ నిప్పులు చెరిగారు. రిజర్వేషన్లు ప్రకటించడం కాదు.. చట్టబద్ధంగా నిలబెట్టడమే ముఖ్యమని అభిప్రాయపడ్డారు. జగన్ హయాంలో బీసీ రిజర్వేషన్లు న్యాయపరమైన చిక్కుల్లో పడ్డాయని అన్నారు. కూటమి ప్రభుత్వం బీసీలకు చట్టబద్ధమైన సామాజిక న్యాయం చేస్తోందని ఈ సందర్భంగా ఆయన హామీ ఇచ్చారు. బీసీలను ఓటు బ్యాంకుగా చూసింది జగన్ ప్రభుత్వమేనని గుర్తు చేశారు. బీసీలను పాలనలో భాగస్వాములుగా చేస్తుంది కూటమి ప్రభుత్వమని వివరించారు. స్థానిక సంస్థల ఎన్నికల ఓటమిపై జగన్‌లో ఇప్పుడే ఆందోళన మొదలైందంటూ ఎద్దేవా చేశారు. ఓటమికి కారణాలు వెతికే పనిలో జగన్ ఉన్నారని మంత్రి సత్యకుమార్ పేర్కొన్నారు.

# ‘వందేమాతరం’పై కర్ణాటక సీఎం డీకే శివకుమార్ కీలక ప్రకటన



**కర్ణాటక:** కర్ణాటకలో ప్రభుత్వ కార్యక్రమాల్లో ‘వందేమాత రం’ పూర్తి గేయాన్ని ఆలపించబోమని ముఖ్యమంత్రి డీకే శివకుమార్ స్పష్టం చేశారు. కాంగ్రెస్ నిర్ణయం మేరకు తొలి రెండు చరణాలు మాత్రమే పాడతామని తెలిపారు. ఈ విషయంలో పార్టీ వైఖరికి తాను కట్టుబడి ఉన్నానని చెప్పారు.రెండు చరణాలే పాడతామ న్న సీఎంకాంగ్రెస్ నిర్ణయానికి కట్టుబడి ఉంటామని ప్రకటనస్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో ఆరు చరణాలు ఆలపించిన వైనంఅది తనకు తెలియకుండా జరిగిందన్న సీఎం డీకేప్ర తి వర్గాన్ని గౌరవించడమే కాంగ్రెస్ సిద్ధాంతమని వ్యాఖ్యస్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో మొత్తం ఆరు చరణాలు ఆలపించడం పై ప్రశ్నించగా.. తనకు తెలియకుండానే ఆ నిర్ణయం జరిగి ఉండొచ్చని శివకుమార్ అన్నారు. ఇకపై ప్రభుత్వ కార్యక్రమాల్లో మాత్రం గతంలో నిర్ణయించిన విధంగానే తొలి రెండు చరణాలు మాత్రమే పాడతామని స్పష్టం చేశారు.కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ ఇటీవల 1937లో తీసుకున్న నిర్ణయాన్ని మరోసారి సమర్థించింది. బహిరంగ, జాతీయ కార్యక్రమాల్లో వందేమాతరం తొలి రెండు చరణాలు మాత్రమే ఆలపించాలని అప్పట్లో నిర్ణయించినట్లు పేర్కొంది. మొత్తం చరణాలు పాడాలంటూ కొత్త వందేమాతరం బిల్లు రావడం నేపథ్యంలో ఈ అంశంపై కాంగ్రెస్, బీజేపీ మధ్య రాజకీయ వివాదం కొనసాగుతోం ది.కాంగ్రెస్ నిర్ణయాన్ని బీజేపీ తప్పుబట్టింది. జాతీయ గేయాన్ని అవమానిస్తున్నారని విమర్శిం చింది. ఓటు బ్యాంకు రాజకీయాలకు కాంగ్రెస్ పాల్పడుతోందని ఆరోపించింది.ఈ విమర్శలపై శివకుమార్ స్పందించారు. భారత్ భిన్న భాషలు, సంస్కృతులు, ప్రాంతాలతో కూడిన దేశమని అన్నారు. ప్రతి వర్గాన్ని గౌరవించడమే కాంగ్రెస్ సిద్ధాంతమని చెప్పారు. బీజేపీ ఓటు బ్యాంకు రాజకీయాలు చేస్తోందని ఆరోపించారు.వందేమాతరం తరువాతి చరణాల్లో దుర్గ, లక్ష్మి, సరస్వతి వంటి హిందూ దేవతల ప్రస్తావన ఉందని కాంగ్రెస్ చెబుతోంది. ఇతర వర్గాలకు అవి అభ్యంతరకరంగా ఉండొచ్చన్న కారణంతో తొలి రెండు చరణాలకే పరిమితం కావాలని నిర్ణయించింది. కర్ణాటకలోనూ ఇదే నిర్ణయం అమలవుతుందని స్పష్టం చేశారు.

# 20 మంది టీఎంసీ ఎంపీలకు లోక్‌సభ సెక్రటేరియేట్ నోటీసులు



**న్యూఢిల్లీ:** తృణమూల్ కాంగ్రెస్ పార్టీకి చెందిన 20 మంది రెబల్ ఎంపీలకు లోక్‌సభ సెక్రటేరియేట్ నోటీసులు ఇచ్చింది. ఏడు రోజుల్లోగా వివరణ ఇవ్వాలని కోరింది. ఆగస్టు 25వ తేదీన ఆ నోటీసులు జారీ చేశారు. లోక్‌సభ అనర్హత వేటు రూల్ 6 కింద ఆ నోటీసులు ఇచ్చారు. టీఎంసీ నేత అభిషేక్ బెనర్జీ ఆ ఎంపీలను అనర్హులుగా ప్రకటించాలని కోరుతూ జూన్ 18వ తేదీన పిటీషన్ దాఖలు చేసిన విషయం తెలిసిందే. టీఎంసీకి చెందిన 20 మంది ఎంపీలు త్రిపురకు చెందిన నేషనలిస్టు సిటిజన్స్ పార్టీ ఆఫ్ ఇండియాలో చేరినట్లు ప్రకటించారు. పార్లమెంట్‌లో ఆ గ్రూపును ఎన్సీపీఐగా ట్రీట్ చేస్తున్నారు. ఎన్డీఏ పార్లమెంటరీ కార్యకలాపా ల్లోనూ వారు పాల్గొన్నారు.అభిషేక్ బెనర్జీ దాఖలు చేసిన అనర్హత పిటీషన్‌పై వాదనలు చేపట్టనున్నట్లు సుప్రీంకోర్టు మంగళవారం పేర్కొన్నది. చీఫ్ జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మాల్యా బాగ్చీ, వీ మోహనతో కూడిన ధర్మాసనం కూడా 20 మంది ఎంపీలకు నోటీసులు ఇచ్చింది. నోటీసులు ఇవ్వడం సమస్య కాదు అని, నిర్ణీత సమయంలో కేసును పరిష్కరించాలని కోర్టు పేర్కొన్నది.అభిషేక్ బెనర్జీ పిటీషన్‌లో ఉన్న ఎంపీల్లో కకోలి ఘోష్ బస్తీదార్, సుదీప్ బందోపాధ్యాయ, భౌమిక్, అరూప్ చక్రవర్తి, అధికారి దీపక్ దేవ్, సయ్యాని ఘోష్, బాపి హల్దార్, ఎండీ అబూ తాహిర్ ఖాన్, కలిపాదా సారెన్ ఖేర్వాల్, అసిత్ కుమార్ మాల్, జూనె మాలియా, మిట్టాలి బాగ్, ఖలీల్ను? రెహ్మాన్, మాలా రాయ్, శర్మిలా సర్కార్, యూసుఫ్ పఠాన్ ఉన్నారు.

# మోదీ వ్యతిరేక ర్యాలీ పెట్టుకోండి.. న్యూయార్క్ మేయర్‌పై అమెరికన్ సింగర్ ఫైర్..




**న్యూ ఢిల్లీ :** న్యూయార్క్‌లో జరగనున్న ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భగవత్ కార్యక్రమంపై ఆ నగర మేయర్ జోహ్రాన్ మమ్దానీ చేసిన వ్యాఖ్యలు రాజకీయ దుమారం రేపుతున్నాయి. మమ్దానీ వైఖరిపై అమెరికన్ సింగర్, నటి మేరీ మిల్బెన్ తీవ్రంగా స్పందించారు. మమ్దానీ, ఆయనతో ఉన్నవారు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, బీజేపీని వ్యతిరేకించడం వల్లే ఈ కార్యక్రమాన్ని అడ్డుకోవాలని చూస్తున్నారని ఆమె ఆరోపిం చారు మాడిసన్ స్క్వేర్ గార్డెన్‌లో ఆగస్టు 29న జరగనున్న కార్యక్రమంలో ఆర్ఎస్ఎస్ చీఫ్ మో హన్ భగవత్ ప్రసంగించనున్నారు. అమెరికన్ హిందూస్ ఫర్ ఎంగేజ్‌మెంట్ అండ్ డైలాగ్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నా రు. అమెరికన్ హిందూ సమాజాన్ని ఒకతాటి పైకి తీసుకురావాలనే లక్ష్యంతో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు పేర్కొంటున్నారు. ఈ కార్యక్రమంపై న్యూయార్క్ నగర మేయర్ అమెరికా ఇప్పటివరకు బహుళత్వం, లౌకిక విలువలు, ప్రతి ఒక్కరికీ స్థానం ఉన్న దేశంగా ఉందని, ఇలాంటి విలువలకు భిన్నంగా ఒక వర్గాన్ని సమీకరించే ధోరణి పెరగడం తనకు ఆందోళన కలిగిస్తోందని మమ్దానీ పేర్కొన్నారు. ఆర్ఎస్ఎస్ నిర్వహించనున్న కార్యక్రమాన్ని తాను వ్యతిరేకిస్తున్నట్లు చెప్పారు. యితే ఇది ప్రైవేట్ కార్యక్రమం కావడంతో దాన్ని రద్దు చేసే చట్టపరమైన అధికారం తనకు ఉందో లేదో తెలియదని స్పష్టం చేశారుఆర్ఎస్ఎస్ కార్యక్రమాన్ని వ్యతిరేకించిన మమ్దానీపై అమెరికన్ సింగర్, నటి మేరీ మిల్బెన్ విమర్శలు గుప్పించారు మోదీ, బీజేపీని వ్యతిరేకించడం వల్లే ఈ కార్యక్రమాన్ని అడ్డుకోవాలని చూస్తున్నారని ఆమె విమర్శించారు. ఈ కార్యక్రమాన్ని వ్యతిరేకించేవారు కావాలంటే డబ్బు సమీకరించి తమ సొంత ర్యాలీ నిర్వహించుకోవాలని సూచించారు. మోదీ వ్యతిరేకతతో మూర్ఖంగా వ్యవహరిస్తున్నారని అన్నారు. ఆర్ఎస్ఎస్ నిర్వహిస్తున్న కార్యక్రమం తనకు నచ్చిందని, భారత్‌లో మత స్వేచ్ఛపై అర్థవంతమైన చర్చ జరగాలని ఆశిస్తున్నట్లు మిల్బెన్ తెలిపారు.

# భారత్ ‘ధర్మశాల’ కాదు- చొరబాట్లను ఉపేక్షించబోం



**న్యూ ఢిల్లీ :** దేశంలో నివసించే హక్కు కేవలం భారత పౌరులకే ఉంటుందని, ఇదేమీ ‘ధర్మశాల’ కాదని కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా స్పష్టం చేశారు. ఢిల్లీలో ఇంటెలిజెన్స్ బ్యూరో ఆధ్వర్యంలో జరిగిన నేషనల్ సెక్యూరిటీ స్ట్రాటజీస్ సదస్సు- 2026లో ఆయన పాల్గొని మాట్లాడారు. అక్రమంగా చొరబడుతున్న వారిపై ఉక్కుపాదం మోపుతామని, అతి త్వరలోనే దేశాన్ని పూర్తిగా ‘చొరబాట్ల రహిత’ ప్రాంతంగా మారుస్తామన్నారు. గత ఎనిమిది నెలల కాలంలో దేశంలోని అన్ని భూ సరిహద్దు రాష్ట్రాలను స్వయంగా సందర్శించినట్లు అమిత్ షా ఈ సందర్భంగా గుర్తుచేశారు. సరిహద్దు రక్షణ కోసం నాలుగు అంచెల విధానంతో కూడిన మార్గదర్శకాలను రూపొందించినట్లు ఆయన వెల్లడించారు.“ఈ దేశం ఏమాత్రం ధర్మశాల కాదు. ఇక్కడ జీవించే హక్కు కేవలం ఈ దేశ పౌరులకు మాత్రమే ఉంది. అక్రమ చొరబాట్లు దేశ రక్షణకు మాత్రమే కాకుండా, దేశ ఆర్థిక వ్యవస్థను దెబ్బతీసేలా, జనాభా సమతుల్యతను మార్చేస్తున్నాయి. వీటిని ఎట్టి పరిస్థితుల్లోనూ సహించేది లేదు. రానున్న 15-20 ఏళ్లలో తలెత్తగల భద్రతా సవాళ్లను ముందే ఊహించి, వాటిని ఎదుర్కొనేందుకు వ్యూహాలు రచించాల్సిన అవసరం ఉంది”

– అమిత్ షా, కేంద్ర హోంశాఖ మంత్రి


దేశంలో నేర విచారణ వ్యవస్థను మరింత పటిష్టం చేసేందుకు కొత్త నేర చట్టాలు దోహదం చేస్తాయని అమిత్ షా అభిప్రాయపడ్డారు. రానున్న ఒక సంవత్సరంలో కొత్తగా తీసుకువచ్చిన మూడు క్రిమినల్ చట్టాలను 100 శాతం అమలు చేయనున్నట్లు ప్రకటించారు. ఈ చట్టాల అమలు ద్వారా ఏదైనా క్రిమినల్ కేసుకు సంబంధించి కింది కోర్టు నుంచి సుప్రీంకోర్టు వరకు విచారణ ప్రక్రియ కేవలం మూడేళ్లలోపే పూర్తవుతుందని, తద్వారా నేరస్థుల శిక్షా రేటు కనీసం 25 శాతం పెరుగుతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.డ్రగ్స్ రహిత భారత్‌యువతను పట్టిపీడిస్తున్న డ్రగ్స్ మహమ్మారిపై హోంమంత్రి తీవ్రంగా స్పందించారు. దేశంలోని రాష్ట్రాల పోలీసు విభాగం ‘నార్కోటిక్స్ కంట్రోల్ విజన్ డాక్యుమెంట్ 2026-2029’ను క్షేత్రస్థాయిలో కఠినంగా అమలు చేయాలని ఆదేశించారు. డ్రగ్స్ రహిత భారత్‌ను సాకారం చేయడానికి ‘త్రీ-డీ(డికెక్ట్, డిస్రప్ట్, డిస్ట్రాయ్)’ విధానాన్ని పటిష్టంగా పాటించాలని పిలుపునిచ్చారు. నేరాలను ముందే అరికట్టడంలో సాంకేతిక పాత్ర కీలమని అమిత్ షా ఉద్ఘాటించారు. యువ పోలీసు అధికారులు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సహాయంతో నేరస్థుల మాడ్యూల్స్?ను విశ్లేషించి, భవిష్యత్ సవాళ్లను ముందుగానే పసిగట్టి అడ్డుకోవాలని సూచించారు.2047 నాటికి ‘వికసిత భారత్’ లక్ష్యంప్రధాని నరేంద్ర మోదీ నిర్దేశించిన ‘వికసిత భారత్- 2047’ లక్ష్యాన్ని సాధించాలంటే, దేశంలో మొట్టమొదటిగా బలమైన అంతర్గత భద్రత అవసరమని అమిత్ షా పేర్కొన్నారు. గత ప్రభుత్వాల హయాంలో నక్సలిజం, ఉగ్రవాదం, ఈశాన్య రాష్ట్రాల సమస్యలను సకాలంలో గుర్తించి ఉంటే, దేశం దశాబ్దాల పాటు ఆ సమస్యల వల్ల నష్టపోయేది కాదన్నారు. ప్రస్తుత బీజేపీ ప్రభుత్వం గతంలో దేశ భద్రతను కుదిపేసిన మూడు ప్రధాన హాట్‌స్పాట్‌ల సమస్యలను విజయవంతంగా అంతం చేసిందని, దీనికి రాష్ట్ర పోలీసు బలగాలు, కేంద్ర దళాలు చేసిన కృషే కారణమని ప్రశంసించారు.దేశంలో ఉగ్రవాద మూలాలను పెకిలించడంలో భాగంగా తీవ్రవాద భావజాలంతో ఉన్న పాపులర్ ఫ్రంట్ ఆఫ్ ఇండియా సంస్థను ఒక్క రాత్రిలో నిషేధించి దాని కేడర్‌ను పూర్తిగా నిర్మూలించడం అనేది కేంద్ర- రాష్ట్రాల సమన్వయానికి నిదర్శనమని అమిత్ షా కొనియాడారు. ఉపా చట్టం కింద సెప్టెంబర్ 2022లో ఈ సంస్థపై నిషేధం విధించిన సంగతి తెలిసిందే. ఉగ్రవాద నెట్‌వర్క్‌లను పూర్తిగా సమూలంగా నాశనం చేసేందుకు ‘ప్రహార్’ వ్యూహాన్ని కేవలం పత్రాలకే పరిమితం చేయకుండా దైనందిన ఆచరణలోకి తేవాలని పిలుపునిచ్చారు. సమగ్ర భద్రతా విధానం ప్రపంచవ్యాప్తంగా నెలకొన్న అస్థిరతలు, ఇంధన వనరుల అభద్రత, సప్లై చైన్ అంతరాయాలు, పెరుగుతున్న తీవ్రవాద ధోరణులు దృష్టిలో ఉంచుకునే భద్రతా విధానాలను రూపొందించాలని ఆయన సూచించారు. ఏ సమస్య అయినా పెద్దది కాకముందే దానిని ఆరంభ దశలోనే గుర్తించి తుదముట్టించే సమర్థవంతమైన వ్యవస్థను నిర్మించాలని పిలుపునిచ్చారు.

# అత్యంత పకడ్బందీగా నీట్ పరీక్షల వ్యవస్థ



**న్యూ ఢిల్లీ :** వైద్య విద్యలో ప్రవేశాలకు నిర్వహించే నీట్ పరీక్షల నిర్వహణ, భద్రతపై సుప్రీంకోర్టు మరోసారి దృష్టి సారించింది. పరీక్షల విధానంలో సంస్కరణలు కాగితాలకే పరిమితం కాకుండా, వాటిని శాశ్వత వ్యవస్థగా అమలు చేయాల్సిన అవసరం ఉందని వ్యాఖ్యానించింది. రాధాకృష్ణన్ కమిటీ, నందన్ నీలేకని కమిటీ చేసిన సిఫార్సులను అమలు చేసేందుకు ఇప్పటివరకు తీసుకున్న చర్యలపై పూర్తి వివరాలు సమర్పించాలని నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ)ని ఆదేశించింది. మరోవైపు నీట్ పరీక్షల కోసం ఏర్పాటు చేసిన వ్యవస్థ అత్యంత పకడ్బందీగా ఉందని సుప్రీంకోర్టుకు కేంద్రం తెలిపింది. అంతేకాకుండా నీట్? ప్రశ్నపత్రాలను తీసుకువెళ్లే వాహనంలో జీపీఎస్ ఉందని, ప్రతి చిన్న కదలిక కూడా నమోదవుతుందని పేర్కొంది.పేపర్ లీక నేపథ్యంలో నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ సంస్కరణలు కొరుతూ దాఖలైన పిటిషన్లపై బుధవారం జస్టిస్ పీఎస్ నరసింహ, జస్టిస్ అలోక్ అరాధేలతో కూడిన ధర్మాసనం విచారణ చేపట్టింది. ఫెడరేషన్ ఆఫ్ ఆల్ ఇండియా మెడికల్ అసోసియేషన్ (ఎఫ్ఏఐఎంఏ) తరపున న్యాయవాది తన్వీ దూబే దాఖలు చేసిన పిటిషన్ కూడా వీటిలో ఉంది. నీట్?లో సంస్కరణలను సంస్థాగతంగా అమలు చేయాల్సిన అవసరం ఉందని ధర్మాసనం పేర్కొంది. రాధాకృష్ణన్ కమిటీ కూడా ఇదొక వ్యవస్థాగత సమస్య అని సరిగ్గానే గుర్తించిందని వ్యాఖ్యానించింది. పరీక్షల విధానం పత్రాలపై ఎంత పకడ్బందీగా ఉన్నా, ఒక పరీక్ష ముగిసిన తర్వాత మరో ఎగ్జామ్ సమయానికి పరిస్థితులు పూర్తిగా మారిపోతే ప్రయోజనం ఉండదని అభిప్రాయపడింది. సంస్కరణలు నిరంతర ప్రక్రియగా కొనసాగాలని స్పష్టం చేసింది ‘ప్రశ్నపత్రం నుంచి విద్యార్థి వరకు పటిష్ఠ భద్రత’కేంద్రం తరఫున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా వాదనలు వినిపించారు. విచారణ ప్రారంభంలోనే సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా నీట్? ప్రశ్నపత్రం ముద్రణ నుంచి విద్యార్థుల చేతికి చేరే వరకు అనుసరిస్తున్న భద్రతా చర్యలను కోర్టుకు వివరించారు. ప్రస్తుతం అమల్లో ఉన్న వ్యవస్థను ఛేదించడం చాలా కష్టమని, పటిష్ఠమైన భద్రతా ప్రమాణాలను పాటిస్తున్నామని తెలిపారు. ప్రశ్నపత్రం తయారీలోనూ అనేక దశల్లో గోపత్య పాటిస్తున్నట్లు చెప్పారు. చాలా మంది నిపుణులతో క్వశ్చన్ బ్యాంక్‌ను సిద్ధం చేయిస్తున్నామని తెలిపారు. ఏ ప్రశ్న పరీక్షలో వస్తుందో వారికి కూడా తెలియదని వివరించారు. దీంతో ప్రశ్నపత్రం ముందుగానే లీక్ అయ్యే అవకాశాలను తగ్గించేలా వ్యవస్థను రూపొందించినట్లు కేంద్రం తరఫున కోర్టుకు వివరించారు. నీట్ ప్రశ్నపత్రాలను తరలించే వాహానానలకు జీపీఎస్ పరికరాలు అమర్చినట్లు తెలిపారు. వాహనం స్వల్పంగా కదిలినా ఆ వివరాలు రికార్డు అవుతాయని పేర్కొన్నారు. పేపర్ లీక్ నేపథ్యంలో కమిటీనీట్? యూజీ ప్రశ్నపత్రం లీక్ వ్యవహారం నేపథ్యంలో కేంద్ర విద్యాశాఖ ఏడుగురు సభ్యులతో రాధాకృష్ణన్ కమిటీని ఏర్పాటు చేసింది. పరీక్షల నిర్వహణలో సంస్కరణలు, డేటా భద్రతా ప్రోటోకాల్స్‌ను మెరుగుపరచడం, ఎన్?టీఏ నిర్మాణం, పనితీరులో మార్పులు వంటి అంశాలపై ఈ కమిటీ సిఫార్సులు చేసింది. ఇదే సమయంలో నీట్ పరీక్షల్లో మరింత విస్తృతమైన నిర్మాణా త్మక సంస్కరణల కోసం ఇన్ఫోసిస్ సహ వ్యవస్థాపకుడు నందన్ నీలేకని నేతృత్వంలో కేంద్రం ఉన్నతస్థాయి టాస్క్‌ఫోర్స్‌ను ఏర్పాటు చేసింది.

# కృతిసనన్ దుస్తుల వివాదం.. కృతికి రాహుల్‌గాంధీ మద్దతు.






**న్యూ ఢిల్లీ :** నటి కృతి సనన్ నటించిన ఓ రాఖీ పండు గ యాడ్ (లో ఆమె ధరించిన దుస్తులపై వివాదం కొనసాగుతో ంది. ఈ వివాదంపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాం ధీ (నటి (, బీజేపీ ఎంపీ కంగనా రనౌత్ పరస్పర విమర్శలు చేసుకోవ డంతో ఇప్పుడు రాజకీయ రంగు పులుముకు ంది. కృతికి రాహుల్‌గాంధీ మద్దతు తెలుపగ ా.. కంగనా రనౌత్ ‘వెయిట్ బ్రో అంటూ కౌంటర్ ఇచ్చింది.వివరాల్లోక వెళ్తే.. ఓ నగల బ్రాండ్ రాఖీ పండుగ కోసం రూపొందించిన యాడ్‌లో కృతి సనన్ నటించారు. అందులో ఆమె ధరించిన ఇండో-వెస్ట్రన్ డ్రెస్ పట్ల సోషల్ మీడియాలో విమర్శలు వెల్లువెత్తాయి. దీనిపై బీజేపీ ఎంపీ కంగనా రనౌత్ స్పందిస్తూ “రాఖీ కట్టేటప్పుడు బికినీ, లోదుస్తులు ధరించాల్సిన అవసరం ఏముంది..? ఈ యాడ్ ఉద్దేశపూర్వకంగానే అసహ్యంగా ఉంది” అని వ్యాఖ్యానించారు. ఈ విమర్శలపై స్పందించిన కృతి సనన్ “సంస్కృతి, సంప్రదాయాలు గుండెల్లో ఉంటాయి కానీ, దుస్తుల్లో కాదు. మహిళలు ఏం ధరించాలో చెప ్పడం ఎప్పుడు ఆపుతారు..?” అని ప్రశ్నించారు.

# ఇమ్రాన్‌ఖాన్‌ను కలిసిన భార్య, సోదరి.. 9 నెలల తర్వాత తొలిసారి కలిసిన కుటుంబ సభ్యులు

**పాకిస్తాన్** మాజీ ప్రధాని ఇమ్రాన్ ఖాన్‌ను ఆయన భార్య, సోదరి కలిశారు. తొమ్మిది నెలల తర్వాత ఇమ్రాన్‌ను కుటుంబ సభ్యులు కలిశారు. ఈ ఏడాది తొలిసారి. రావల్పిండిలోని అడియాలా జైలులో ఇమ్రాన్ ఖాన్ ఖైదీగా ఉన్నారు. అయితే, ఆయనను కలిసేందుకు కుటుంబ సభ్యుల్ని ప్రభుత్వం కొన్ని నెలలుగా అనుమతించలేదు. మధ్యలో ఆయన తరఫు లాయర్లు మాత్రమే కలిశారు. దీంతో ఆయన అనారోగ్యంపై చాలావార్తలు ప్రచారంలో ఉన్నాయి.ఈ నేపథ్యంలో ఆయనకు చికిత్స అందించాలని, కుటుంబ సభ్యులు కలిసేందుకు అనుమతివ్వాలని కోరుతూ ఆయన సన్నిహితులు ఇటీవల పాక్ సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై విచారించిన కోర్టు ఇమ్రాన్‌ఖాన్‌ను వెంటనే జైలు నుంచి ఇస్లామాబాద్‌లోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించాలని ఆదేశించింది. తగిన చికిత్స అందించాలని సూచించింది. ఇదే సమయంలో వారానికోసారి కుటుంబ సభ్యులు కలిసేందుకు అనుమతించింది. ఇమ్రాన్ సోదరి నోరీన్ నాజి.. బుధవారం ఇమ్రాన్ ఖాన్‌ను కలిశారు. అడియాలాలోని జైలులో కలిసి దాదాపు 15 నిమిషాలపాటు మాట్లాడారు. ఈ సందర్భంగా వారు ఇమ్రాన్ ఆరోగ్యంపై ఆరాతీశారు. ఆయనను కోర్టు ఆదేశాల ప్రకారం షిఫా ఆస్పత్రికి తరలించే అంశంపై జైలు అధికారులతో మాట్లాడారు.

# ప్రధాని మోదీ రాజీనామా చేయాలని ఆరేండ్ల బాలుడి డిమాండ్.



**బీహార్:** బీహార్‌లో విద్యార్థుల ఉద్యమం ఉధృతమవు తున్నది. బీపీఎస్సీ 70వ పరీక్షలో అక్రమాలు జరిగాయని, వాటిని రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ వేలాదిమంది విద్యార్థులు రాజధాని పాట్నాలో ఆందోళనకు దిగారు. అయితే బీహార్‌లో నిరసనల్లో ప్రధానమంత్రి పదవికి మోదీ రాజీనామా చేయాలని పోస్టర్ పట్టుకున్నందుకు ఆరేళ్ల బాలుడిని పోలీసులు అక్కడి నుంచి తీసుకెళ్లిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ అయింది.పరీక్షల్లో అక్రమాలు, నిరుద్యోగంపై విద్యార్థులు పెద్ద ఎత్తున ఉద్యమిం చారు.ఈ క్రమలో ఒకటో తరగతి విద్యార్థి ఆదిత్య కుమార్ తన తల్లితో కలిసి ఆందోళన పోస్టర్‌ను పట్టుకుని మీడియా దృష్టినిఆకర్షించాడు. విద్యార్థులపై పోలీసుల లాఠీచార్జీని, ప్రభుత్వ వైఫల్యాలను తప్పుబడుతూ బీహార్ సీఎం, పీఎం మోదీ రాజీనామా చేయాలని ఆ చిన్నారి డిమాండ్ చేశాడు. అక్కడ పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో పోలీసులు వెంటనే బాలుడిని అక్కడ నుంచి తరలించారు. ఈ ఘటనకు సంబంధించిన వీడియో నెట్టింట తీవ్ర చర్చనీయాంశంగా మారింది.

కాగా, బీహార్‌లో మరోసారి విద్యార్థులపై లాఠీ విరిగింది. బీపీఎస్సీ 70వ పరీక్షలో అక్రమాలు జరిగాయని, వాటిని రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ మంగళవారం వేలాదిమంది విద్యార్థులు రాజధాని పట్నాలో జరిపిన ఆందోళన వారి ఆవేదనను ప్రతిబింబించింది. సీఎం సామ్రాట్ చౌదరి నివాసానికి ర్యాలీగా వెళ్లేందుకు నిరసనకారులు ప్రయత్నించగా పోలీసులు వారిపై లాఠీచార్జ్ చేయడమే కాక, జల ఫిరంగులు ప్రయోగించారు. ఈ ఘటనల్లో పలువురు విద్యార్థులు గాయపడ్డారు.వందలాది మందిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. బీహార్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (బీపీఎస్సీ ) ఈ ఏడాది మొదట్లో నిర్వహించిన పరీక్షలో పలు అక్రమాలు చోటుచేసుకున్నందున దానిని రద్దు చేయాలని వారు డిమాండ్ చేస్తున్నారు. అలాగే వచ్చే నెలలో నిర్వహించే టీచర్ రిక్రూట్‌మెంట్‌ను ఒకే విడతలో నిర్వహించాలని కోరుతూ మంగళవారం ‘ముఖ్యమంత్రి నివాస ముట్టడి’కి పిలుపునిచ్చారు. ఎస్ఎఫ్ఐ, డీవైఎఫ్ఐ తదితర వామపక్ష సంఘాలతో కలిసి విద్యార్థులు గాంధీ మైదానం నుంచి ముఖ్యమంత్రి సామ్రాట్ చౌదరి నివాసం వైపు దూసుకొస్తుండగా పోలీసులు అడ్డుకోవడంతో ఇరు వర్గాలు వాగ్వాదానికి దిగాయి.

# జైస్వాల్‌నే కాదు వైభవ్‌ని కూడా శిక్షించాల్సిందే..



టీమిండియా మాజీ క్రికెటర్ సంజయ్ మంజ్రేకర్

కొలంబోలో జరుగుతున్న 2వ టెస్ట్ తొలి రోజు టీమిండియా ఓపెనర్ యశస్వి జైస్వాల్, అసిత ఫెర్నాండో మధ్య జరిగిన వాగ్వాదం క్రికెట్ వర్గాల్లో చర్చకు దారితీసింది. భారత జట్టు తొలి ఇన్నింగ్స్ 17వ ఓవర్లో ఫెర్నాండో బౌలింగ్‌లో జైస్వాల్ పెవిలియన్ చేరాడు. ఆ తర్వాత జైస్వాల్ అతడి వైపు వెళ్లగా ఇద్దరి మధ్య మాటల యుద్ధం చోటు చేసుకుంది.

ఈ క్రమంలో ఫెర్నాండో తన తలను జైస్వాల్ వైపు కదిలించాడు. జైస్వాల్ కూడా ముందుకు వంగడంతో ఇద్దరి తలలు తాకాయి. ఘటనపై ఐసీసీ చర్యలు తీసుకుని ఇద్దరికీ మ్యాచ్ ఫీజులో 25 శాతం జరిమానా విధించింది. ఒక్కొక్కరికి ఒక డీమెరిట్ పాయింట్ కూడా కేటాయించింది. మంజ్రేకర్ మాత్రం ఈ శిక్ష సరిపోదని అభిప్రాయపడ్డారు. మైదానంలో శారీరకంగా తాకడం వంటి ఘటనలకు కఠినమైన చర్యలు అవసరమని ఆయన సూచించారు. ఈ సందర్భంగా యువ క్రికెటర్ వైభవ్ సూర్యవంశీకి సంబంధించిన గత ఘటనను మంజ్రేకర్ ప్రస్తావించారు. ఈ ఏడాది జరిగిన ఏ జట్ల ట్రై-సిరీస్‌లో భారత్ ఏ తరపున ఆడిన వైభవ్.. శ్రీలంక ఏ ఆటగాళ్లతో ఘర్షణకు దిగిన ఘటనను ఆయన గుర్తుచేశారు. ఐసీసీ, బీసీసీఐ ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని మంజ్రేకర్ కోరారు. యువ ఆటగాళ్లకు ఇటువంటి ప్రవర్తనను ఉపేక్షించడం సరైన సందేశం కాదని ఆయన పేర్కొన్నారు. ఎక్స్‌లో మంజ్రేకర్ స్పందిస్తూ ఐసీసీ, బీసీసీఐని ఉద్దేశించి తన అభిప్రాయాన్ని వెల్లడించారు. "వైభవ్ ఫర్ ఇండియా ఏ ఇటీవల.. ఇప్పుడు జైస్వాల్.. ఇలాంటి ప్రవర్తన నుంచి తప్పించుకునేలా చేస్తే, అదే ప్రవర్తనను మళ్లీ చేయడానికి వారికి అలవాటు పడేలా చేసినట్టే" అని ఆయన పేర్కొన్నారు. ఇలాంటి ఘటనలు క్రీడకు మంచిది కాదని, ఆటగాళ్ల భవిష్యత్తుపైనా ప్రభావం చూపొచ్చని మంజ్రేకర్ అభిప్రాయపడ్డారు. శారీరక ఘర్షణలు జరిగినప్పుడు కఠినమైన శిక్షలు ఉండాలని ఆయన సూచించాడు. రెండో రోజు ఆట ప్రారంభానికి ముందు జైస్వాల్ తన చర్యను సమర్థించుకున్నాడు. "అతను ఏం అన్నాడో మీకు తెలియకపోతే తీర్పు ఇవ్వొద్దు. ఎవరైనా హద్దు దాటితే వారికి తెలియజేయాలి. ఇది భారత్.. మేం పోరాడతాం, సమాధానం ఇస్తాం" అని చెప్పుకొచ్చాడు. జైస్వాల్, ఫెర్నాండోలకు జరిమానాతో పాటు డీమెరిట్ పాయింట్లు పడినా, మంజ్రేకర్ మాత్రం మరింత కఠిన చర్యల అవసరాన్ని ముందుకు తెచ్చారు. వైభవ్ సూర్యవంశీ ఘటనను కలిపి చూస్తే, యువ ఆటగాళ్ల ప్రవర్తనపై క్రికెట్ బోర్డులు ఎలాంటి సందేశం ఇవ్వాలన్న ప్రశ్న మరోసారి తెరపైకి వచ్చింది.

# గెలుపు ముంగిట భారత్!



- తొలి ఇన్నింగ్స్‌లో శ్రీలంక 290
- ఫాలో ఆన్ ఆడుతున్న శ్రీలంక
- 16 పరుగుల ఆధిక్యంలో శ్రీలంక
- సెంచరీతో ఆకట్టుకున్న సోనాల్

శ్రీలంకతో రెండో టెస్ట్‌లో టీమిండియా గెలుపు ముంగిట నిలిచింది. 213 పరుగుల భారీ లోటుతో ఫాలో ఆన్ ఆడిన శ్రీలంక నాలుగో రోజు ఆట ముగిసే సమయానికి రెండో ఇన్నింగ్స్‌లో 72.4 ఓవర్లలో 6 వికెట్లకు 229 పరుగులు చేసింది. క్రీజులో కేశర నువాంత(3 బ్యాటింగ్), సోనాల్ దినుషా(7 బ్యాటింగ్) ఉన్నారు. తొలి ఇన్నింగ్స్‌లో సెంచరీతో ఆకట్టుకున్న సోనాల్ దినుషాను ఔట్ చేస్తే భారత విజయం లాంఛనం కానుంది. ప్రస్తుతం శ్రీలంక 16 పరుగుల ఆధిక్యంలో ఉంది. ఆఖరి రోజైన గురువారం శ్రీలంకను వీలైనంత త్వరగా ఆలౌట్ చేస్తే భారత్ విజయం సులువు అవుతుంది. అయితే వర్షం ముప్పు పొంచి ఉండటం టీమిండియాను ఆందోళనకు గురిచేస్తోంది. వర్షం కరుణిస్తే విజయం భారత్ సొంతమవ్వనుంది. అంతకుముందు 265/8 ఓవర్‌నైట్ స్కోర్‌తో నాలుగో రోజు ఆటను ప్రారంభించిన శ్రీలంక తొలి ఇన్నింగ్స్‌లో 89.4 ఓవర్లలో 290 పరుగులకు కుప్పకూలింది. ఓవర్‌నైట్ బ్యాటర్ సోనాల్ దినుషా(162 బంతుల్లో 8 ఫోర్లు, 3 సిక్స్‌లతో 103) సెంచరీ పూర్తి చేసుకున్నాడు. శ్రీలంక చివరి రెండు వికెట్లను అరంగేట్ర స్పిన్నర్ సారాన్ష్ జైన్ దక్కించుకున్నాడు. ప్రసిధ్ కృష్ణ(3/52), మానవ్ సుతార్(3/85) మూడేసి వికెట్లు తీయగా.. మహమ్మద్ సిరాజ్, రవీంద్ర జడేజా తలో వికెట్ పడగొట్టారు. ఓవర్‌నైట్ స్కోర్‌కు శ్రీలంక 25 పరుగులు మాత్రమే జోడించింది. ఈ టెస్ట్ విజయంపై ఫోకస్ పెట్టిన భారత్ వ్యూహాత్మకంగా రెండో ఇన్నింగ్స్ ప్రారంభించకుండా శ్రీలంకను ఫాలో ఆన్ ఆడించింది. రెండో ఇన్నింగ్స్ ఆరంభంలోనే శ్రీలంకకు సిరాజ్ గట్టి షాకిచ్చాడు. లాహిరు ఉదానా(3)ను క్యాచ్ ఔట్‌గా పెవిలియన్ చేర్చాడు. పసిందు సూర్యబందార, కామిల్ మిశ్రా ఆచితూచి ఆడారు. 58 పరుగుల భాగస్వామ్యంతో క్రీజులో సెట్ అయిన ఈ జోడీని జడేజా విడదీసాడు. కామిల్ మిశ్రా(32)ఎల్బీగా పెవిలియన్ చేర్చాడు. క్రీజులోకి కామిందు మెండిస్ రాగా.. శ్రీలంక 83/2 స్కోర్‌తో లంచ్ బ్రేక్‌కు వెళ్లింది. సెకండ్ సెషన్‌లో శ్రీలంక ఆధిపత్యం చెలాయించింది. సూర్య బందార, కామిందు మెండీస్ ఆచితూచి ఆడారు. ఈ ఇద్దరూ సాధికారికంగా బ్యాటింగ్ చేస్తూ..భారత బౌలర్ల సహనానికి పరీక్షగా నిలిచారు. పసిందు సూర్యబందార 78 బంతుల్లో హాఫ్ సెంచరీ సాధించగా.. కామిందు మెండీస్ 87 బంతుల్లో హాఫ్ సెంచరీ సాధించాడు. 115 పరుగుల భారీ భాగస్వామ్యంతో ప్రమాదకరంగా మారిన ఈ జోడీని ప్రసిధ్ కృష్ణ విడదీసాడు. శుభ్‌మన్ గిల్ స్టన్నింగ్ క్యాచ్‌తో కామిందు మెండీస్‌ను పెవిలియన్ చేర్చాడు. ఈ వికెట్‌తో ప్రసిధ్ కృష్ణ మ్యాచ్‌ను భారత్‌వైపు తిప్పాడు. కెప్టెన్ ధనంజయ డిసిల్వా క్రీజులోకి రాగా.. శ్రీలంక 199/3 స్కోర్‌తో టీ బ్రేక్‌కు వెళ్లింది. మూడో సెషన్‌లో భారత బౌలర్లు నిప్పులు చెరిగారు. ఆచితూచి ఆడిన ధనంజయ డిసిల్వా(23)తో పాటు సెంచరీ దిశగా సాగిన పసిందు సూర్యబందార(173 బంతుల్లో 10 ఫోర్లు, సిక్స్‌తో 92)ను మానవ్ సుతార్ వరుస ఓవర్లలో పెవిలియన్ చేర్చాడు. ఆ వెంటనే నిరోషన్ డిక్‌వెల్లాను సరాన్ష్ జైన్ వికెట్ల ముందు బోల్తా కొట్టించాడు. సోనాల్ దినుషా, కేశర నువాంత మరో వికెట్ పడకుండా నాలుగో రోజు ఆటను ముగించారు.

# ఆసియా గేమ్స్ క్రికెట్ షెడ్యూల్ విడుదల

- సెప్టెంబర్ 18న టీమ్ఇండియా మహిళలు మొదటి మ్యాచ్




2026 ఆసియా గేమ్స్ నుంచి అదిరే అప్డేట్ వచ్చింది. జపాన్ వేదికగా జరగనున్న ఈ గేమ్స్?లో క్రికెట్ పోటీలకు సంబంధించిన షెడ్యూల్ విడుదలైంది. ముందుగా మహిళల జట్ల మధ్య పోటీలను నిర్వహించనున్నారు. ఆ తర్వాత పురుషుల కాంపిటీషన్ ఉండనుంది. ఈ మ్యాచ్‌లన్నింటినీ జపాన్‌లోని కొరోగి అథ్లెటిక్ పార్క్‌లో నిర్వహించనున్నారు. మహిళల క్రికెట్ పోటీల్లో భారత్, శ్రీలంక, జపాన్, మలేసియా, బంగ్లాదేశ్, పాకిస్థాన్, పీపుల్స్ రిపబ్లిక్ ఆఫ్ చైనా, థాయ్‌లాండ్ జట్లు పోటీ పడనున్నాయి. ఈ మ్యాచ్‌లు సెప్టెంబర్ 17న షురూ కానుండగా, టీమ్ఇండియా మహిళలు తమ మొదటి మ్యాచ్ సెప్టెంబర్ 18న ఆడనుంది. ఈ మ్యాచ్ జపాన్‌తో జరగనుంది.ఆ తర్వాత 20, 22 తేదీల్లోనే సెమీఫైనల్, ఫైనల్ మ్యాచ్‌లు నిర్వహించనున్నారు. ఫైనల్ మ్యాచ్ సెప్టెంబర్ 22న జరుగుతుంది, అలాగే కాంస్య పతక పోరు కూడా అదే రోజు ఉంటుంది. ఈ పోటీల్లో హర్మన్‌ప్రీత్ కౌర్ నాయకత్వంలో భారత జట్టు బరిలోకి దిగనుంది. గత సీజన్‌లో గోల్డ్ మెడల్ సాధించిన టీమ్ఇండియా మరోసారి అదే ప్రదర్శనను రిపీట్ చేయాలని ఆశిస్తోంది. పురుషుల క్రికెట్ పోటీల్లో భారత్‌తోపాటు పాకిస్థాన్, బంగ్లాదేశ్, శ్రీలంక జట్లు టోర్నమెంట్‌లో నేరుగా అర్హత సాధించాయి. ఈ జట్లు నేరుగా క్వార్టర్ ఫైనల్స్ ఆడుతాయి. మరోవైపు, ఆఫ్ఘానిస్థాన్, జపాన్, నేపాల్ టీమ్స్‌ను 'గ్రూప్ -సీ'లో ఉంచారు. హాంకాంగ్, చైనా, మలేసియా, ఒమన్ జట్లను 'గ్రూప్ దీ'లో చేర్చారు. ఈ గ్రూపులలో విజేతలుగా నిలిచిన జట్లు, క్వార్టర్ ఫైనల్స్‌కు చేరుకున్న జట్లతో తలపడతాయి. గ్రూప్ స్టేజ్‌లో ఓడిపోయిన జట్లు పోటీ నుంచి నిష్క్రమిస్తాయి. ఇక పురుషుల క్రికెట్ పోటీలు సెప్టెంబర్ 24న ప్రారంభమవుతాయి. ముందుగా గ్రూప్ ఏ, గ్రూప్ బీలోని జట్లు పోటీపడతాయి. ఆ తర్వాత భారత 28న తమ తొలి మ్యాచ్ ఆడనుంది. అయితే అది క్వార్టర్ ఫైనల్ మ్యాచ్ కాబట్టి ప్రత్యర్థి ఎవరో ఇంకా తేలలేదు. అయితే శ్రేయస్ అయ్యర్ కెప్టెన్సీలో టీమ్ఇండియా ఈ పోటీలో ఆడనుంది. తిలక్ వర్మ వైస్ కెప్టెన్‌గా వ్యవహరించనున్నాడు.

# సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో చెమటోడుస్తున్న ప్లేయర్లు




టీమిండియా అభిమానులకు ఓ గుడ్ న్యూస్ వచ్చింది. గాయాలు, రిహాబిలిటేషన్ కారణంగా జట్టుకు దూరంగా ఉన్న టీమిండియా పరిమిత ఓవర్ల స్టార్ ఆటగాళ్లు తిరిగి పూర్తి ఫిట్‌నెస్ సాధించేందుకు కఠోరంగా శ్రమిస్తున్నారు. ప్రస్తుతం, భారత్, శ్రీలంక జట్ల మధ్య టెస్ట్ సిరీస్ జరుగుతుండగా.. మరోవైపు బెంగళూరులోని బీసీసీఐ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో ప్లేయర్లు వర్కౌట్లు చేస్తూ రీ-ఎంట్రీకి సిద్ధమవుతున్నారు. బెంగళూరులోని వర్కౌట్స్, ట్రైనింగ్ సెషన్లకు సంబంధించిన ఫోటోలు ప్రస్తుతం సోషల్ మీడియాలో బాగా వైరల్ అవుతున్నాయి. స్టార్ పేసర్ జస్ప్రీత్ బుమ్రా వర్క్ లోడ్ మేనేజ్మెంట్‌పై దృష్టి పెట్టగా.. స్టార్ ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్యా తన గాయం నుంచి వేగంగా కోలుకుంటూ పునరావాస శిక్షణ పొందుతున్నాడు. విధ్వంసకర ఓపెనర్ అభిషేక్ శర్మ, యంగ్ పేసర్ హర్షిత్ రాణా, వికెట్ కీపర్ బ్యాటర్ సంజూ శాంసన్, ఆల్‌రౌండర్ శివమ్ దూబే, స్పిన్నర్ రవి బిష్ణోయ్, సూర్యాంశ్ షెడ్గేలు ఒకే చోట తీవ్రంగా సాధన చేస్తున్నారు. ఈ ప్లేయర్ల ఫోకస్ అంతా రాబోయే ద్వైపాక్షిక సిరీస్‌లపైనే ఉంది. సెప్టెంబర్‌లో ఆఫ్ఘనిస్తాన్‌తో జరగనున్న 3 మ్యాచ్ ల టీ20 అంతర్జాతీయ సిరీస్ సమయానికి ఈ వైట్-బాల్ స్టార్లు పూర్తి ఫిట్నెస్ సాధించాలని చూస్తున్నారు. ఆ తర్వాత అక్టోబర్ లో వెస్టిండీస్ జట్టుతో జరగబోయే వన్డే, టీ20 సిరీస్ కు ఈ కీలక ఆటగాళ్లందరూ భారత జట్టుకు అందుబాటులోకి వచ్చే అవకాశం ఉంది. ఇటీవల ఆటగాళ్లకు ఫిట్‌నెస్ క్లియరెన్స్ ఇవ్వడం, గాయాల నిర్వహణపై కొన్ని ఆరోపణలు తలెత్తిన నేపథ్యంలో సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్(సీవోఈ) హెడ్ వీవీఎస్ లక్ష్మణ్, బీసీసీఐ కార్యదర్శి దేవజిత్ సైకియా మీడియా సమావేశంలో మాట్లాడి క్లారిటీ ఇచ్చారు. ఎంపిక ప్రక్రియలో, ఆటగాళ్ల ఫిట్‌నెస్ నివేదికలలో పూర్తి పారదర్శకత ఉంటుందని లక్ష్మణ్ స్పష్టం చేశారు. ఒకవేళ ఆటగాడు మ్యాచ్ సమయానికి ఫిట్‌నెస్ నిరూపించుకోకపోతే మరికరిని ఎంపిక చేస్తారని అర్థం. తాము నిందలు వేసేందుకు ఇష్టపడమని.. ప్లేయర్లు కోలుకునే పురోగతిని ప్రతి దశలో పర్యవేక్షిస్తూ సెలెక్షన్ కమిటీకి నివేదిస్తామని వీవీఎస్ లక్ష్మణ్ పేర్కొన్నారు. మొత్తానికి సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ లో స్టార్ ప్లేయర్ల కఠోర శ్రమ చూస్తుంటే.. త్వరలోనే భారత వైట్-బాల్ జట్టు పూర్తి బలంతో మైదానంలోకి దిగడం ఖాయంగా కనిపిస్తోంది.

# టాప్ లేపిన మిచెల్ స్టార్క్, రిషభ్ పంత్!

- ఐసీసీ టెస్ట్ ర్యాంకింగ్స్ విడుదల

ఐసీసీ టెస్ట్ ర్యాంకింగ్స్‌లో ఆస్ట్రేలియా పేసర్ మిచెల్ స్టార్క్ దుమ్మురేపాడు. టీమిండియా స్టార్ పేసర్ జస్ప్రీత్ బుమ్రాను వెనక్కినెట్టి మిచెల్ స్టార్క్ అగ్రస్థానాన్ని కైవసం చేసుకున్నాడు. ఐసీసీ తాజాగా విడుదల చేసిన టెస్ట్ ర్యాంకింగ్స్‌లో మిచెల్ స్టార్క్ 872 పాయింట్లతో నెంబర్ వన్ బౌలర్‌గా నిలిచాడు. జస్ప్రీత్ బుమ్రా(862), మ్యాట్ హెన్రీ(861) తర్వాతి స్థానాల్లో కొనసాగుతున్నారు. ఆసీస్ కెప్టెన్ పాట్ కమిన్స్(807) ఒక స్థానాన్ని మెరుగుపర్చుకుని నాలుగో స్థానంలో నిలిచాడు. బంగ్లాదేశ్‌తో ఇటీవల ముగిసిన రెండు టెస్ట్‌ల సిరీస్‌లో మిచెల్ స్టార్క్ నిప్పులు చెరిగాడు. రెండో టెస్ట్‌లో 10 వికెట్లు పడగొట్టిన స్టార్క్.. రెండు స్థానాలు ఎగబాకి బౌలింగ్ ర్యాంకింగ్స్‌లో అగ్రస్థానాన్ని కైవసం చేసుకున్నాడు. మిచెల్ స్టార్క్ అద్భుత ప్రదర్శనతో ఈ మ్యాచ్‌లో భారత్ ఇన్నింగ్స్ 51 పరుగుల తేడాతో విజయం సాధించింది. ఈ మ్యాచ్ తొలి ఇన్నింగ్స్‌లో ఫస్ట్ బాల్‌కే మిచెల్ స్టార్క్ వికెట్ పడగొట్టాడు. బ్యాటింగ్ విభాగంలో టీమిండియా స్టార్ వికెట్ కీపర్ రిషభ్ పంత్, కేఎల్ రాహుల్ తమ ర్యాంకులను మెరుగుపర్చుకున్నారు. శ్రీలంకతో రెండు టెస్ట్‌ల సిరీస్‌లో ఈ ఇద్దరూ మెరుగైన ప్రదర్శన చేశారు. రెండో టెస్ట్‌లో రిషభ్ పంత్ హాఫ్ సెంచరీతో సత్తా చాటగా.. తొలి టెస్ట్‌లో కేఎల్ రాహుల్ తృటిలో శతకాన్ని చేజార్చుకున్న సంగతి తెలిసిందే. ఈ ప్రదర్శనతో రిషభ్ పంత్(711) ఆరు స్థానాలు ఎగబాకి టాప్-10లోకి వచ్చి 8వ ర్యాంకు అందుకోగా.. కేఎల్ రాహుల్ ఐదు స్థానాలు మెరుగుపర్చుకొని 30వ స్థానంలో నిలిచాడు. మరోవైపు స్థాయికి తగ్గ ప్రదర్శన చేయలేకపోయిన శుభ్‌మన్ గిల్(711)8వ స్థానానికి పడిపోయాడు. రెండు టెస్ట్‌ల్లో విఫలమైన యశస్వి జైస్వాల్ రెండు స్థానాలు దిగజారాడు. ఇంగ్లండ్ బ్యాటర్ హ్యారీ బ్రూక్(874), జో రూట్(850), స్టీవ్ స్మిత్(840), ట్రావిస్ హెడ్(811), టెంబా బవుమా(775) టాప్-5 ర్యాంకుల్లో కొనసాగుతున్నారు. బెస్ట్ ఆల్‌రౌండర్‌గా రవీంద్ర జడేజా(428)తన అగ్రస్థానాన్ని నిలబెట్టుకున్నాడు. శ్రీలంకతో తొలి టెస్ట్‌లో జడేజా ఆల్‌రౌండ్ ప్రదర్శనతో ఆకట్టుకున్న సంగతి తెలిసిందే.



గురువారం, ఆగస్టు 27, 2026
మన విశ్వం
VOICE OF THE PEOPLE-POWER OF TRUTH
తెలుగు వార్తా దినపత్రిక







# గర్భంతోనూ జిమ్‌లో సమంత.

గర్భధారణ సమయంలో తన ఫిట్‌నెస్ రొటీన్ ఎలా మారిందో నటి సమంత వెల్లడించింది. జిమ్‌లో వర్కౌట్ చేస్తున్న ఫొటోలు, వీడియోలను సోషల్ మీడియాలో పంచుకుంది. ఇన్నాళ్లూ శరీరాన్ని మరింతగా శ్రమ పెట్టేలా శిక్షణ తీసుకున్నానని.. ఇప్పుడు శరీరం చెప్పేది వినడం నేర్చుకుంటున్నానని తెలిపింది.

సమంత ఎన్నో ఏళ్లుగా శక్తిని పెంచే వ్యాయామాలు చేస్తున్నట్లు చెప్పింది. గర్భధారణ సమయంలోనూ వ్యాయామం కొనసాగించేందుకు వైద్యుడి అనుమతి తీసుకున్నానని తెలిపింది. తన ట్రైనర్‌కు గర్భధారణ సమయంలో వ్యాయామాలపై ప్రత్యేక శిక్షణ ఉందని వెల్లడించింది. తన శరీరం, గత అనుభవం, గర్భధారణ పరిస్థితికి తగ్గట్టుగా వర్కౌట్స్‌లో మార్పులు చేసినట్లు వివరించింది.

ప్రతి ఒక్కరి గర్భధారణ ఒకేలా ఉండదని సమంత చెప్పింది. తన వర్కౌట్స్‌ను ఇతరులు అనుసరించొద్దని సూచించింది. వ్యాయామం చేసే ముందు వైద్యుడిని సంప్రదించాలని.. నిపుణులైన ట్రైనర్ సాయం తీసుకోవాలని కోరింది..తాను పంచుకున్న వీడియోలో ఛాతీకి సంబంధించిన వ్యాయామం చేసింది. అయితే గతంలోలా ఎక్కువ బరువు ఎత్తడంపై కాకుండా.. శరీరం ఇచ్చే సంకేతాలను గమనించడంపైనే ఇప్పుడు దృష్టి పెట్టినట్లు చెప్పింది. కొన్ని రోజులు వ్యాయామాన్ని తగ్గిస్తున్నానని తెలిపింది.

కొన్ని రోజులైతే వర్కౌట్ మొత్తం నేలపై పడుకోవడంతోనే పూర్తవుతోందని సమంత సరదాగా వ్యాఖ్యానించింది. ఇన్నేళ్లుగా తన శరీరాన్ని మరింత పని చేయడానికి సిద్ధం చేశానని.. ఇప్పుడు తక్కువ పని చేయమని శరీరం అడిగినప్పుడు దాన్ని గౌరవించడం నేర్చుకుంటున్నానని పేర్కొంది.

చిన్న ప్రాణాన్ని మోస్తున్న సమయంలో లక్ష్యాలు కూడా మారిపోతాయని సమంత అభిప్రాయపడింది. తన శరీరం ఇప్పటివరకు చేసిన పనుల్లో ఇదే అత్యంత బలమైన పని కావచ్చని పేర్కొంది. సమంత 2026 జూన్‌లో తన గర్భధారణ విషయాన్ని బహిరంగంగా వెల్లడించింది. భర్త రాజ్ నిడిమోరుతో కలిసి తొలి బిడ్డకు స్వాగతం పలకబోతున్నట్లు ప్రకటించింది.

# ‘టాక్సిక్’ దూకుడు..

## మధ్యాహ్నానికే ‘ధురంధర్‘ను దాటేసిన యశ్ మూవీ

యశ్ నటించిన ‘టాక్సిక్’కు ఆరంభంలో ఎదురైన విమర్శలు, ఆన్‌లైన్ ట్రోలింగ్ నేడు బాక్సాఫీసు ప్రభంజనానికి ఏమాత్రం అడ్డుకాలేదు. బుధవారం ఉదయం నుంచే సినిమా థియేటర్ల వద్ద సందడి కనిపించింది. మధ్యాహ్నానికి ముందే రణ్‌వీర్ సింగ్ ‘ధురంధర్’ తొలిరోజు భారత్‌లో నెట్ వసూళ్లను ‘టాక్సిక్’ దాటేసింది.

ఓనం సెలవును టార్గెట్ చేస్తూ ‘టాక్సిక్’ ప్రేక్షకుల ముందుకొచ్చింది. సినిమా హింస, రొమాంటిక్ సన్నివేశాలపై విడుదలకు ముందు చర్చ జరిగినా ప్రేక్షకుల స్పందన మాత్రం బలంగా కనిపించింది. ఉదయం షోలకే పలు ప్రాంతాల్లో థియేటర్లు కళకళలాడాయి.

‘సాక్‌నిల్క్’ లెక్కల ప్రకారం బుధవారం మధ్యాహ్నం 12.40 గంటలకు ‘టాక్సిక్’ ఇండియా నెట్ వసూళ్లు రూ.31.76 కోట్లకు చేరాయి. 9,003 షోల ద్వారా ఈ మొత్తం వచ్చింది. ఇండియా గ్రాస్ రూ.37.48 కోట్లుగా నమోదైంది.

కన్నడ 2డీ వెర్షన్ 77.69 శాతం ఆక్యుపెన్సీతో ముందుంది. తెలుగు వెర్షన్ 57.08 శాతం, తమిళం 45.25 శాతం, మలయాళం 40.13 శాతం, హిందీ 37.85 శాతం ఆక్యుపెన్సీ నమోదు చేశాయి.




రణ్‌వీర్ సింగ్ నటించిన ‘ధురంధర్’ తొలిరోజు ఇండియాలో రూ.28.60 కోట్ల నెట్, రూ.33.60 కోట్ల గ్రాస్ వసూళ్లు సాధించింది. ‘టాక్సిక్’ ఉదయం షోలతోనే ఆ మార్కును అధిగమించింది.

యశ్ ‘కేజీఎఫ్: చాప్టర్ 2’ తర్వాత వస్తున్న సినిమా కావడంతో దీనిపై భారీ అంచనాలు ఉన్నాయి. తొలి రోజు ప్రపంచవ్యాప్తంగా రూ.100-120 కోట్ల వసూళ్లు సాధించొచ్చని ట్రేడ్ వర్గాలు అంచనా వేశాయి. ఆ స్థాయికి చేరితే అతిపెద్ద ఇండియన్ ఓపెనర్లలో ఒకటిగా నిలుస్తుంది. రూ.100 కోట్ల మార్కును దాటితే ‘కేజీఎఫ్: చాప్టర్ 2’ తర్వాత ఆ ఘనత సాధించిన రెండో కన్నడ చిత్రంగా నిలుస్తుంది.




# యంగ్ హీరోల కొత్త ట్రెండ్‌లోకి కార్తికేయ!

టాలీవుడ్‌లో హీరోలు కేవలం యాక్టింగ్‌కే రిమితం కాకుండా కథ, స్క్రీన్‌ప్లే, దర్శకత్వం వంటి విభాగాల్లోనూ తమదైన ముద్ర వేయాలని చూస్తున్న ట్రెండ్ క్రమంగా బలపడుతోంది. ఒకప్పుడు హీరోగా కెరీర్‌లో సెటిలైన తర్వాతే డైరెక్షన్ వైపు అడుగులు పడేవి. కానీ ఇప్పుడు యంగ్ హీరోలు తమకు నచ్చిన కథలను తామే చెప్పాలనే ఆలోచనతో కెమెరా వెనక్కి వెళ్లేందుకు ఆసక్తి చూపిస్తున్నారు. ఈ మారుతున్న ట్రెండ్‌లో ఇప్పుడు కార్తికేయ కూడా చేరబోతున్నారనే వార్త ఆసక్తిని పెంచుతోంది. నటుడిగా తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న కార్తికేయ, ఇకపై కేవలం హీరోగా మాత్రమే కాకుండా సినిమా మేకింగ్‌లోని ఇతర విభాగాలపైనా దృష్టి పెట్టబోతున్నారనే డిస్కషన్ మొదలైంది. ముఖ్యంగా కథను సెలెక్ట్ చేసుకోవడం నుంచి దాన్ని తెరపైకి తీసుకురావడం వరకు మొత్తం క్రియేటివ్ రెస్పాన్సిబులిటీ తీసుకోవాలనే ఆలోచన యంగ్ హీరోల్లో పెరుగుతున్న నేపథ్యంలో కార్తికేయ డెసిషన్ కూడా అదే దిశలో కనిపిస్తోంది. ఇప్పటికే టాలీవుడ్‌లో నటుల నుంచి డైరెక్టర్లుగా మారిన ఉదాహరణలు చాలానే ఉన్నాయి. ఎన్టీఆర్, కృష్ణ, విజయ నిర్మల వంటి దిగ్గజాల నుంచి అవసరాల శ్రీనివాస్, విశ్వక్‌సేన్ వంటి సమకాలీన నటుల వరకు పలువురు యాక్టింగ్‌తో పాటు దర్శకత్వ బాధ్యతలు కూడా చేపట్టారు. అయితే ప్రస్తుత తరం హీరోలలో ఈ ఆలోచనకు మరో కొత్త కోణం కనిపిస్తోంది. తమ మార్కెట్‌కు తగ్గ కథ కోసం ఎదురు చూడటం కంటే, తమకు నమ్మకం ఉన్న కథను తామే డెవలప్ చేసి ఆడియన్స్ ముందుకు తీసుకురావాలనే ప్రయత్నం పెరుగుతోంది. దీనికి మరిన్ని ఎగ్జాంపుల్స్ కూడా కనిపిస్తున్నాయి. ఆల్రెడీ కిరణ్ అబ్బవరం డైరెక్టర్ గా మారి సినిమా చేస్తుండగా, ఎనర్జిటిక్ స్టార్ రామ్ పోతినేని కూడా ఇదే బాటలో వెళ్తూ, తన స్వీయ దర్శకత్వంలో నటిస్తున్నారు. సుమారు రెండు దశాబ్దాల నటనా ప్రయాణం తర్వాత రామ్ డైరెక్షన్ లోకి అడుగుపెడుతున్నారు. యాక్టర్ గా సంపాదించిన ఎక్స్‌పీరియెన్స్‌ను ఇప్పుడు డైరెక్టర్ గా ఉపయోగించుకోవాలనే ప్రయత్నం ఈ మారుతున్న ఆలోచనా విధానానికి అద్దం పడుతోంది.

# కృతి సనన్ డ్రెస్‌పై దుమారం..

## రాఖీ యాడ్ ను వెనక్కి తీసుకున్న జ్యువెల్లరీ బ్రాండ్


ప్రముఖ జ్యువెలరీ బ్రాండ్ ‘జీవ‘ తన రక్షాబంధన్ వాణిజ్య ప్రకటనను అన్ని మీడియా వేదికల నుంచి ఉపసంహరించుకుంది. బాలీవుడ్ నటి కృతి సనన్ నటించిన ఈ యాడ్‌లో ఆమె ధరించిన దుస్తులు, ప్రచార కాన్సెప్ట్‌పై తీవ్ర విమర్శలు వెల్లువెత్తడంతో సంస్థ ఈ నిర్ణయం తీసుకుంది. ఈ వివాదంపై ‘జీవ‘ బుధవారం ఇన్‌స్టాగ్రామ్ వేదికగా ఒక ప్రకటన విడుదల చేసింది.



భారతీయ సంస్కృతి, సంప్రదాయాలు, పండుగల పట్ల తమకు అపారమైన గౌరవం ఉందని సంస్థ పేర్కొంది. కుటుంబ సభ్యులతో కలిసి పండుగ జరుపుకోవడంతో పాటు, పెంపుడు జంతువులతోనూ ఆ అనుబంధాన్ని పంచుకోవాలనే ఉద్దేశంతోనే ఈ ప్రచారాన్ని రూపొందించినట్లు వివరించింది. అయితే, ఇది అనుకోకుండా కొందరి మనోభావాలను దెబ్బతీసిందని అంగీకరించింది. అందరి అభిప్రాయాలను గౌరవిస్తూ సదరు ప్రకటనను ఉపసంహరించుకుంటున్నట్లు వెల్లడించింది.సుమారు 36 సెకన్ల నిడివి ఉన్న ఈ వీడియోలో కృతి సనన్, బ్రాలెట్ తరహా బ్లౌజ్‌తో కూడిన ఇండో-వెస్ట్రన్ దుస్తుల్లో కనిపించారు. తన సోదరుడికి, ఒక పెంపుడు శునకానికి ఆమె రాఖీ కడుతున్నట్లు అందులో చూపించారు. ఆమె వస్త్రధారణతో పాటు, రక్షాబంధన్ సంప్రదాయంలో పెంపుడు జంతువును భాగం చేయడంపై సామాజిక మాధ్యమాల్లో అభ్యంతరాలు వ్యక్తమయ్యాయి.ఈ ప్రకటనపై నటి, బీజేపీ ఎంపీ కంగనా రనౌత్ ఘాటుగా విమర్శలు గుప్పించారు. ‘లోదుస్తులు ధరించి సోదరుడికి రాఖీ కడతారా?‘ అని ప్రశ్నిస్తూ, ఇది ఉద్దేశపూర్వకంగా అసభ్యంగా ఉందని వ్యాఖ్యానించారు. నెటిజన్ల నుంచి కూడా పెద్ద ఎత్తున విమర్శలు రావడంతో, సదరు జ్యువెల్లరీ బ్రాండ్ ఈ ప్రకటనను వెనక్కి తీసుకుంది.



# గోల్డెన్ గ్లోబ్ అవార్డును పగలగొట్టి అబద్ధం చెప్పా: ఇయాన్ మెక్‌కెల్లెన్



దిగ్గజ నటుడు సర్ ఇయాన్ మెక్‌కెల్లెన్ తన కెరీర్‌లో అందుకున్న ఏకైక గోల్డెన్ గ్లోబ్ అవార్డుకు సంబంధించి తాను చెప్పిన ఒక అబద్ధాన్ని తాజాగా వెల్లడించారు. ప్రమాదవశాత్తు ఆ పురస్కారం మెమొంటో విరిగిపోవడంతో, అది కనిపించడం లేదని నిర్వాహకులకు అబద్ధం చెప్పినట్లు ఆయన అంగీకరించారు. 1997లో “రస్పుటిన్: డార్క్ సర్వెంట్ ఆఫ్ డెస్టినీ“ చిత్రంలో అద్భుత నటనకు గానూ మెక్‌కెల్లెన్ ఉత్తమ సహాయ నటుడిగా గోల్డెన్ గ్లోబ్ అవార్డును దక్కించుకున్నారు. త్వరలో ప్రసారం కానున్న ‘టీ విత్ జూడీ డెంచ్ ఫీచరింగ్ సర్ ఇయాన్ మెక్‌కెల్లెన్‘ అనే ప్రత్యేక కార్యక్రమంలో ఆయన ఈ ఆసక్తికర సంఘటనను గుర్తుచేసుకున్నారు. దీనికి సంబంధించిన ఒక వీడియో క్లిప్ ప్రస్తుతం సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతోంది.“ఆ గోల్డెన్ గ్లోబ్ ప్రతిమను ఎలా తయారు చేశారో తెలుసుకోవాలనే కుతూహలంతో దాని కింద ఉన్న ఒక స్క్రూను విప్పాను. వెంటనే ఆ పురస్కారం ముక్కలైపోయింది. దాన్ని నేను తిరిగి అమర్చలేకపోయాను. అదే సమయంలో నా పేరును ఆ ప్రతిమపై చెక్కడం కోసం దానిని తిరిగి పంపాలని నిర్వాహకులు కోరారు. దాంతో అది కనిపించడం లేదని వారికి అబద్ధం చెప్పాల్సి వచ్చింది“ అని మెక్‌కెల్లన్ వివరించారు.మెక్‌కెల్లెన్ తన సుదీర్ఘ కెరీర్‌లో అందుకున్న ఏకైక గోల్డెన్ గ్లోబ్ పురస్కారం ఇదే కావడం విశేషం. ఇదే కార్యక్రమంలో పాల్గొన్న మరో ప్రముఖ నటి డేమ్ జూడీ డెంచ్ కూడా తన ఆస్కార్ అవార్డుకు సంబంధించిన ఒక పొరపాటును పంచుకున్నారు. స్కై ఆర్ట్స్ ఛానల్‌లో ఈ కార్యక్రమం త్వరలో ప్రసారం కానుంది.

# నా అంత సాధించాక మాట్లాడండి..

## శత్రువులకు క్వీన్ మాస్ వార్నింగ్!

నటి, బీజేపీ ఎంపీ కంగనా రనౌత్ తనపై విమర్శలు గుప్పిస్తున్న పలువురు బాలీవుడ్ ప్రముఖులపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. సోమవారం స్టిల్ ఫోటోగ్రాఫర్లతో మాట్లాడిన కంగన .. కెరీర్‌లో ఎలాంటి విజయం సాధించని వారు తనకు నీతులు చెప్పాల్సిన అవసరం లేదని తేల్చి చెప్పారు. గత కొన్ని నెలలుగా తనపై అనుచిత వ్యాఖ్యలు చేస్తున్న తోటి నటీనటులు, ప్రముఖులకు గట్టి కౌంటర్ ఇచ్చారు. ఆశుతోష్ రాణా, సోనూ సూద్, రాఖీ సావంత్, తాప్సీ పన్నులను పేరుపేరునా ప్రస్తావిస్తూ కంగనా అసహనం వ్యక్తం చేశారు. నన్ను కుక్కలా మొరుగుతానని ఆశుతోష్ రాణా అంటారు. ఎలా నడుచుకోవాలో నేర్చుకోవాలని సోనూ సూద్ సలహాలు ఇస్తారు. రాఖీ సావంత్ నా వ్యక్తిత్వాన్ని ఉద్దేశించి అసభ్యకర వ్యాఖ్యలు చేస్తుంది. ఇక తాప్సీ పన్ను అయితే నా తల్లిదండ్రులు.. నా పెంపకం.. నా నేపథ్యాన్ని వరుసగా అవమానిస్తూనే ఉంది! అని కంగనా మండిపడ్డారు తమ కెరీర్‌లో తాను సాధించిన విజయంలో కనీసం 1 శాతం కూడా సాధించలేని వారి ఉచిత సలహాలు వినేందుకు తాను సిద్ధంగా లేనని కంగనా స్పష్టం చేశారు. నా లైఫ్‌లో నేను సాధించిన విజయంలో ఒక శాతం కూడా సాధించని వారి జ్ఞానాన్ని నేను వినను. పరిశ్రమలో విఫలమై.. ఆదరణ లేని కొందరు వ్యక్తులు ఎప్పుడూ నన్ను తిడుతూనే ఉంటారు. వారు మీడియా దృష్టిని ఆకర్షించడానికే ఇదంతా చేస్తున్నారు. ముందు నా స్థాయికి ఎదగండి.. ఆ తర్వాత మాట్లాడండి. నాకంటే ఎక్కువ విజయం సాధించిన వారు చెబితేనే నేను వింటాను.. ఇక సహించేది లేదు! అని వ్యాఖ్యానించారు.జెన్ జెడ్ .జంతర్ మంతర్ వద్ద జరిగిన విద్యార్థుల నిరసనలపై కంగనా చేసిన కామెంట్లు తీవ్ర వివాదాస్పదమైన సంగతి తెలిసిందే. ఆ సమయంలో కొంతమంది యువకులను, మహిళలను -జనరేషన్ గట్టర్- అని కంగనా సంబోధించడాన్ని సోనూ సూద్ తప్పుపట్టారు. అదేవిధంగా తాప్సీతోనూ కంగనకు పాత విభేదాలు మళ్లీ మొదలయ్యాయి. గతంలో 2014లోనే భారత్‌కు నిజమైన స్వాతంత్ర్యం వచ్చిందని కంగనా అన్న మాటలపై రాఖీ సావంత్ పంచ్ లు విసిరారు.

"MANA VISHWAM" vide PRGI Registration No. "TGTEL/26/A4450" Printed by SRI VENKATESWARA PRINTING SOLUTIONS, Published by Nameendla Pramod on behalf of Nameendla Pramod, printed at 11-1/B/42, BPM GREEN LANDS COLONY, PRVATHAPUR, MEDIPALLY MANDAL AND DIVISION, GHMC, MEDCHAL MALKAJGIRI, TELANGANA - 500098 and published at H No 2-96, Geesugonda, Gorrekunta editor Nameendla Pramod. Gmail- manavishwamtelugudaily@gmail.com, Cell- 6305638569